జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శుక్రవారం 20 నవంబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 253 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , కార్తీక మాసము , తిథి: దశమి - 07:17:14 వరకు, ఏకాదశి - 30:33:15 వరకు నక్షత్రంపూర్వాభాద్ర - 06:57:05 వరకు కరణంగర - 07:17:14 వరకు, వణిజ - 19:01:53 వరకు పక్షంశుక్ల యోగంవజ్ర - 28:55:31 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com

తొలిసారి ఆన్‌స్క్రీన్ క్యాలిక్యులేటర్

జేఈఈ అడ్వాన్స్‌డ్ 2027లో భారీ మార్పు

న్యూఢిల్లీ, నవంబర్ 19(ప్రజాజ్యోతి):
జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసే విద్యార్థులకు ఐఐటీ ఢిల్లీ చారిత్రాత్మక ఊరటనిచ్చింది. పరీక్ష చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా, మొదటిసారిగా అభ్యర్థులకు 'ఆన్‌స్క్రీన్ క్యాలిక్యులేటర్' వినియోగించుకునే అవకాశాన్ని కల్పించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. సుదీర్ఘ లెక్కలతో కుస్తీ పడే ఐఐటీ ఆశావహులకు సమయం ఆదా చేసేలా ఈ నిర్ణయం

మిగతా 2లో..

ఆఫ్రికాలో రక్తహీనత నివారణకు ముందడుగు!

గేట్స్ ఫౌండేషన్‌తో హైదరాబాద్ బీఈ బయోసోల్ ఒప్పందం

హైదరాబాద్, నవంబర్ 19(ప్రజాజ్యోతి):
ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని వేధిస్తున్న ఐరన్ డెఫిషియన్సీ అనీమియా వల్ల కలిగే రక్తహీనత నివారణకు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న

మిగతా 2లో..

రోడ్ కనెక్టివిటీలో ప్రపంచంలోనే భారత్ నంబర్ వన్

మౌలిక వసతుల కల్పనలో సాంకేతికత కీలక పాత్ర
జాతీయ రహదారుల నిర్మాణంలో పూర్తి నాణ్యత
కేంద్ర రోడ్డు రవాణ శాఖామంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి
మంచి రోడ్లు లేకుండా ఏ దేశం అభివృద్ధి చెందదు
అభివృద్ధి చెందిన దేశాలు గొప్ప రోడ్లను నిర్మించవు
గొప్ప రోడ్లే ధనిక, అభివృద్ధి చెందిన దేశాలుగా మారుస్తాయి
బలమైన రోడ్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడంపై మా దృష్టి
రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తాం
తెలంగాణను మూడు ప్రాంతాలుగా విభజించి అభివృద్ధి
డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాటు
ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ హెచ్‌ఐసీసీ సదస్సులో పాల్గొన్న గడ్కరీ



హైదరాబాద్, నవంబర్ 19(ప్రజాజ్యోతి):
తెలంగాణ అభివృద్ధికి రహదారులు, మౌలిక సదుపాయాలు కీలకమని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. హెచ్‌ఐసీసీ (హైటెక్స్) వేదికగా జరుగుతున్న ఈ సదస్సును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్ రావు తదితరులు హాజరయ్యారు. 'కనెక్టింగ్ రోడ్స్ క్రియేటింగ్ టుమారో' అనే ఇతివృత్తంతో ఈ సమావేశాలను నిర్వహిస్తున్నారు. పర్యావరణానికి హాని కలగకుండా రహదారుల నిర్మాణం చేపట్టడం, కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ సాంకేతికతను రోడ్ల అభివృద్ధిలో ఉపయోగించుకోవడం వంటి అంశాలపై ఇందులో చర్చించనున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సమావేశాలకు తెలంగాణకు,


మిగతా 2లో..



తెలంగాణకు నేనెందుకు అన్యాయం చేస్తా

తెలుగుదేశంతో ఎన్నడో తెగదెంపులు చేసుకున్నా
సిద్దిపేటలోనూ కాంగ్రెస్ జెండా ఎగురుతుంది
ప్రజలు కోరుకున్న నాయకుడికే కాంగ్రెస్ టికెట్
అభ్యర్థిని గెలిపించుకునే బాధ్యత ఇక్కడి ప్రజలదే
కాంగ్రెస్ గెలిస్తే ఈ నియోజకవర్గానికి మంత్రి పదవి
సిద్దిపేట అభివృద్ధికి 550 కోట్ల నిధులు మంజూరు
సిద్దిపేటలో మామ, అల్లుడు, బామ్మర్దుల ఆధిపత్యం
బీఆర్ఎస్ ను వదిలి బీజేపీలోకి హరీశ్ రావు వెళ్తారు
నా దమ్ముంటే కాదని ఒట్టేసి చెప్ప హరీశ్ రావు?
సిద్దిపేటలో బహిరంగ సభలో సిఎం రేవంత్ రెడ్డి
ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ప్రారంభం
పలు అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపనలు

"ఈ గడ్డ మీద నుంచి నేను అడుతున్నా కేసీఆర్‌ను. సాగునీళ్ల పేరు ముసుగులో రేవంత్ రెడ్డి ఆంధ్రాకు నీళ్లు వదలుతున్నాడని మొసలి కన్నీరు కారుస్తున్నారు. నేనూ ఈ తెలంగాణ బిడ్డనే. ఈ మట్టిలో పుట్టినా, ఈ మట్టిలోనే పెరిగా, ఈ మట్టిలోనే కలుస్తా. నా నేలకు నేను అన్యాయం చేస్తనా. నేడు ఈ నీచులు నన్ను శంకించి, నా మీద దుమ్మెత్తిపోసే విధంగా మాట్లాడుతున్నారు. మీరు అసెంబ్లీకి వస్తే అన్నీ విషయాలు మాట్లాడుదాం" -రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి



సిద్దిపేట, నవంబర్ 19(ప్రజాజ్యోతి):
తెలంగాణ రాజకీయాల్లో సిద్దిపేట వేదికగా మాటల యుద్ధం మరోసారి వేడెక్కింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సిద్దిపేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పట్టణ అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం రూ.550 కోట్లు కేటాయించిందని వెల్లడించారు. ఇదే సమయంలో గత బీఆర్ఎస్ పాలన, ఆ పార్టీ నేతలపై వరుస ఆరోపణలు, విమర్శలు గుప్పించారు. సిద్దిపేట రాజకీయాల్లో మామ, అల్లుడు, బామ్మర్దుల ఆధిపత్యం కొనసాగుతోందని రేవంత్ రెడ్డి విమర్శించారు. "వాడు పోతే వీడు, వీడు పోతే వాడు నాలుగు దశాబ్దాలుగా సిద్దిపేటను మామ, అల్లుడు, బామ్మర్దులే ఏలాలా? సిద్దిపేట ఏమైనా మీ కుటుంబ గడీనా? కుటుంబ రాజ్యమా?" అంటూ ప్రశ్నించారు. కేసీఆర్ గతంలో తనకు రాజకీయ జీవితం ఇచ్చిన మదన్‌మోహన్‌పైనే టీడీపీ నుంచి పోటీ చేశారని, నమ్మినవారిని మోసం చేయడం ఆయనకు అలవాటని ఆరోపించారు. 2004లో వార్డు సభ్యుడిగా కూడా గెలవని

మిగతా 2లో..



ప్రపంచ శాంతికి కలిసి నడుద్దాం

భద్రత కోసం పనిచయాల్సిన బాధ్యత ఉంది
సురక్షితమైన ప్రపంచం కోసం కృషిచేస్తున్నాం
అమెరికా, రష్యా, చైనా అధ్యక్షుల నిర్ణయం
షెన్‌జెన్ లో కీలక త్రైపాక్షిక సమావేశం
ఐరాస సంస్కరణలు, అణు ముప్పుపై చర్చ
నాలుగు కీలక అంశాలపై ఉమ్మడి తీర్మానం!
రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపుకు కృషి
ఇరాన్ అణ్వాయుధాలను కలిగి ఉండరాదు
అణుశక్తి, ఏఐ రంగాల్లో రష్యాదే అగ్రస్థానం

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వెల్లడి

షెన్‌జెన్, నవంబర్ 19(ప్రజాజ్యోతి):
చైనాలోని షెన్‌జెన్‌లో జరిగిన త్రైపాక్షిక శిఖరాగ్ర సమావేశం అనంతరం రష్యా, చైనా, అమెరికాలు గురువారం ఒక ఉమ్మడి తీర్మానాన్ని ఆమోదించాయి. ఐక్యరాజ్యసమితి (యూఎన్) సంస్కరణలు, శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల ఉత్పత్తి, సరఫరాను పెంచడం, అణు ముప్పును తగ్గించే అంశాలపై చర్చలు జరపడానికి ఈ మూడు దేశాలు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించాయి. నవంబర్ 19న షెన్‌జెన్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సమావేశమైన అనంతరం 'శాంతి దిశగా రష్యా- చైనా- అమెరికా దేశాధినేతల ప్రకటన' పేరుతో ఈ ఉమ్మడి తీర్మానాన్ని ఆమోదించారు. ఈ ప్రకటన ప్రకారం, ముగ్గురు నేతలు అంతర్జాతీయ పరిస్థితులపై లోతైన అభిప్రాయాలను పంచుకున్నారు. వ్యూహాత్మక స్థిరత్వాన్ని, అంతర్జాతీయ భద్రతను కాపాడేందుకు కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. ఈ త్రైపాక్షిక సదస్సుకు ఆతిథ్యం ఇచ్చినందుకు

మిగతా 12లో..

బీఎస్-6 వాహనాలకు మూడేళ్ల పాటు పీయూసీ

పదేళ్ల లోపు ప్రైవేట్ వాహనాలకు ఏడాది గడువు

వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట..

న్యూఢిల్లీ, నవంబర్ 19(ప్రజాజ్యోతి):
దేశంలోని వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పీయూసీ) సర్టిఫికెట్ల చెల్లుబాటు వ్యవధి నిబంధనలను సవరిస్తూ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ కీలక

మిగతా 12లో..

క్రమశిక్షణ విషయంలో పార్టీలో అందరూ సమానమే

పార్టీ నాయకుల వ్యాఖ్యలను పార్టీ గమనిస్తోంది

రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్

హైదరాబాద్, నవంబర్ 19(ప్రజాజ్యోతి):
కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ పరంగా అందరూ సమానమేనని, నేతలు ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

మిగతా 12లో..



ఫిబ్రవరి 24 నుంచి ఇంటర్ పరీక్షలు

ఫిబ్రవరి 1నుంచి 10వరకు ప్రాక్టికల్స్- విడుదలైన ఇంటర్ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్..

హైదరాబాద్, నవంబర్ 19(ప్రజాజ్యోతి):
తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యార్థులకు కీలక అప్‌డేట్ వచ్చింది. 2027 ఫిబ్రవరి, మార్చిలో నిర్వహించనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షల తాత్కాలిక షెడ్యూల్‌ను తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి (టీజీబీఐఈ) విడుదల చేసింది. ఫస్టియర్ పరీక్షలు ఫిబ్రవరి 24వ తేదీ నుంచి.. సెకండియర్ పరీక్షలు ఫిబ్రవరి 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని తెలిపింది. జనరల్, ఒకేషనల్ విభాగాల విద్యార్థులకు ఈ షెడ్యూల్ వర్తించనుంది. ఉదయం 9 గంటల నుంచి

మిగతా 12లో..

బంగ్లాదేశ్‌లో చెలరేగిన హింస..

మహమ్మద్ యూనస్ ఇంటికి నిప్పు

న్యూఢిల్లీ, నవంబర్ 19(ప్రజాజ్యోతి):
నిషేధిత అవామీ లీగ్ పార్టీ (షేక్ హసీనా పార్టీ) దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో తీవ్ర హింస చెలరేగింది. పలు ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘర్షణల్లో నలుగురు ప్రాణాలు కోల్పోగా, రాజధాని ఢాకాలో వరుసగా బాంబు పేలుళ్లు కలకలం రేపాయి. ఇదే సమయంలో చట్టోగ్రామ్‌లోని మాజీ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ పూర్వీకుల ఇంటికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. అలాగే పలు ప్రాంతాల్లోని గ్రామీణ్ బ్యాంక్ శాఖలపై కూడా దాడులు జరిగాయి. పశ్చిమ నరైల్ జిల్లాలో అవామీ లీగ్ శ్రేణులు జరిపిన దాడిలో అధికార బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ)కి చెందిన ఇద్దరు స్థానిక నేతలు మృతి చెందినట్లు

మిగతా 2లో..

రాష్ట్రాలకు ఏఐసీసీ కార్యదర్శుల నియామకం

న్యూఢిల్లీ, నవంబర్ 19(ప్రజాజ్యోతి):
రాష్ట్రాలకు ఏఐసీసీ కార్యదర్శులను కాంగ్రెస్ అధిష్ఠానం నియమించింది. తెలంగాణ రాష్ట్రానికి సచిన్ సావంత్‌తోపాటు సైమన్ అలెక్స్‌ను నియామించింది. తెలంగాణకు చెందిన ముగ్గురికి ఏఐసీసీ కార్యదర్శులుగా అవకాశం కల్పించారు. ఒడిశాకు ఏఐసీసీ కార్యదర్శిగా కుసుమ్‌కుమార్, కర్ణాటకకు ఏఐసీసీ కార్యదర్శిగా సయ్యద్ అజ్మాతుల్లా హుస్సేనీ నియమించారు.

సంపాదకీయం

రైతుకు గిట్టుబాటు ధర ఏది?

కూరగాయల ధరల్లో హెచ్చుతగ్గులకు పంటల సాగు నిర్ణయాలు కూడా ఒక ముఖ్య కారణం. ఒక సీజన్‌లో టమాటాకు మంచి ధర వస్తే.. తదుపరి సీజన్‌లో ఎక్కువ మంది రైతులు అదే పంట సాగు చేయడానికి ఆసక్తి చూపుతారు. దీంతో కొన్ని నెలల తర్వాత మార్కెట్‌కు భారీగా దిగుబడులు వస్తాయి. సరఫరా పెరిగి ధరలు ఒక్కసారిగా పడిపోతాయి. ధరలు పడిపోవడంతో రైతులు నిరాశకు గురై తదుపరి సీజన్‌లో ఆ పంట సాగును తగ్గిస్తారు. దీంతో మార్కెట్‌లో కొరత ఏర్పడి మళ్లీ ధరలు పెరుగుతాయి. ఇలా ఒకసారి ధరలు పెరగడం.. మరోసారి భారీగా పడిపోవడం కూరగాయల మార్కెట్‌లో తరచూ కనిపించే పరిణామం. వాతావరణ పరిస్థితులు కూడా ఈ హెచ్చుతగ్గులను మరింత తీవ్రం చేస్తాయి. అధిక ఉష్ణోగ్రతలు, అకాల వర్షాలు, వరదలు, తెగుళ్ల కారణంగా పంటలు దెబ్బతింటే మార్కెట్‌కు వచ్చే దిగుబడులు తగ్గిపోతాయి. ఫలితంగా ధరలు పెరుగుతాయి. మరోవైపు ఒకేసారి భారీ దిగుబడులు రావడం వల్ల ధరలు కుప్పకూలుతాయి. కూరగాయల ధరలు పెరిగితే ఎక్కువగా ఇబ్బందులు పడేది తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలే. రోజువారీ బడ్జెట్‌లో కూరగాయలకు కేటాయించే మొత్తం పెరగడంతో ఇతర అవసరాలకు ఖర్చు తగ్గించుకోవాల్సి వస్తుంది. అదే సమయంలో ధరలు పడిపోయినప్పుడు రైతులు తీవ్రంగా నష్టపోతారు. పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాని పరిస్థితి ఏర్పడుతుంది. కూరగాయల ధరలు కేవలం రైతులు, వినియోగదారులకే పరిమితం కావు. ఆహార ద్రవ్యోల్బణంపై కూడా ప్రభావం చూపుతాయి. కూరగాయల ధరలు భారీగా పెరిగితే మొత్తం ద్రవ్యోల్బణ గణాంకాల్లోనూ మార్పులు కనిపిస్తాయి. ఇవి ఆర్థిక విధానాలపై, వడ్డీ రేట్ల నిర్ణయాలపై పరోక్ష ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఈ సమస్యకు పరిష్కారంగా వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను మెరుగుపరచడం, గ్రామీణ ప్రాంతాల్లో కోల్డ్ స్టోరేజీ సౌకర్యాలు పెంచడం, పంటల నిల్వ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం అవసరం. ముఖ్యంగా టమాటా వంటి త్వరగా పాడయ్యే పంటలతో సాస్, ప్యూరీ, పల్ప్ వంటి ప్రాసెస్డ్ ఉత్పత్తులను తయారు చేసే చిన్న పరిశ్రమలను ప్రోత్సహించాలి.దీంతో మార్కెట్‌లో దిగుబడులు ఎక్కువగా వచ్చినప్పుడు రైతులు పంటను పారబోసే పరిస్థితి తగ్గుతుంది. అలాగే రైతులకు పంటల సాగు, మార్కెట్ డిమాండ్, ధరలపై ముందస్తు సమాచారం అందించే వ్యవస్థలను బలోపేతం చేయాలి. మెరుగైన రవాణా, నిల్వ సదుపాయాలు అందుబాటులోకి వస్తే రైతులు వెంటనే పంట అమ్ముకోవాల్సిన ఒత్తిడి నుంచి కొంతవరకు బయటపడగలరు. మరోవైపు పొలంలో కిలో టమాటా ధర రూ.10 పలికితే.. నగరంలోని దుకాణంలో అదే టమాటా రూ.30కి అమ్ముడవుతుంది. మరి ఈ మధ్యలో జరుగుతున్నదేంటి? రైతు, వినియోగదారుడి మధ్య ధరల్లో ఇంత వ్యత్యాసం ఎందుకు? భారతీయ రిజర్వ్ బ్యాంక్ (=దీ×) అధ్యయనం ఈ ప్రశ్నలకు ఆసక్తికరమైన సమాధానాలు వెల్లడించింది. ఒక రైతు గోపాల్‌ను ఉదాహరణగా తీసుకుందాం. ఆయన తన పొలంలో ఎంతో కష్టపడి టమాటా పంట సాగు చేశాడు. పెట్టుబడి పెట్టాడు.. నీళ్లు పట్టాడు.. ఎరువులు వేశాడు.. చివరకు పంట చేతికొచ్చింది. ఎర్రగా పండిన టమాటాలను కోసి మార్కెట్‌కు తరలించాడు. అయితే అదే సమయంలో మార్కెట్‌కు భారీగా టమాటా దిగుబడులు వచ్చాయి. దీంతో కొనుగోలుదారులు తక్కువ ధరకు మాత్రమే అడుగుతున్నారు. కనీసం రవాణా ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. చేసేదేమీ లేక గోపాల్ తన పంటను వచ్చిన ధరకు అమ్ముకోవాల్సి వచ్చింది. కొందరు రైతులైతే గిట్టుబాటు ధర లేక టమాటాలను రోడ్ల పక్కన పారబోసే పరిస్థితి కూడా ఎదుర్కొంటున్నారు.కానీ ఇదే టమాటా కొన్ని నెలల క్రితం కిలో రూ.100 వరకు పలికింది. ధరలు పెరిగినప్పుడు సామాన్యులు టమాటాలు కొనలేక ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు రైతుకు ధర రావడం లేదు. అయినా దుకాణాల్లో వినియోగదారుడికి మాత్రం పెద్దగా ధర తగ్గడం లేదు. పొలంలో ధర పడిపోయినా.. రిటైల్ మార్కెట్‌లో ధరలు అదే స్థాయిలో ఉండటానికి కారణమేంటి? టమాటా, ఉల్లి, బంగాళాదుంప వంటి కూరగాయల ధరల్లో తరచూ చోటుచేసుకునే హెచ్చుతగ్గులపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ పరిశోధకులు అధ్యయనం చేశారు. ఈ అధ్యయనంలో ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. వినియోగదారుడు చెల్లించే తుది ధరలో రైతుకు దక్కేది సుమారు మూడో వంతు మాత్రమే. మిగిలిన మొత్తం సేకరణ, రవాణా, నిల్వ, హోల్‌సేల్, రిటైల్ విక్రయాల వంటి సరఫరా వ్యవస్థలోని వివిధ దశలకు వెళ్తుంది. ఉదాహరణకు వినియోగదారుడు కిలో టమాటాకు రూ.30 చెల్లిస్తే.. అందులో రైతుకు సుమారు రూ.10 మాత్రమే దక్కవచ్చు. మిగిలిన రూ.20 సరఫరా వ్యవస్థలోని ఇతర ఖర్చులు, మార్జిన్ల రూపంలో ఉంటుంది. ఇదే సమయంలో పాల ఉత్పత్తుల విషయంలో రైతుకు తుది ధరలో సుమారు 70 శాతం వరకు దక్కుతుందని అధ్యయనం పోల్చి చూపించింది. అయితే మధ్యవర్తులంతా అధిక లాభాలు పొందుతున్నారని దీని అర్థం కాదు. కూరగాయలు త్వరగా పాడైపోయే స్వభావం కలిగి ఉంటాయి. వాటిని సేకరించడం, నాణ్యతను బట్టి వేరు చేయడం, రవాణా చేయడం, నిల్వ ఉంచడం, విక్రయించడం వంటి పనులకు ఖర్చు అవుతుంది. మార్గమధ్యంలో కొంత పంట పాడయ్యే ప్రమాదం కూడా ఉంటుంది. అందువల్ల ఈ మొత్తం వ్యత్యాసాన్ని మధ్యవర్తుల లాభంగా భావించడం సరికాదు. కూరగాయల మార్కెట్‌లో ధరల నిర్ణయాన్ని ప్రభావితం చేసే కీలక అంశాల్లో నిల్వ సామర్థ్యం ఒకటి. రైతు పంట కోసిన వెంటనే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. ఎందుకంటే అతని దగ్గర కోల్డ్ స్టోరేజీ సౌకర్యం ఉండదు. పంటను మరికొన్ని రోజులు నిల్వ ఉంచే ఆర్థిక స్థోమత కూడా చాలామంది రైతులకు ఉండదు. అప్పులు తీర్చాలి.. పెట్టుబడి తిరిగి రావాలి.. తదుపరి పంటకు డబ్బులు సమకూర్చుకోవాలి. అందుకే ధర తక్కువగా ఉన్నా పంటను అమ్ముకోవాల్సి వస్తుంది. మరోవైపు నిల్వ సౌకర్యాలు, ఆర్థిక వనరులు ఉన్న వ్యాపారులు కొంతకాలం సరుకును నిల్వ ఉంచి, మార్కెట్‌లో ధరలు పెరిగినప్పుడు విక్రయించే అవకాశం ఉంటుంది. అంటే ఒకే పొలంలో పండిన ఒకే రకమైన టమాటా నుంచి రైతు తక్కువ ధర పొందితే.. నిల్వ చేయగలిగిన వ్యాపారికి ధరల మార్పుల ద్వారా ఎక్కువ ఆదాయం పొందే అవకాశం ఉంటుంది.ఇక్కడ మార్కెట్‌లో అసలు తేడా కేవలం కొనుగోలుదారుడు, అమ్ముకందారుడి మధ్య మాత్రమే కాదు. సరుకును నిల్వ ఉంచగలిగే సామర్థ్యం ఉన్నవారికి, వెంటనే అమ్ముకోవాల్సిన పరిస్థితిలో ఉన్నవారికి మధ్య కూడా ఉంది. పొలంలో పండిన టమాటా రైతు చేతుల నుంచి వ్యాపారి దగ్గరకు.. అక్కడి నుంచి హోల్‌సేల్ మార్కెట్‌కు.. చివరకు రిటైల్ దుకాణానికి చేరుతుంది. ప్రతి దశలోనూ కొన్ని ఖర్చులు, మార్జిన్లు జతవుతాయి. చివరకు వినియోగదారుడు ఎక్కువ ధర చెల్లించి కూరగాయలు కొనుగోలు చేస్తాడు. కానీ ఆ కూరగాయలను పండించిన రైతుకు మాత్రం ఆశించిన ఆదాయం దక్కదు. రైతుకు గిట్టుబాటు ధర లభించాలి.. వినియోగదారుడికి సరసమైన ధరకు నాణ్యమైన కూరగాయలు అందాలి. ఈ రెండూ సాధ్యమయ్యేలా సరఫరా వ్యవస్థను మెరుగుపరచడమే అసలైన పరిష్కారం. ఆ దిశగా పరిష్కార మార్గాలు అన్వేషించి అన్నదాత ముఖంలో చిరునవ్వు చెందేలా చూడాలని రైతన్నలు కోరుకుంటున్నారు.

బంగ్లాదేశ్‌లో చెలరేగిన హింస..

మొదటిపేజీ తరువాయి..

పోలీసులు వెల్లడించారు. దేశంలోని దాదాపు 28 జిల్లాల్లో డజన్ల కొద్దీ నాటు బాంబుల పేలుళ్లు, వాహనాల దహనం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ హింసాత్మక పరిణామాల నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. రాజధాని ఢాకాలో గత 24 గంటల్లో మాజీ విద్యాశాఖ మంత్రి నూరుల్ ఇస్లాం నహీద్‌తో సహా మొత్తం 565 మందిని అదుపులోకి తీసుకున్నారు. అల్లర్లకు పాల్పడిన వారిపై ఆడియో, వీడియో ఆధారాలను పరిశీలించి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హోం మంత్రి సలాహుద్దీన్ అహ్మద్ స్పష్టం చేశారు. మరోవైపు పార్లమెంటులో ప్రసంగించిన ప్రధాని రెహమాన్.. అవామీ లీగ్‌ను ఒక ఉగ్రవాద సంస్థగా అభివర్ణించారు. దేశంలో ఫాసిస్ట శక్తులు మళ్లీ పుంజుకోకుండా ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకతాటిపైకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. 2024 నాటి విద్యార్థుల ఉద్యమంపై అణచివేత కేసులో మాజీ ప్రధాని షేక్ హసీనాకు ప్రత్యేక ట్రైబ్యునల్ మరణశిక్ష విధించి ఏడాది పూర్తయిన సందర్భంగా అవామీ లీగ్ ఈ బంద్ చేపట్టింది. ప్రస్తుతం భారత్‌లో ఉన్న హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ కోరుతుండగా, తాజా ఆందోళనలతో ఆ దేశంలో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి.



రోడ్ కనెక్టివిటీలో ప్రపంచంలోనే భారత్

నంబర్ వన్



మొదటిపేజీ తరువాయి..

చారిత్రక నగరమైన హైదరాబాద్‌కు విచ్చేసిన అతిథులకు స్వాగతం పలికారు. 2047 సంవత్సరం దేశానికి ఎంతో ముఖ్యమైనదని పేర్కొన్నారు. అప్పటికి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తవుతాయని గుర్తుచేశారు. అదే సమయానికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం తెలంగాణను



మూడు విభాగాలుగా రూపొందించినట్లు సీఎం వివరించారు. క్యూర్ పరిధిలో జెటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపలి ప్రాంతానికి సేవా రంగంలో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్యూర్ పరిధిలో ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) వరకు తయారీ పరిశ్రమలను ప్రోత్సహిస్తామని చెప్పారు. రేర్ పరిధిలో ఆర్ఆర్ఆర్ వెలుపలి ప్రాంతాలను వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి ఉపయోగించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో రహదారులు మాత్రమే కాకుండా ఇతర మౌలిక సదుపాయాల కల్పనపైనా ప్రభుత్వం దృష్టి పెట్టిందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఆర్ అండ్ బీ శాఖ పలు విభాగాలకు సంబంధించిన పనులను చేపడుతోందన్నారు. నూతన ఉస్మానియా ఆసుపత్రి, టిమ్స్ ఆసుపత్రులతో పాటు ఇతర వైద్యశాలల్లో కలిపి 8 వేల పడకలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. దేశ భద్రత, జాతీయ ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు తావులేదని, ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉంటాయని స్పష్టం చేశారు. రాష్ట్రంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వివరించారని, వాటికి కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు సీఎం ప్రకటించారు. దేశాభివృద్ధికి, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడానికి ఈ సమావేశం ఎంతో కీలకమని పేర్కొంటూ ప్రతినిధులందరినీ ఆహ్వానించారు. మరోవైపు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ రహదారుల మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భారత్ ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందని పేర్కొన్నారు. ఈ నెల 22 వరకు జరగనున్న ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా సుమారు 3,500 మంది నిపుణులు, ఇంజినీర్లు, అధికారులు హాజరవుతున్నారు.

ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం పనులతు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపాలని గడ్కరీకి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్-65ను ఆరు లైన్లుగా విస్తరించాలని కోరారు. హెచ్ ఐసీసీలో జరుగుతున్న ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్' సదస్సు ఈనెల 22 వరకు కొనసాగుతుంది. దేశవ్యాప్తంగా రోడ్లు, జాతీయ రహదారుల రంగానికి చెందిన నిపుణులు సహా సుమారు 3,500 మంది పాల్గొన్నారు.

తెలంగాణకు నేనెందుకు

అన్యాయం చేస్తా

మొదటిపేజీ తరువాయి..

హరీశ్ రావుకు వైఎస్సార్ పొత్తులో భాగంగా మంత్రి పదవి ఇచ్చారని సీఎం గుర్తుచేశారు. కాంగ్రెస్ కార్యకర్తలను సిద్దిపేటలో పోలీసులతో కొట్టించారని ఆరోపించారు. హరీశ్ రావును కాపాడిన సోలిపేట రామలింగారెడ్డి కుటుంబం పరిస్థితి, చెరుకు ముత్యం రెడ్డి కుటుంబ పరిస్థితిని ప్రజలు గమనించాలని అన్నారు. మరోవైపు హరీశ్ కుటుంబానికి వేల కోట్ల ఆస్తులు, రంగనాయక్ సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాంతాల్లో ఫామ్‌హౌస్‌లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. "రబ్బర్ చెప్పుల హరీష్ రావు 2004లో వార్డ్ మెంబర్ కూడా కాదు, వైఎస్ఆర్ భిక్షతో మంత్రి అయ్యారు" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "పాలు మోసే సన్నాసి, నువ్వు నా గురించి మాట్లాడతావా" అని మండిపడ్డారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఆంధ్రా కార్పొరేట్ ఆసుపత్రులు, కాలేజీలకు మేలు చేశారని ఆరోపించారు.హరీశ్ రావు ముందుండి నిర్మించిన రూ.లక్ష కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిపోయిందని, అందులో అవినీతి జరిగిందని సీఎం ఆరోపించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని సంతకాలు చేసి, ఏపీ సీఎం జగన్‌కు రాయలసీమ ప్రాజెక్టుల విషయంలో సహకరించారని విమర్శించారు. "పంచభూతాలను చెరపెట్టిన దుష్ట చతుష్టయం కేసీఆర్, హరీష్, కేటీఆర్, సంతోష్ రావు" అంటూ ఆరోపణలు చేశారు. "నక్క మేకతోలు కప్పుకున్నంత మాత్రాన మేక కాదు, ఈ గుంట నక్క వేషాలను మా అక్కలు గుర్తుపడతారు" అంటూ కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. "గడ్డం రావడానికే యాభై ఏళ్లు పట్టింది, బుద్ధి రావడానికి ఇంకెన్ని ఏళ్లు పడుతుందో" అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ మూడేళ్లుగా అసెంబ్లీకి రాకుండా రూ.కోటిన్నర జీతం తీసుకున్నారని విమర్శించారు. సభకు వస్తే నీళ్లు, భూములు, లిక్కర్ దోపిడీని బయటపెడతానని సవాల్ విసిరారు. కేటీఆర్, సంతోష్ రావులు సిరిసిల్ల, నేరెళ్ల ఇసుక దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. సొంత చెల్లినే పట్టించుకోని కేటీఆర్ రాష్ట్రంలోని కోటి మంది ఆడబిడ్డలకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. హరీశ్ రావు బీజేపీతో రహస్య మంతనాలు చేస్తున్నారంటూ సిద్దిపేట ఎల్లమ్మపై ఒట్టేసి చెప్పాలని సవాల్ విసిరారు. ఇవన్నీ బీఆర్ఎస్ నేతలపై సీఎం చేసిన రాజకీయ ఆరోపణలు కావడంతో సభలో తీవ్ర చర్చకు దారితీశాయి. 2004లో వార్డు మెంబర్‌గా కూడా గెలవని హరీశ్‌రావుకు అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రి పదవి ఇచ్చారని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. ఆ తర్వాత సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ లేకుండా చేయాలని హరీశ్‌రావు ప్రయత్నించారని ఆరోపించారు. హరీశ్‌రావును రాజకీయంగా ఆదరించిన సోలిపేట రామలింగారెడ్డి కుటుంబ పరిస్థితి, హరీశ్‌రావు కుటుంబ ఆస్తుల మధ్య తేడాను ప్రజలు గమనించాలని అన్నారు. హరీశ్‌రావు కుటుంబానికి వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. రంగనాయకసాగర్ సమీపంలో, కొండపోచమ్మసాగర్ వద్ద ఫామ్‌హౌస్‌లు ఎలా ఏర్పడ్డాయని కేసీఆర్, హరీశ్‌రావులను నిలదీశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని త్యాగాలు చేసిన అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే, కేసీఆర్ కుటుంబ సభ్యులకు పదవులు దక్కాయని విమర్శించారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి తల్లికి పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తగిన గుర్తింపు ఇవ్వలేదని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ తన కుమారుడు, కుమార్తె, అల్లుడు, బంధువులకు పదవులు ఇచ్చుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పన్నుల రూపంలో ప్రజల నుంచి రూ.20 లక్షల కోట్లు వసూలయ్యాయని.. ప్రాజెక్టుల పేరుతో మరో రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆ నిధులన్నీ ఎక్కడికి వెళ్లాయని ప్రశ్నించారు. హరీశ్‌రావు ముందుండి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు 3 ఏళ్లకే కూలిపోయిందని విమర్శించారు.ప్రాజెక్టుల నిర్మాణంలో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ.. అందుకే 2018లో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత హరీశ్‌రావుకు కేసీఆర్ మంత్రి పదవి ఇవ్వలేదని వ్యాఖ్యానించారు. పాలమూరు ప్రాజెక్టులను పదేళ్లపాటు నిర్లక్ష్యం చేశారని, కృష్ణా జలాల విషయంలోనూ తెలంగాణకు నష్టం జరిగిందని ఆరోపించారు. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మదన్‌మోహన్‌ను సిద్దిపేట ప్రజలు గుర్తుంచుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి హితవు పలికారు. ఆయన పేరును కనుమరుగు చేసేందుకు కేసీఆర్, హరీశ్‌రావు ప్రయత్నించారని ఆరోపించారు. సిద్దిపేట మెడికల్ కాలేజీకి మదన్‌మోహన్ పేరు పెట్టేలా త్వరలోనే ఆదేశాలు జారీ చేస్తామని ప్రకటించారు.సిద్దిపేట పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి మరో కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో రూపొందించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ పథకం కింద అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పించనున్నారు. ఇప్పటికే నేతన్నలు, గీత కార్మికులు, ఇతర కార్మికులు, మత్స్యకారులకు వివిధ శాఖల ద్వారా అందుతున్న రూ.2 లక్షల జీవిత బీమాను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి రూ.5 లక్షలకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బీమా కోసం లబ్ధిదారులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. పూర్తి ప్రీమియాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. నేటితో ప్రారంభమైన ఈ పథకం డిసెంబర్ 18వ తేదీ వరకు నెల రోజులపాటు నమోదు ప్రక్రియ కొనసాగనుంది. గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డు కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి, ఆన్‌లైన్, ప్రత్యేక యాప్, ఇంటింటి సర్వే ద్వారా అర్హుల వివరాలు సేకరించనున్నారు. సీఎం పర్యటనలో భాగంగా సిద్దిపేట జిల్లాలో మొత్తం రూ.544.11 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో రూ.451.13 కోట్లతో చేపట్టనున్న కొత్త పనులకు భూమిపూజ చేయగా, రూ.92.98 కోట్లతో పూర్తయిన భవనాలు, ఇతర వసతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కూడా రేవంత్‌రెడ్డి వివరించారు.గత ప్రభుత్వాలు ప్రారంభించిన ఏ ఒక్క సంక్షేమ పథకాన్నీ తమ ప్రభుత్వం నిలిపివేయలేదని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అదనంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. 2029లో మరోసారి గెలిచి 2034 వరకు ఇందిరమ్మ రాజ్యాన్ని కొనసాగిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కాగా తెలంగాణలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ అంశం మరోసారి తెరపైకి వచ్చింది.

హుస్నాబాద్‌ను తిరిగి కరీంనగర్ జిల్లాలో విలీనం చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం సిద్దిపేట పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డితో ఈ అంశాన్ని ప్రస్తావించిన పొన్నం ప్రభాకర్.. గతంలో ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా హుస్నాబాద్‌ను సిద్దిపేట జిల్లాలో కలిపారని అన్నారు. 'బలవంతపు పెళ్లి ఎక్కువ కాలం నిలవదు' అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. హుస్నాబాద్‌ను తిరిగి కరీంనగర్ జిల్లాలో కలపాలన్న డిమాండ్ ఇప్పటిది కాదు. 2016లో జిల్లాల పునర్వ్యవస్థీకరణ సమయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గాన్ని విభజించి వేర్వేరు జిల్లాల్లో చేర్చారు.హుస్నాబాద్ పట్టణంతో పాటు బెజ్జంకి, కోహెడ, అక్కన్నపేట మండలాలను కరీంనగర్ జిల్లా నుంచి తొలగించి.. సిద్దిపేట జిల్లాలో కలిపారు. భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలు హనుమకొండ జిల్లాలోకి వెళ్లగా.. చిగురుమామిడి, సైదాపూర్ మండలాలు కరీంనగర్ జిల్లాలోనే కొనసాగాయి. దీంతో ఒకే నియోజకవర్గంలోని మండలాలు 3 జిల్లాల పరిధిలోకి వెళ్లాయి. ఈ నిర్ణయంపై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయింది. హుస్నాబాద్‌తో పాటు అక్కన్నపేట, కోహెడ మండలాలను తిరిగి కరీంనగర్ జిల్లాలో కలపాలని స్థానిక జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు కూడా జరిగాయి. ఈ డిమాండ్‌పై 50 రోజులకు పైగా రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. అయినప్పటికీ అప్పటి ప్రభుత్వం స్పందించలేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ హుస్నాబాద్‌ను కరీంనగర్ జిల్లాలో కలిపే అంశం కీలకంగా మారింది. హుస్నాబాద్ నుంచి పోటీ చేసిన పొన్నం ప్రభాకర్.. నియోజకవర్గాన్ని ప్రజల మనోభావాలకు అనుగుణంగా తిరిగి కరీంనగర్ జిల్లాలో కలిపిస్తానని హామీ ఇచ్చారు. అప్పటి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి కూడా హుస్నాబాద్ పర్యటనలో ఈ డిమాండ్‌కు మద్దతు తెలిపి.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంబంధిత మండలాలను కరీంనగర్ జిల్లాలో కలిపే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు అప్పటి కథనాలు వెల్లడించాయి.మంత్రి పదవి చేపట్టిన తర్వాత కూడా పొన్నం ప్రభాకర్ ఈ అంశాన్ని పలుమార్లు ప్రస్తావించారు. 2024 అక్టోబర్ 18వ తేదీన సిద్దిపేటలో జరిగిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రమాణస్వీకార కార్యక్రమంలో మాట్లాడుతూ.. హుస్నాబాద్ ప్రజల మనోభావాలను గౌరవిస్తామని, సరైన సమయంలో నియోజకవర్గాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో కలపడాన్ని ఎవరూ అడ్డుకోలేరని వ్యాఖ్యానించారు. దీంతో ఈ అంశం మరోసారి రాజకీయంగా చర్చనీయాంశమైంది.



తొలిసారి ఆన్‌స్క్రీన్ క్యాలిక్యులేటర్

మొదటిపేజీ తరువాయి..

తీసుకున్నారు. కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్షలో అభ్యర్థుల స్క్రీన్‌పైనే నేరుగా కనిపించే బేసిక్ క్యాలిక్యులేటర్‌ను అందుబాటులో ఉంచనున్నారు. అయితే ఇది సంక్లిష్ట సమీకరణాలు పరిష్కరించే సైంటిఫిక్ క్యాలిక్యులేటర్ కాదని, కేవలం సాధారణ గణనల కోసం ఉపయోగపడే నాన్-సైంటిఫిక్ క్యాలిక్యులేటర్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ క్యాలిక్యులేటర్ 10 నుంచి 12 అంకెల డిస్‌ప్లే సామర్థ్యంతో పని చేస్తుంది. పరీక్ష సమయంలో కష్టతరమైన బేసిక్ గణిత లెక్కలను త్వరగా పూర్తి చేయడానికి ఈ సదుపాయం విద్యార్థులకు ఎంతగానో మేలు చేయనుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్ 2027 పరీక్షను 2027 మే 23 ఆదివారం నాడు నిర్వహించనున్నారు. ఈ పరీక్షను నిర్వహిస్తున్న ఐఐటీ ఢిల్లీ ఇప్పటికే అధికారిక వెబ్‌సైట్ యవమ్ఱఎజ.ఖఎ.అఅను అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థులు తమ ప్రిపరేషన్ మొదలుపెట్టే ముందే వెబ్‌సైట్‌లోని అర్హత ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులు సూచించారు. పరీక్ష దరఖాస్తులు, ఇతర మార్గదర్శకాల కోసం ఎప్పటికప్పుడు ఈ అధికారిక పోర్టల్‌ను సందర్శించాలని స్పష్టం చేశారు.

ఆఫ్రికాలో రక్తహీనత నివారణకు ముందడుగు!

మొదటిపేజీ తరువాయి..

ప్రముఖ ఫార్మా సంస్థ బయోలాజికల్ ఇ అనుబంధ విభాగం 'బీఈ బయోసోల్ ప్రైవేట్ లిమిటెడ్' కీలక ముందడుగు వేసింది. ఆఫ్రికా సహా పలు దేశాల్లో 'ఫెర్రిక్ కార్బాక్సీమాల్టోస్' (ఎఫ్‌సీఎం) ఇంజెక్షన్ల తయారీ, అందుబాటును విస్తరించేందుకు ప్రఖ్యాత 'గేట్స్ ఫౌండేషన్'తో బీఈ బయోసోల్ ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లో సామాన్యులకు అందుబాటు ధరల్లో మెరుగైన వైద్యం అందించడమే ఈ భ

ఐటీడీఏ పీఓకు సర్పంచ్‌ల వినతి

గ్రామీణ సమస్యలు, నిధుల మంజూరుపై వినతిపత్రం అందజేత

నేరడిగొండ నవంబర్ 19 (ప్రజాజ్యోతి):
మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించి, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీఓ) మండా మకరందును స్థానిక సర్పంచ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీఓను శాలువాతో ఘనంగా



సన్మానించి, అనంతరం గ్రామాల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సర్పంచ్‌లు పీఓ దృష్టికి తీసుకెళ్తూ, ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణంతో పాటు సురక్షిత త్రాగునీటి వసతి కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అలాగే విద్యార్థుల భవిష్యత్తు, సౌకర్యార్థం శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలకు మరమ్మతులు చేపట్టాలని లేదా నూతన భవనాల నిర్మాణానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా పిచరా గ్రామంలో చేపట్టిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి అటవీ శాఖ అధికారులు కల్పిస్తున్న అడ్డంకులను తక్షణమే తొలగించి, నిర్మాణ పనులు ఎటువంటి ఆటంకాలు లేకుండా యథావిధిగా కొనసాగేలా ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.
గ్రామాల సమగ్ర అభివృద్ధికి ఐటీడీఏ తరఫున పూర్తి సహాయ సహకారాలు అందించి, అవసరమైన నిధులను వీలైనంత త్వరగా మంజూరు చేయాలని సర్పంచ్‌లు పీఓను కోరారు. ఈ కార్యక్రమంలో లకంపూర్ సర్పంచ్ సెడమకి సుజాత గంగాధర్, పిచరా సర్పంచ్ బైరి లింగమ్మ రాజేందర్, నాగ మల్యాల సర్పంచ్ నందిని అమృత్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలకు మశూచి నివారణ టీకాల పంపిణీ

నేరడిగొండ, నవంబర్ 19 (ప్రజాజ్యోతి):
భవాని తండా గ్రామ పరిధిలో గురువారం గొర్రెలకు మశూచి వ్యాధి నివారణ ఉచిత టీకాల పంపిణీ కార్యక్రమాన్ని డాక్టర్ రాథోడ్ జీవన్ శాఖ ఆధ్వర్యంలో



నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఆడెపు శ్రీకాంత్ దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గొర్రెల్లో మశూచి వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా టీకాలు వేయించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సకాలంలో టీకాలు వేయించడం ద్వారా గొర్రెలకు వ్యాధుల ముప్పును తగ్గించడంతో పాటు జీవాల ప్రాణాలను కాపాడవచ్చని, తద్వారా గొర్రెల కాపరులకు ఆర్థిక నష్టాలు కలగకుండా నివారించవచ్చని తెలిపారు. అనంతరం పశుసంవర్ధక శాఖ వైద్య సిబ్బంది గ్రామంలోని గొర్రెల మందలన్నింటికీ ఉచితంగా టీకాలు వేశారు. పశుసంపదను వ్యాధుల నుంచి రక్షించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఈ ఉచిత టీకాల కార్యక్రమాన్ని కాపరులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ వైద్య సిబ్బంది, గ్రామస్తులు, గొర్రెల కాపరులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ సేవలు, త్యాగాలు చిరస్మరణీయం

మంచిర్యాల లో ఘనంగా భారతరత్న ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

మంచిర్యాల, 19, నవంబర్ (ప్రజాజ్యోతి):
భారత తొలి మహిళా ప్రధానమంత్రి, ఉక్కు మహిళ, భారతరత్న శ్రీమతి ఇందిరా గాంధీ జయంతి వేడుకలను గురువారం మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల







ప్రేమ్ సాగర్ రావు, జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆదేశాల మేరకు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 11వ డివిజన్‌లో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య–మహేష్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు పూదరి తిరుపతి, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పేదల సంక్షేమం, మహిళా సాధికారత, దేశ సమగ్రత కోసం ఇందిరా గాంధీ చేసిన విశేష కృషి, ఆమె చేసిన త్యాగాలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఇందిరమ్మ ఆశయాలు కాంగ్రెస్ పార్టీకి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని, ఆమె చూపిన ప్రజాసేవా మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు.

గోదావరి పుష్కరాల పనులను సమన్వయంతో వేగవంతం చేయాలి

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

బాసర నవంబర్ 19 (ప్రజా జ్యోతి):
బాసర గోదావరి నది పుష్కరాల నిర్వహణకు సంబంధించి చేపడుతున్న అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన పనులను వివిధ శాఖల



అధికారులు సమన్వయంతో వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు.గురువారం బాసర ఆలయ ఈఓ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పుష్కరాల ఏర్పాట్ల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుష్కరాల కోసం చేపట్టిన పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి శాఖాధిపతి తమ పరిధిలోని పనులను నిరంతరం పర్యవేక్షించాలని, నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పుష్కర ఘాట్ల నిర్మాణం, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, భూసేకరణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.



గోదావరి నదిలో ప్రస్తుత నీటిమట్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల పురోగతిని ఎప్పటికప్పుడు ఫొటోల రూపంలో పంపించాలని ఆదేశించారు. పనులకు సంబంధించి అవసరమైన అనుమతులు, ప్రభుత్వపరమైన నిర్ణయాలు పెండింగ్‌లో



ఉంటే వాటిని తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. ఆలయ నిర్మాణ పనులను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకు రావాలని అధికారులకు సూచించారు. పుష్కరాల సందర్భంగా వచ్చే ప్రముఖుల వసతి కోసం చేపడుతున్న భవన నిర్మాణ పనులపైనా పలు సూచనలు చేశారు. అనంతరం బాసరలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని వివిధ అభివృద్ధి పనుల నిర్మాణాలకు అనువైన ప్రభుత్వ భూములను పరిశీలించారు. పరిసరాల్లో డంపింగ్ యార్డు ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఖైసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఇరిగేషన్ ఈఈ అనిల్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, తహసీల్దార్ పవన్ చంద్ర, ఎంపీడీఓ రామకృష్ణ, సర్పంచ్ వెంకటేష్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి విద్యా సంస్థల్లో అధ్యయనానికి మస్కాపూర్ హెచ్ఎం పర్యటన..

బెంగళూరు ఐఐఎస్సీ, మైసూరు ఆర్ఐఈలలో ప్రత్యేక శిక్షణ..

మస్కాపూర్ పాఠశాల కీర్తిని జాతీయ స్థాయిలో చాటిన ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్

ఖానాపూర్ నవంబర్ 19(ప్రజా జ్యోతి)
నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మస్కాపూర్ ప్రధానోపాధ్యా



యులు జాడి శ్రీనివాస్ జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక విద్యా, పరిశోధనా సంస్థల్లో మూడు రోజుల విద్యా అధ్యయన పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకమైన పీఎంశ్రీ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ లో భాగంగా ఈ నెల 16వ తేదీ నుండి 18వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు, మైసూరు నగరాల్లో ఈ విద్యా పర్యటన జరిగింది. పర్యటనలో బాగంగా భారతదేశంలోనే అగ్రగామి సంస్థ ఐన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌ను సందర్శించినట్లు ఆయన తెలిపారు. అక్కడి ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఫిజికల్ సైన్సెస్ విభాగాలు, ఆధునిక పరిశోధనా కేంద్రాలు, సైన్స్ ల్యాబ్‌లతో పాటు చారిత్రాత్మక జె.ఆర్.డి. టాటా మెమోరియల్ లైబ్రరీని పరిశీలించారు. పాఠశాల స్థాయి నుండే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, పరిశోధనా ఆసక్తిని పెంపొందించే విధానాలపై నిపుణులతో చర్చించారు. మైసూరు లోని రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ని సందర్శించి, ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాల పెంపుదల (కెపాసిటీ బిల్డింగ్), నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ ఇ పి 2020) అమలు,పాఠశాల నాయకత్వ లక్షణాలపై జరిగిన ప్రత్యేక సదస్సులు, శిక్షణా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. మైసూరులోని పీఎంశ్రీ డెమోని స్టేషన్ పాఠశాలలో నిర్వహించిన ప్రయోగాత్మక బోధనలో భాగంగా ఆయన స్వయంగా తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు పాఠం బోధించారు. డిజిటల్ స్మార్ట్ బోర్డును (ఇంటరక్టివ్ ఫ్లాట్ ప్యానెల్) వినియోగిస్తూ గణిత శాస్త్రంలోని నిరూపక జ్యామితి అంశాలను అత్యంత సులభతరంగా, ఆసక్తికరంగా వివరించారు. ఆయన బోధనా శైలికి, విద్యార్థులతో మమేకమై ప్రశ్నలు అడుగుతూ పాఠం చెప్పిన తీరుకు తరగతి గదిలోని విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా స్పందించారు. తోటి ప్రధానోపాధ్యాయులు, ఆర్ఐఈ అధ్యాపకులు ఆయన బోధనా నైపుణ్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయి విద్యా సంస్థల్లో



నేర్చుకున్న ఆధునిక బోధనా పద్ధతులు, డిజిటల్ సాంకేతికత, ప్రయోగాత్మక విద్యా విధానాలను మస్కాపూర్ పీఎంశ్రీ పాఠశాలలో అమలు చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయికి దీటుగా నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం గా పని చేస్తానని పేర్కొన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న, కార్యాలయ సిబ్బందికి కృతజ్ఞతలు అని తెలిపారు. తమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాతీయ స్థాయి వేదికపై ఆదర్శ బోధన చేసి, పాఠశాల ఖ్యాతిని ఇనుమడింపజేయడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్ఎం జాడి శ్రీనివాస్ కు అభినందనలు తెలిపారు.

మాతృ,శిశు మరణాల నివారణలో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు!

మంచిర్యాలరూరల్ నవంబర్19(ప్రజాజ్యోతి):
జిల్లాలో మాతృ,శిశు మరణాలను నివారించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించింది.గర్భిణీ స్త్రీలకు



నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రసవ సమయంలో తలెత్తే సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ వైద్య సిబ్బందికి సూచించారు.మంచిర్యాల జిల్లా మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఈఏడాది జిల్లాలో నమోదైన రెండు మాతృ మరణాలు,ఆరు శిశు మరణాలపై సమగ్ర సమీక్ష,ఆడిట్ సమావేశం నిర్వహించారు.మరణాలకు దారితీసినపరిస్థితులు,వైద్య సేవల అందుబాటు, చికిత్సలో ఎదురైన సమస్యలు,భవిష్యత్తులో తీసుకోవాల్సిన నివారణ చర్యలపై వైద్యాధికారులు చర్చించారు.ఈసందర్భంగా డీఎంహెచ్ఓ డా.నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ ప్రతి గర్భిణీని గర్భధారణ జరిగిన మొదటి మూడు నెలల్లోనే నమోదు చేయాలని,కనీసం నాలుగు విడతలుగా వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆ దేశించారు. అ వ స ర మైన టీకాలు అందించడంతో పాటు రక్తహీనత నివారణకు ఐరన్,ఫోలిక్ యాసిడ్ మాత్రలు క్రమం తప్పకుండా అందించాలని సూచించారు.అధిక రక్తపోటు,రక్త హీనత తదితర సమస్యలున్న గర్భిణులను ముందుగానే గుర్తించి ప్రత్యేక వైద్య పర్యవేక్ష ణలో ఉంచాలన్నారు.ప్రసవ సమయంలో అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే మెరుగైన వైద్యం అందించేలా సిద్ధంగా ఉండాలని,ఆశా ఆసుపత్రులు కార్యకర్తలు,ఏఎన్ఎంలు గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు.వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే మాతృ, శిశు మరణాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.ఈసమావే శంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సంచాలకులు డా.అశోక్ కుమార్,ఆర్ఎంఓ డా. కుమారస్వామి,ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.సుధాకర్ నాయక్, డా.అరు ణశ్రీ,స్త్రీ వైద్య నిపుణులు, చిన్నపిల్లల వైద్య నిపుణులు,నర్సింగ్ అధికారులు, వైద్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో మహిళా శక్తికి ప్రతీక ఝాన్సీ లక్ష్మీబాయి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదిన వేడుకలు

మంచిర్యాల, 19, నవంబర్ (ప్రజాజ్యోతి):
మంచిర్యాల గోదావరి రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల



ర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, 1828 నవంబర్ 19న జన్మించిన ఝాన్సీ లక్ష్మీబాయి చిన్నతనం నుంచే ధైర్యసాహసాలు, యుద్ధ విద్యల్లో నైపుణ్యం ప్రదర్శించారని పేర్కొన్నారు. 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడి భారత స్వాతంత్ర్య చరిత్రలో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. తన రాజ్యాన్ని, దేశ గౌరవాన్ని కాపాడేందుకు ప్రాణాలను సైతం లెక్కచేయ కుండా యుద్ధరంగంలో పోరాడిన ఆమె తెగువ, దేశభక్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో మహిళలు సైతం పురుషులతో సమానంగా కీలక పాత్ర పోషించారని, ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం భారతీయ మహిళల ధైర్యసాహసాలకు, ఆత్మగౌరవా నికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, విద్యార్థులు ఆమె పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రికార్డింగ్ ప్రభాకర్ రావు, కళాశాల అధ్యాపకులు డాక్టర్ హరీష్ కుమార్, డాక్టర్ గంగయ్య, శ్రీమతి మంజుల, మధుసూదన్, సంధ్యారాణి, జయమణి, స్వర్ణలతతో పాటు ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శి టి. విజయ్ కుమార్, రాళ్లబండి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే రఘునాథ్‌పై వ్యక్తిగత విమర్శలు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్

మంచిర్యాల, 19, నవంబర్ (ప్రజాజ్యోతి):
మంచిర్యాల కేంద్రంగా నాలుగు వైపులా జాతీయ రహదారుల నిర్మాణం చేపడుతుండటాన్ని జీర్ణించుకోలేని కొందరు నాయకులు బీజేపీ రాష్ట్ర



ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లిపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ రైతులను రెచ్చగొడుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆరోపించారు. ఆయన గురువారం మాట్లాడుతూ, భవిష్యత్తులో పెరగనున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందులో భాగంగానే పలు సర్వేలు నిర్వహించిన అనంతరం జగిత్యాల నుంచి మంచిర్యాల వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి 63ను గ్రీన్‌ఫీల్డ్ హైవేగా నిర్ణయించి పనులు ప్రారంభించిందని తెలిపారు. ఒక నాయకుడి ప్రభావంతో జాతీయ రహదారి అలైన్‌మెంట్‌ను మార్చే స్థాయిలో కేంద్ర ప్రభుత్వ రహదారుల శాఖ లేదని, నిర్దేశిత నియమ నిబంధనలకు అనుగు ణంగానే ఈ ప్రాంత ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చేలా నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొన్నారు. మంచిర్యాల కేంద్రంగా వరంగల్, నాగ్‌పూర్, నిజామాబాద్, జగదల్‌పూర్ వైపు జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతుండటంతో రఘునాథ్ వెరబెల్లికి మంచి పేరు వస్తుందనే అక్కసుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు కుమ్మక్కై రైతులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. ఆయన దిష్టిబొమ్మల దహనం, వ్యతిరేక ప్రచారాలు, మీడియా కథనాల ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం లిమిటెడ్ యాక్సెస్ హైవేల నిర్మాణం ద్వారా ప్రయాణ సమయాన్ని తగ్గించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. భూసేకరణలో భాగంగా రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించి ఆదుకుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సైతం జాతీయ రహదారి అలైన్‌మెంట్‌ను రద్దు చేయాలని ఆదేశించలేదనే విషయాన్ని రైతులు గమనించాలని నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ కోరారు.

దక్షిణ కొరియాలో మఖ్తల్ కు చక్కటి గౌరవం

స్టార్ హెల్త్ సీఈఓ చేతుల మీదుగా విజయ్ భాస్కర్ రెడ్డికి అవార్డు

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి,నవంబర్ 19 (ప్రజా జ్యోతి):
దక్షిణ కొరియాలో స్టార్ హెల్త్ సీఈఓ చేతుల మీదుగా మఖ్తల్ కు చెందిన వ్యక్తి విజయ్ భాస్కర్ రెడ్డికి అవార్డు అందుకోవడం మఖ్తల్ కు గౌరవం లభించింది. తెలంగాణ రాష్ట్రంలోని మారుమూల ప్రాంతమైన నారాయణపేట జిల్లా మఖ్తల్ పట్టణానికి చెందిన విజయ్ భాస్కర్ రెడ్డి స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతిష్టాత్మకమైన సీఈవో క్లబ్ లక్ష్యాన్ని సాధించినందుకు విజయ్ భాస్కర్ రెడ్డికి దక్షిణ కొరియా రాజధాని సియోల్ నగరంలో స్టార్ హెల్త్ సీఈఓ చేతుల మీదుగా అవార్డు ఘనంగా ప్రదానం చేశారు. స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ నిర్దేశించిన సీఈవో క్లబ్ అర్హతలో భాగంగా ఒక సంవత్సరంలో రూ.50 లక్షల ఫ్రెష్ బిజినెస్ సాధించి ఈ అరుదైన గుర్తింపును పొందారు.



దక్షిణ కొరియాలోని సియోల్ నగరంలో నిర్వహించిన కంపెనీ కన్వెన్షన్ కార్యక్రమంలో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ సీఈఓ, ఎండి శ్రీ ఆనంద్ రాయ్ చేతుల మీదుగా విజయ్ భాస్కర్ రెడ్డి ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. మఖ్తల్ ప్రాంతం నుంచి అంతర్జాతీయ వేదికపై ప్రముఖ సంస్థ అధినేత చేతుల మీదుగా అవార్డు అందుకోవడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తన విజయానికి సహకరించిన కంపెనీ యాజమాన్యానికి, సహచరులకు,కస్టమర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయంపై మక్తల్ పట్టణ ప్రజలు, మిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ విజయ్ భాస్కర్ రెడ్డికి అభినందనలు తెలియజేస్తున్నారు.

ఉదండాపురంలో నూతన పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ చేసిన సర్పంచ్ మహేష్

ఇటిక్యాల (ప్రజాజ్యోతి) నవంబర్ 19: జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం ఉదండాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం నూతనంగా మంజూరైన





పింఛన్ల పత్రాలను గ్రామ సర్పంచ్ గొల్ల మహేష్ అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ యుగంధర్, పంచాయతీ కార్యదర్శి గంగాధర్,జీపీఓ ఈశరయ్య,4వ వార్డు సభ్యురాలు రుక్మిణమ్మ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నియంత్రణలో ‘సురక్షిత్’గా పాలమూరు.!

- రాష్ట్రంలోని 20 జిల్లాల్లో మహబూబ్‌నగర్‌కు ప్రత్యేక గుర్తింపు
- 95-95-95 లక్ష్యాల సాధన దిశగా జిల్లా ప్రగతి.. కలెక్టర్ ఖుష్బూ గుప్తాకు సత్కారం

మహబూబ్‌నగర్, నవంబర్ 19 (ప్రజా జ్యోతి బ్యూరో):
హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కార్యక్రమాల అమలులో మహబూబ్‌నగర్ జిల్లా మరో ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంది. నిర్దేశిత 95–95–95 లక్ష్యాల సాధన దిశగా కనబరిచిన పురోగతికి గుర్తింపుగా రాష్ట్రంలోని 20 ‘సురక్షిత్ జిల్లాల’ జాబితాలో మహబూబ్‌నగర్‌కు చోటు దక్కింది. ఈ ఘనత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమష్టి కృషికి నిదర్శనమని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అభినందిం



చారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (టీజీసాక్స్) ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ‘సమ్మాన్ సమారోహ్’ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌లను టీజీసాక్స్ డిప్యూటీ డైరెక్టర్ (బీఎన్‌డీ) మేఖల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు లభించిన ఈ గుర్తింపు వెనుక పనిచేసిన ప్రతి ఒక్కరి కృషి అభినందనీయమన్నారు. సాధించిన ప్రగతితో సంతృప్తి చెందకుండా మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హెచ్ఐవీపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం, పరీక్షల సంఖ్య పెంచడం, వ్యాధి నిర్ధారణ అయిన వారికి సకాలంలో చికిత్స అందించడం, మధ్యలో చికిత్స నిలిపివేసిన వారిని తిరిగి వైద్య సేవల పరిధిలోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.
హెచ్ఐవీ నియంత్రణలో కీలకమైన 95–95–95 లక్ష్యాల ప్రకారం హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో 95 శాతం మందికి తమ వ్యాధి స్థితిపై అవగాహన కల్పించి నిర్ధారణ చేయడం, నిర్ధారణ అయిన వారిలో 95 శాతం మందికి యాంటీ రెట్రోవైరల్ థెరపీ (ఏఆర్‌టీ) అందించడం, చికిత్స పొందుతున్న వారిలో 95 శాతం మందికి వైరల్ లోడ్‌ను అణచివేత స్థాయికి తీసుకురావడం ప్రధాన ఉద్దేశమని అధికారులు వివరించారు.
అలాగే ఏఆర్‌టీ మందులు నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చూడాలని, చికిత్స కొనసాగింపు, వైరల్ లోడ్ పరీక్షలు, తదుపరి వైద్య సేవలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం (డీఏపీసీయూ) ఆధ్వర్యంలో సంబంధిత శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. వైద్యులు, కౌన్సిలర్లు, స్టాఫ్ నర్సులు, ఏఆర్‌టీ, ఐసీటీసీ కేంద్రాల సిబ్బంది, వివిధ వైద్య సేవా సంస్థలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం వల్లే జిల్లాకు ఈ గుర్తింపు సాధ్యమైందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శశికాంత్, ఎయిడ్స్, లెప్రసీ కార్యక్రమ అధికారి డాక్టర్ రాజు నాయక్, డీఏపీసీయూ బృందం సభ్యులు, వివిధ వైద్య సేవా కేంద్రాల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రగ్స్,గంజాయి అక్రమ సాగు,కల్తీ కల్లు విక్రయాలపై ఉక్కుపాదం

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్
మాదకద్రవ్యాల రవాణా,వినియోగం,విక్రయాలపై ప్రత్యేక నిఘా
సమాచారం అందిస్తే రూ.10 వేల నగదు బహుమతి

గద్వాల నవంబర్ 19(ప్రజా జ్యోతి ప్రతినిధి):
జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం,అక్రమ



రవాణా,గంజాయి సాగు,కల్తీ కల్లు తయారీ,విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.జిల్లాలో డ్రగ్స్‌కు సంబంధించిన కేసులు నమోదు కాకుండా ముందస్తు నిఘా,తనిఖీలను విస్తృతం చేయాలని సూచించారు.మిషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలో ఎక్కడైనా గంజాయి లేదా ఇతర నిషేధిత మాదకద్రవ్యాల సాగు,నిల్వ,విక్రయాలు,రవాణా జరుగుతున్నట్లు గుర్తిస్తే తక్షణమే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ముఖ్యంగా రాయచూరు సరిహద్దు ప్రాంతంలోని మండలాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.గట్టు,కేటీ దొడ్డి, గద్వాల,ఐజ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీ బృందాలతో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

గంజాయి సాగుపై కఠిన చర్యలు

వ్యవసాయ భూముల్లో గంజాయి లేదా ఇతర నిషేధిత మాదకద్రవ్యాలకు సంబంధించిన మొక్కలను సాగు చేస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత భూముల వివరాలను సేకరించి పోలీస్ శాఖ ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అక్రమ సాగుకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు నిబంధనల ప్రకారం రైతుబంధు,రైతుబీమా,పెన్షన్లు తదితర ప్రభుత్వ పథకాల ప్రయోజనాల నిలిపివేతకు తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలకు సూచించారు.వ్యవసాయ విస్తరణ అధికారులు,మండల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని,అనుమానాస్పద సాగు గుర్తించిన వెంటనే పోలీస్,రెవెన్యూ శాఖలకు సమాచారం అందించాలని తెలిపారు.

కల్తీ కల్లు విక్రయాలపై ప్రత్యేక తనిఖీలు

కల్తీ కల్లు తయారీలో ప్రమాదకర రసాయనాలు వినియోగిస్తున్నట్లు వచ్చే ఫిర్యాదులపై ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు.అనుమతులు కలిగిన కల్లు విక్రయ కేంద్రాల్లో సైతం నిబంధనల ఉల్లంఘనలు జరగకుండా తనిఖీలు చేపట్టాలని,కల్తీ కల్లు తయారీ,విక్రయాలు ఎక్కడ జరిగినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.ముఖ్యంగా సరిహద్దు గ్రామాలు,ప్రధాన రహదారులు,అనుమానిత ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు.మాదకద్రవ్యాల అక్రమ రవాణా,విక్రయాలు, గంజాయి సాగు వంటి కార్యకలాపాలపై విశ్వసనీయమైన సమాచారం అందించే వారికి రూ.10 వేల నగదు బహుమతి అందజేస్తామని కలెక్టర్ ప్రకటించారు. ప్రజలు మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగస్వాములు కావాలని,సమాచారం అందించే వారి వివరాల గోప్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు.

విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమాలు

విద్యార్థులు మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా పాఠశాలలు,జూనియర్, డిగ్రీ కళాశాలల్లో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.ముఖ్యంగా 16 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని,ప్రతి విద్యాసంస్థలో యాంటీ నార్కోటిక్స్ అవగాహన కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రతి పాఠశాలలో చైల్డ్ సేఫ్టీ అధికారుల సమన్వయంతో



ప్రతి శుక్రవారం విద్యార్థుల స్కూల్ బ్యాగులను నిబంధనల ప్రకారం తనిఖీ చేసే కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని తెలిపారు. బాలుర వసతి గృహాలు,రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.

హైవేలు,టోల్ గేట్లు,రైల్వే స్టేషన్ల వద్ద నిఘా

జాతీయ రహదారుల వెంట ఉన్న దాబాలు,రెస్టారెంట్లు,టోల్ గేట్లు,బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లు,ఇతర అనుమానిత ప్రాంతాల్లో పోలీస్,ఎక్సైజ్ శాఖలు సమన్వయంతో రాత్రివేళ ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అనధికారికంగా మద్యం విక్రయాలు,సేవనానికి అవకాశం కల్పించే కేంద్రాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను మరింత విస్తృతం చేయాలని,ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో బ్రీత్ అనలైజర్లతో నిరంతర తనిఖీలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు.

బాల్యవివాహాలు,బడి మానేసిన పిల్లలపై ప్రత్యేక దృష్టి

మాదకద్రవ్యాల నిర్మూలనతో పాటు బాల్యవివాహాల నివారణ,పాఠశాలల్లో డ్రాప్‌అవుట్ల సంఖ్య తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు.ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్న నాలుగు మండలాల్లో సఖీ కేంద్రాల సిబ్బంది సేవలను విస్తరించాలని,సంబంధిత శాఖల ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమాలకు సంబంధించిన తేదీలు,పాల్గొన్న అధికారులు,ప్రజాప్రతినిధులు,ప్రజల వివరాలతో నివేదికలు సమర్పించాలని తెలిపారు.

డీ-అడిక్షన్ కేంద్రాల సేవలు విస్తరించాలి

మాదకద్రవ్యాలు,మద్యం వ్యసనాలకు గురైన వారికి అవసరమైన వైద్య చికిత్స, కౌన్సెలింగ్,పునరావాస సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు.డీ-అడిక్షన్ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని పునరావాస కేంద్రాలకు పంపించాలని,చికిత్స అనంతరం వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.

హోటళ్లు,దాబాల్లో ఆహార భద్రత తనిఖీలు

జిల్లాలోని జాతీయ రహదారుల వెంట ఉన్న రెస్టారెంట్లు,దాబాలు,హోటళ్లలో పరిశుభ్రత,ఆహార నాణ్యత,ఆహార భద్రతా ప్రమాణాలను నిరంతరం తనిఖీ చేయాలని ఫుడ్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు.నిబంధనలు ఉల్లంఘించే సంస్థలకు నోటీసులు జారీ చేయడంతో పాటు అవసరమైన జరిమానాలు విధించాలని తెలిపారు.మిషన్ పరివర్తన అనేది కేవలం అవగాహన కార్యక్రమం మాత్రమే కాదని,మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి చేపట్టిన సమగ్ర కార్యాచరణ అని కలెక్టర్ పేర్కొన్నారు.పోలీస్,ఎక్సైజ్, వ్యవసాయ, రెవెన్యూ, విద్య,మహిళా శిశు సంక్షేమ,రవాణా తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని,క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాలు నిరంతరం పర్యటిస్తూ అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీఎస్పీ మొగిలయ్య,సంబంధిత శాఖల జిల్లా అధికారులు,పోలీస్,ఎక్సైజ్,వ్యవసాయ,రెవెన్యూ,విద్య,మహిళా శిశు సంక్షేమ శాఖల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి లబ్ధిదారుడి వివరాలు,సంతకాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలి

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్
మూడు విడతల్లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు
గ్రామాలు, మున్సిపల్ వార్డుల వారీగా ప్రత్యేక శిబిరాలు

గద్వాల నవంబర్ 19(ప్రజా జ్యోతి ప్రతినిధి):
ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను నూతన మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో పథకం అమలు తీరుపై కలెక్టర్ సమీక్షించారు. ప్రభుత్వ నూతన నిబంధనల ప్రకారం లబ్ధిదారుల నమోదు ప్రక్రియను మూడు విడతల్లో చేపట్టనున్నట్లు తెలిపారు.శుక్రవారం నుంచి జిల్లాలో తొలి విడత నమోదు ప్రక్రియ ప్రారంభించాలని,గ్రామాలు,మున్సిపల్ వార్డుల వారీగా మూడు విడతల్లో నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు.మొదటి విడతలో ఇంటర్నెట్ సదుపాయం,కంప్యూటర్లు అందుబాటులో ఉండటంతో పాటు చురుకైన సిబ్బంది ఉన్న గ్రామాలు,వార్డులను ఎంపిక చేయాలని సూచించారు.తొలి విడతకు సంబంధించిన గ్రామాలు,వార్డుల జాబితాను త్వరగా సిద్ధం చేయడంతో పాటు మిగిలిన విడతల వివరాలను కూడా అందించాలని తహసీల్దార్లు,ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.

నమోదు ప్రక్రియ సరళీకృతం

ప్రభుత్వం సవరించిన మార్గదర్శకాల ప్రకారం బీమా నమోదు ప్రక్రియను సరళీకృతం చేసినట్లు కలెక్టర్ తెలిపారు.ఇకపై ప్రీ-ఫిల్డ్ దరఖాస్తులు,మాన్యువల్ ఫారాలు,ప్రింటింగ్,స్కానింగ్,పత్రాల అప్‌లోడ్ అవసరం లేదని వివరించారు. రేషన్ కార్డు చివరి ఆరు అంకెలను ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే కుటుంబ సభ్యుల వివరాలు ప్రత్యక్షమవుతాయని తెలిపారు.అందులో బీమా పొందే వ్యక్తి, నామినీలను ఎంపిక చేసి,వారికి కేటాయించే వాటా శాతాన్ని నమోదు చేయాలని సూచించారు.ఇతర బీమా పథకాలలో సభ్యత్వం ఉన్న వివరాలను కూడా నమోదు చేయాలన్నారు.దరఖాస్తు సమర్పించిన వెంటనే ట్రాన్సాక్షన్ ఐడీ జనరేట్ అవుతుందని,లబ్ధిదారుడి మొబైల్‌కు సందేశం అందుతుందని పేర్కొన్నారు.

ప్రత్యేక రిజిస్టర్‌లో వివరాలు,సంతకాలు తప్పనిసరి

ఆన్‌లైన్ నమోదు పూర్తయిన ప్రతి లబ్ధిదారుడి వివరాలు,సంతకాలను ప్రత్యేక రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.రేషన్ కార్డు నంబర్,బీమా పొందే వ్యక్తి పేరు,నామినీ పేరు,వాటా శాతం,ట్రాన్సాక్షన్ ఐడీ నమోదు చేయడంతో పాటు క్యాంప్ ఇన్‌చార్జి,పర్యవేక్షణ అధికారి సంతకాలు తీసుకోవాలని



సూచించారు.గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు క్యాంప్ ఇన్‌చార్జిలుగా వ్యవహరించాలని,ఎంపీడీవోలు,తహసీల్దార్లు శిబిరాలను పర్యవేక్షించాలని ఆదేశించారు.లాగిన్ ఐడీలు,మొబైల్ నంబర్ల నమోదులో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.తప్పు మొబైల్ నంబర్లు నమోదు చేస్తే ఓటీపీ,ఇతర సమాచార భద్రతకు సంబంధించిన సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు.ప్రతి శిబిరానికి బాధ్యులైన సిబ్బంది వివరాలను ముందుగానే నిర్ధారించుకోవాలని,నూతన విధివిధానాలపై వారికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

శిబిరాలపై ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వాలి

గ్రామపంచాయతీలు,మున్సిపల్ వార్డుల్లో ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశాల్లో నమోదు శిబిరాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. శిబిరాల్లో కంప్యూటర్లు,ఇంటర్నెట్ సదుపాయం,టెంట్లు, కుర్చీలు,ఫ్లెక్సీలు తదితర మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు.కౌన్సిలర్లు,ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో శిబిరాల నిర్వహణపై ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలన్నారు.గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా ప్రచారం చేయడంతో పాటు ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా అర్హులైన కుటుంబాలందరికీ సమాచారం చేరవేయాలని సూచించారు.రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల వివరాలకు సంబంధించి మార్పులు,చేర్పులు అవసరమైతే పౌరసరఫరాల శాఖ ద్వారా సరిచేసుకోవాలని తెలిపారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, అర్హులైన కుటుంబాల నమోదు ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో మండలాల ప్రత్యేక అధికారులు,తహసీల్దార్లు,ఎంపీడీవోలు,మున్సిపల్ కమిషనర్లు,ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ఇందిరమ్మ పాలన లక్ష్యం.!

పేదరిక నిర్మూలనకు విశేష కృషి చేసిన మహానేత ఇందిరాగాంధీ
రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్
మహబూబ్‌నగర్‌లో ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

మహబూబ్‌నగర్, నవంబర్ 19 (ప్రజా జ్యోతి బ్యూరో):
దేశంలో పేదరిక నిర్మూలన, పేద ప్రజల సంక్షేమం కోసం మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని



రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. దేశాభివృద్ధికి, సామాజిక సమానత్వానికి ఆమె తీసుకొచ్చిన సంస్కరణలు చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయని కొనియాడారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అశోక్ టాకీస్ చౌరస్తాలో ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొత్వాల్ మాట్లాడుతూ ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ దేశాభివృద్ధి కోసం అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని గుర్తుచేశారు. ముఖ్యంగా బ్యాంకుల జాతీయీకరణ ద్వారా బ్యాంకింగ్ సేవలను సామాన్య ప్రజలకు చేరువ చేశారని, పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన గొప్ప నాయకురాలని ప్రశంసించారు. దేశంలో పేదరిక నిర్మూలనకు ఆమె చేసిన కృషి, ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన కార్యక్రమాలు నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ ఆశయాలను కొనసాగిస్తూ పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుమ్మాల మమత, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రకుమార్ గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, డీసీసీ ఉపాధ్యక్షుడు బెక్కరి మధుసూదన్ రెడ్డి, మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు సాయిబాబా, అజ్మత్ అలీ, అవేజ్ అహ్మద్, నవనీత, చంద్రశేఖర్, గంజి ఆంజనేయులు, మహేందర్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మూడవ బ్యాచ్ ఆపద మిత్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం

ఇటిక్యాల,ఎర్రవల్లి (ప్రజాజ్యోతి) నవంబర్ 19:
జోగులాంబ గద్వాల జిల్లా,ఎర్రవల్లి మండలం



కేంద్రంలో 10వ బెటాలియన్ లో కమాండెంట్ టీ.అలెక్స్ ఆధ్వర్యంలో మూడవ బ్యాచ్ ఏడు రోజుల ఆపద మిత్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శిక్షణ కార్యక్రమం ఈరోజు ఘనంగా ప్రారంభమైంది.ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా సుమారు 100 మంది వాలంటీర్లు పాల్గొంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు, వరదలు, భూకంపాలు తదితర అనుకోని విపత్తులు సంభవించినప్పుడు, అత్యవసర సేవల సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునేలోపు తక్షణమే స్పందించి బాధితులకు ప్రాథమిక సహాయం అందించడం, విలువైన ప్రాణాలను కాపాడటం ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.ఈ ఏడు రోజుల శిక్షణలో ప్రథమ చికిత్స



అగ్నిప్రమాదాల నివారణ మరియు నియంత్రణ, వరదల సమయంలో రక్షణ చర్యలు,శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించడం,అత్యవసర తరలింపు చర్యలు విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,సహాయక చర్యల నిర్వహణ వంటి వివిధ అంశాలపై వాలంటీర్లకు సిద్ధాంతపరమైన మరియు ప్రాక్టికల్ శిక్షణ అందించనున్నారు. ఈ సందర్భంగా కమాండెంట్ టీ.అలెక్స్ వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ,ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఒక మంచి అవకాశంగా భావించి,ప్రతి అంశాన్ని శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు.శిక్షణలో పొందిన జ్ఞానాన్ని కేవలం సర్టిఫికెట్‌కే పరిమితం చేయకుండా, భవిష్యత్తులో ఏదైనా విపత్తు లేదా అత్యవసర పరిస్థితి ఎదురైనప్పుడు ఆపదలో ఉన్న వారికి తక్షణ సహాయం అందించి,ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ బి.ఆది నారాయణ, అసిస్టెంట్ కమాండెంట్ రమణ,రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు,రాజేశం, నరసింహ రాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సింగరాజు పల్లి విద్యార్థుల ఎంపిక

అభినందించిన హెచ్ఎం సుచిత్ర ఆనంద్ ఉపాధ్యాయ బృందం

దేవరుప్పుల, నవంబర్ 19 (ప్రజాజ్యోతి) :
జనగామ జిల్లా స్థాయిలో నిర్వహించిన జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ (ఎన్‌సీఎస్‌సీ) సైన్స్ కార్యక్రమంలో దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు.పాఠశాలకు చెందిన జోగు సాత్విక, వారాల వైష్ణవి ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.విద్యార్థులు పాత వార్తాపత్రికలు, మెంతులను ఉపయోగించి పర్యావరణహిత మొక్కల కుండీలను తయారు చేసి అందరి ప్రశంసలు పొందారు.జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ నిరంజనిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుచిత్ర ఆనంద్, ఉపాధ్యాయులను గురువారం అభినందించారు.రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ చాటి పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఉపాధ్యాయులు ప్రవీణ, శారద, శ్రీదేవి, సునీత, ఎల్లయ్య, రంజిత్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు..

పరకాల నవంబర్ 19 (ప్రజాజ్యోతి):
పరకాల మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు కొత్త కాలనీలో కాంగ్రెస్ నాయకులు మడికొండ బ్రదర్స్ ఆధ్వర్యంలో స్వర్గీయ ఇందిరాగాంధీ



జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. అనంతరం మడికొండ సంపత్ కుమార్ మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ ప్రజల సంక్షేమం కోసం విశేష కృషి చేసిన గొప్ప నాయకురాలని, ఆమె ఆశయ సాధనకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో బుద్ధ విగ్రహం ఆవిష్కరణ..

పోచమ్మ, ఎల్లమ్మ ఆలయాల అభివృద్ధికి సహకరిస్తా..
ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి..

పరకాల నవంబర్ 19 (ప్రజాజ్యోతి):
కంఠాత్మకూర్ గ్రామంలోని ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బుద్ధ విగ్రహాన్ని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. పాఠశాలలోని సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.



విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. అనంతరం గ్రామంలోని పోచమ్మతల్లి, ఎల్లమ్మతల్లి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

పుష్కర ఘాట్, కరకట్ట పనుల తనిఖీ: నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలి – ఐటీడీఏ పీవో

మంగపేట, నవంబర్ 19 ప్రజాజ్యోతి:
మంగపేట మండల పరిధిలోని గోదావరి నదీ తీరంలో కొనసాగుతున్న పుష్కర ఘాట్, కరకట్ట నిర్మాణ పనులను గురువారం ఏటూరునాగారం



ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదావరి తీర ప్రాంతంలో చేపట్టిన పుష్కర ఘాట్, కరకట్ట పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎలాంటి జాప్యం లేకుండా నిర్దిష్ట గడువులోగా పనులను పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో మంగపేట తహశీల్దార్ తోట రవీందర్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, గ్రామ పాలనాధికారి రాములు, పంచాయతీ కార్యదర్శి మురళి, ఇరిగేషన్ ఏఈ రోహిత్, వర్క్ ఇన్స్పెక్టర్ ప్రమోద్‌లతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖేలో ఇండియా క్రీడలకు హనుమకొండ ముస్తాబు..

అభివృద్ధి పనులను గడువులో పూర్తి చేయాలి.. :కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్..

హనుమకొండ,జిల్లాప్రతినిధి
నవంబర్ 19: (ప్రజా జ్యోతి)
జాతీయస్థాయి ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026 అథ్లెటిక్స్ పోటీలకు ఆతిథ్యమివ్వనున్న



హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్టేడియం గ్యాలరీలకు ఆకర్షణీయమైన రంగులు వేయడంతో పాటు ఖేలో ఇండియా లోగోను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. స్టేడియం సుందరీకరణ, గ్యాలరీల అభివృద్ధి పనులపై జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కొత్త ప్రశాంత్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాతీయస్థాయి క్రీడా పోటీలకు అనుగుణంగా స్టేడియాన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్దాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం, పరిసరాల అభివృద్ధి, మౌలిక



సదుపాయాల కల్పనపై మున్సిపల్ కమిషనర్ వెంకన్నతో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

డిసెంబర్ 18 నుంచి క్రీడా పోటీలు:
డిసెంబర్ 18 నుంచి 21వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జేఎన్ఎస్ స్టేడియంలో 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026 అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 1,500 మంది క్రీడాకారులు, కోచ్‌లు, అధికారులు, సాంకేతిక సిబ్బంది ఈ పోటీలకు హాజరుకానున్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, భద్రత, వసతి, భోజనం, రవాణా తదితర సదుపాయాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. వైద్య బృందాలు, అంబులెన్సులను అందుబాటులో ఉంచడంతో పాటు పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
జీడబ్ల్యూఎంసీ, ఆర్‌అండ్‌బీ, వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్, క్రీడా శాఖల సమన్వయంతో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్నతో పాటు ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఆశయాలే మార్గదర్శకం

మండల పార్టీ అధ్యక్షుడు దావెర అనిల్ కుమార్

దేశ ఐక్యత కోసం త్యాగం చేసిన ఉక్కు మహిళ ఇందిరా గాంధీ

మండల పార్టీ కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు

దేవరుప్పుల, నవంబర్ 19 (ప్రజాజ్యోతి) :
దేశ ఐక్యత, సమగ్రత కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన ఉక్కు మహిళ, భారతరత్న ఇందిరా గాంధీ ఆశయాలే తమకు మార్గదర్శకమని దేవరుప్పుల కాంగ్రెస్



పార్టీ మండల అధ్యక్షుడు దావెర అనిల్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ శ్రేణులతో కలిసి అనిల్ కుమార్ ఇందిరా గాంధీ 109వ జయంతి వేడుకలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అభ్యున్నతికి, పేదల సంక్షేమానికి ఇందిరా గాంధీ చేసిన కృషి చిరస్మరణీయమని, ఆమె చూపిన బాటలోనే కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా కుల, మత, భాష, ప్రాంతీయ భేదాలకు అతీతంగా భారతీయులంతా ఒక్కటిగా నిలవాలని పిలుపునిచ్చారు.భిన్నత్వంలో ఏకత్వమే మన దేశ బలమని, సమానత్వం, సోదరభావం, పరస్పర గౌరవంతోనే బలమైన భారత నిర్మాణం సాధ్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షులు ఇనుముల నాగరాజు, భూక్య సజ్జన్, మండల ప్రధాన కార్యదర్శి మేడ విద్యాసాగర్, మండల మహిళా అధ్యక్షురాలు కున్సోత్ సావిత్రి, ఎస్ఎస్యూఐ మండల అధ్యక్షుడు కొంగరి ఉమేష్, కామారెడ్డిగూడెం ఉప సర్పంచ్ పులిపంపుల భాస్కర్, మండల నాయకులు రెడ్డిరాజుల రమేష్, బోనగిరి యాకస్వామి, రామచంద్రనాయక్, దొపాటి నర్సయ్య, వరికేల రతన్,t తోటకూరి రమేష్, గడ్డం పరంధాములు, సుజాత రెడ్డి, బుర్ర ప్రభాకర్, కాడబోయిన సోమయ్య, చింత ఉపేందర్, జిలకర కిషన్,సోషల్ మీడియా ఇన్చార్జ్ రెడ్డిరాజుల ఎల్లప్ప కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అభిమానులు పాల్గొని నివాళులర్పించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీవోస్ సంఘం నిరంతరం కృషి

ప్రభుత్వ ఉద్యోగులందరూ సంఘ సభ్యత్వ నమోదులో భాగస్వాములు కావాలి
జిల్లా అధ్యక్షుడు గాజే వేణుగోపాల్

వరంగల్ సిటీ, నవంబర్ 19 (ప్రజాజ్యోతి):
టీఎన్జీవోస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆదేశాల మేరకు, వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ అధ్యక్షుడు గాజే వేణుగోపాల్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సమస్యల పరిష్కారమే సంఘం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ముజీబ్ హుస్సేని చేస్తున్న కృషి అభినందనీయమని, జిల్లా తరపున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర నాయకత్వానికి సంఘంలోని ప్రతి ప్రాథమిక సభ్యుడు



2026–2027 సంవత్సరానికి సంబంధించి గురువారం టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు సభ్యత్వ నమోదు ప్రతులను అందజేశారు.
ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గాజే వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి పాలకుర్తి సదానందం మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులందరూ టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి టీఎన్జీవోస్ సంఘం నిరంతరం కృషి చేస్తోందని, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించడంలో సంఘం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై ఈ సందర్భంగా చర్చించి, సంఘ సభ్యత్వం ప్రాముఖ్యతను వివరించారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అండగా నిలవాలని కోరారు. ఉద్యోగుల సంక్షేమం కోసం టీఎన్జీవోస్ సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని, ప్రతి ఉద్యోగికి సంఘం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఉద్యోగుల ఐక్యత, సంఘటిత శక్తితోనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ టీఎన్జీవోస్ యూనియన్ అధ్యక్షుడు గాజే వేణుగోపాల్, కార్యదర్శి పాలకుర్తి సదానందం, గౌరవ అధ్యక్షుడు గజ్జల రాంకిషన్, కేంద్ర సంఘ కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి కిరణ్ కుమార్, సిటీ అధ్యక్షుడు శంకేసి రాజేష్, జిల్లా బాధ్యులు గణేష్, చిరంజీవి, యూసఫ్, వార్డెన్ల సంఘం అధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి జోసఫ్, రూరల్ అధ్యక్షుడు ఆనంద్, కోఆపరేటివ్ ఫోరం జిల్లా అధ్యక్షుడు వినోద్, రవీందర్, సతీష్, ముజాహిద్, రాజేంద్రప్రసాద్, అలీ, రాకేష్, విద్యారాణి, శ్రీదేవి తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.

రామకృష్ణాపురం–ధర్మారం లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుకు కార్యాచరణ..

రైతుల సాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపుతాం..
ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

పరకాల నవంబర్ 19 (ప్రజాజ్యోతి):
రైతుల సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రామకృష్ణాపురం నుంచి ధర్మారం వరకు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసేందుకు



ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలిపారు. నడికూడ మండలం కంఠాత్మకూర్ మాటువాగు వద్ద అధికారులతో కలిసి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుకు ప్రతిపాదించిన మోటార్ పంపింగ్ స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా ఈదుల్ చెరువు, బంటోనీ చెరువు, శాలకుంట చెరువులకు నీటిని అందించే ప్రతిపాదనపై అధికారులతో చర్చించారు. అనంతరం స్థానిక రైతులతో పథకం అమలు, సాగునీటి సౌకర్యాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ పథకానికి ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ అందిస్తుందని, మిగిలిన 25 శాతం వాటాను రైతులు సమష్టిగా భరించి సహకరించాలని కోరారు. రైతులందరూ కమిటీగా ఏర్పడి ఐకమత్యంతో ముందుకు వస్తే మూడు చెరువులను నీటితో నింపి సాగునీటి సౌకర్యం కల్పించవచ్చని తెలిపారు. తద్వారా రైతుల సాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):
ములుగు జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ మత్స్యశాఖ అధ్యక్షుడు కంబాల రవి ఆధ్వర్యంలో గురువారం ఇందిరాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ములుగు మండల అధ్యక్షుడు ముసినెపల్లి కుమార్ గౌడ్, ములుగు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లావుడ్య రమేష్,కాంగ్రెస్ సేవ దళ అధ్యక్షుడు రంజిత్,నద్దు నూరి రమేశ్, కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా సీనియర్ నాయకులు జిల్లా మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ 109వ జయంతి వేడుకలు..

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం..
పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యం..
డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

హనుమకొండ జిల్లా ప్రతినిధి,
నవంబర్ 19 (ప్రజాజ్యోతి):
హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ 109వ జయంతి వేడుకలను డీసీసీ భవన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకాన్ని ప్రారంభించి, పథకం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా



ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతికి ఇందిరాగాంధీ ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని అన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయిన పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనాలు అందేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, పింగిలి వెంకట్రామ్ నరసింహారెడ్డి, మార్క విజయ్ కుమార్, పులి అనిల్, పులి ప్రియాంక, తౌటం జాన్సీ, బంక సరళ సంపత్ యాదవ్ తదితర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్న నీటి చెరువుల పునరుద్ధరణ పనులను వెంటనే ప్రారంభించాలి

మంజూరైన పనులన్నీ శుక్రవారం నుంచే చేపట్టాలి: కలెక్టర్ చంద్రశేఖర్

నల్లగొండ జిల్లా ప్రతినిధి
నవంబర్ 19: (ప్రజా జ్యోతి)



విబిజి రామ్ జీ పథకం ద్వారా జిల్లాలోని చిన్న నీటి చెరువులన్నింటినీ పునరుద్ధరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మైనర్ ఇరిగేషన్ ఇంజనీరింగ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మైనర్ ఇరిగేషన్ చెరువుల పరిధిలో విబిజి రామ్ జీ పథకం కింద చేపట్టనున్న పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల్లో ప్రస్తుతం ఉన్న నీరు కేవలం తాగునీటి అవసరాలకే సరిపోతుందని తెలిపారు. మూసీ నదిలో నీరు ఉన్నప్పటికీ అది తాగడానికి పనికిరాదని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న నీటిని సంరక్షించుకుంటూనే వర్షపు నీటిని చెరువుల్లోకి మళ్లించి భూగర్భ జలాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



చెరువుల పునరుద్ధరణలో భాగంగా మరమ్మతులు, పూడికతీత పనులు చేపట్టి వాటిని పటిష్టం చేయాలని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే గుర్తించి మంజూరు చేసిన చెరువుల పనులన్నింటినీ శుక్రవారం నుంచే ప్రారంభించాలని ఆదేశించారు. ఫీడర్ ఛానళ్ల మరమ్మతులు, పూడికతీత, శిఖం హద్దుల వద్ద కందకాల తవ్వకం, ఒండ్రుమట్టి తీసే ప్రాంతాల్లో ముళ్లపొదల తొలగింపు వంటి పనులు చేపట్టాలని సూచించారు. అసిస్టెంట్ ఇంజనీర్లు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి మంజూరైన పనులను ప్రారంభించాలని ఆదేశించారు. ఇకపై ప్రతి వారం పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అన్ని చెరువులకు సంబంధించి ఎఫ్‌టీఎల్ (పూర్తిస్థాయి నీటిమట్టం) సరిహద్దులను పరిరక్షించాల్సిన బాధ్యత ఇరిగేషన్ శాఖపై ఉందని స్పష్టం చేశారు. చెరువుల పునరుద్ధరణతో పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని, చెరువులు పటిష్టంగా మారడంతోపాటు ఫీడర్ ఛానళ్లు, ఫీల్డ్ ఛానళ్లు బాగుపడతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కురిసే వర్షపు నీటిని చెరువుల్లో నిల్వ చేసుకుని సంరక్షించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని పనులపై ప్రత్యేక దృష్టి సారించి, అందుబాటులో ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇరిగేషన్ ఇంజనీర్లకు సూచించారు. అలాగే విబిజి రామ్ జీ పథకం కింద గ్రామాల్లో పశువుల తొట్ల నిర్మాణం, పశుగ్రాసం పెంపకం చేపట్టాలని ఆదేశించారు. కనీసం 50 శాతం నీరు, తేమ ఉన్న చెరువుల కింద పశుగ్రాసం సాగు చేయాలని సూచించారు. ఏప్రిల్ చివరి వరకు నీటి లభ్యత ఉండే ప్రాంతాల్లో పశుగ్రాసం పెంపకానికి అనువుగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో శేఖర్ రెడ్డి, జిల్లా పశుసంవ

రాచమల్ల భద్రయ్య భౌతికకాయానికి నివాళులర్పించిన సిపిఎం నాయకులు

రామన్నపేట నవంబర్ 19 (ప్రజా జ్యోతి)
రామన్నపేట మండలం నీర్నేముల గ్రామానికి చెందిన నాయి బ్రాహ్మణ సంఘం మాజీ జిల్లా నాయకులు రాచమల్ల భద్రయ్య అనారోగ్యంతో మృతి చెందడం పట్ల



సిపిఎం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భద్రయ్య భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ సర్పంచ్ బోయిన ఆనంద్, మాజీ మండల పరిషత్ అధ్యక్షులు నాగటి ఉపేందర్ మాట్లాడుతూ రాచమల్ల భద్రయ్య మరణం నీర్నేముల గ్రామానికి, నాయి బ్రాహ్మణ సంఘానికి తీరని లోటని అన్నారు. ఆయన మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి నాగటి లక్ష్మణ్, పార్టీ సీనియర్ నాయకులు బండా జగన్మోహన్ రెడ్డి, నేమనంది లింగయ్య, మునుగోటి అత్తయ్య, వార్డు సభ్యులు నాగటి ఉపేందర్, మాజీ వార్డు సభ్యులు నాగటి మహేష్, పాల్వాయి చంద్రశేఖర్ రెడ్డి, నాగటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ నియోజకవర్గంలో యువకుడి మృతికి నివాళులర్పించిన దైద రవీందర్

నల్గొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 19 (ప్రజాజ్యోతి):
నకిరేకల్ నియోజకవర్గంలోని బాబు సాయిగూడెం గ్రామానికి చెందిన భూపతి రాజేష్ గౌడ్ (17) మృతి చెందడంతో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి



తెలిపారు.ఈ కార్యక్రమంలో 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వంటపాక నాగయ్య, చనగాని నాగరాజ్, దాసరి రామచంద్రయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

త్రినేత్ర హోటల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బాలునాయక్

యువత స్వయం ఉపాధి రంగంలో రాణించడం అభినందనీయం: ఎమ్మెల్యే

దేవరకొండ, నవంబర్ 19,(ప్రజా జ్యోతి) :
దేవరకొండ పట్టణంలోని తాటికొల్ ఎక్స్ రోడ్డు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన త్రినేత్ర హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు



నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోటల్‌ను ప్రారంభించి, నిర్వాహకుడు జటావత్ సాయికుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.నూతనంగా ప్రారంభించిన హోటల్ ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ వినియోగదారుల ఆదరణ పొందాలని, వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి స్వయం ఉపాధి అవకాశాలను కల్పించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. కొత్తగా వ్యాపారాలు ప్రారంభించే యువతకు ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజా వెంకటేశ్వర్లు, ఆలంపల్లి నరసింహ, హనుమంతు వెంకటేష్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ రైయిస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మారుపాకుల సురేష్ గౌడ్, హనుమంతు సాయి చంద్ర, గుద్దేటి మాధవి సత్యం, కొర్ర రామ్ సింగ్ నాయక్, కిన్నెర హరికృష్ణ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో జల ప్రతిజ్ఞ - గ్రామాల్లో నీటి సంరక్షణ పనుల పరిశీలన

నకిరేకల్ / నల్గొండ జిల్లా ప్రతినిధి
నవంబర్ 19: (ప్రజాజ్యోతి)
నీటిని సంరక్షిద్దాం – జీవాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో బుధవారం నెల్లిబండ గ్రామ పంచాయతీతో పాటు



పంచాయతీ పరిధిలోని హ్యాబిటేషన్ గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు.
ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికీ ఇంకుడు గుంతల నిర్మాణం, ఫారం పాండ్స్ పనుల పురోగతి, కిచెన్ గార్డెన్స్, బోర్‌వెల్ రీచార్జ్ పిట్స్ మార్కింగ్, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఆయా పనుల్లో పురోగతి సాధించేలా కూలీలకు అవగాహన కల్పించి, పనుల పట్ల ప్రోత్సాహం అందించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత సిబ్బందికి తగిన సూచనలు చేశారు. అలాగే పాఠశాల విద్యార్థులతో జల ప్రతిజ్ఞ చేయించి, నీటి విలువ, నీటి సంరక్షణ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి భవిష్యత్ తరాలకు నీటి భద్రత



కల్పించాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాఘవులు, టీఏ సూరయ్య, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి స్వాతి, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆడానియా నారాయణ సింగ్ మృతి బాధాకరం

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ, నవంబర్ 19, (ప్రజా జ్యోతి) :
దేవరకొండ మండలం కొండ భీమనపల్లి గ్రామానికి చెందిన



ఆడానియా నారాయణ సింగ్ మృతి చెందడం బాధాకరమని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. నారాయణ సింగ్ మృతి వార్త తెలుసుకున్న ఆయన కొండ భీమనపల్లి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, మనోధైర్యాన్ని కోల్పోవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కడారి సైదులు యాదవ్, గుండాల వెంకట్ యాదవ్, వార్డు సభ్యులు కడారి అచ్చయ్య యాదవ్, ఉపాధ్యాయులు మాండన్ నారాయణ సింగ్, మాండన్ ధర్మేందర్ సింగ్, మాండన్ కిషన్ సింగ్, పగిళ్ల వెంకట్ రాములు, నారాయణ సింగ్, తోనగర్ ప్రతాప్, మాండన్ విజయ్ సింగ్, అడాన్య అరణ్ సింగ్, అడాన్య పవన్, మాండన్ శ్యాంసింగ్, అడాన్య సీతారాం సింగ్, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత: పోలేపాక రామచంద్రు

తూర్పు గూడెంలో లబ్ధిదారులకు చేయూత పెన్షన్ మంజూరు పట్టాలను అందజేత

తుంగతుర్తి, నవంబర్ 19,(ప్రజా జ్యోతి):
ప్రజాపాలన రేవంత్ రెడ్డి ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోలేపాక రామచంద్రు అన్నారు. మండల పరిధిలోని తూర్పు గూడెం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా, లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన 'చేయూత' పెన్షన్ల మంజూరు పత్రాలను గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ దాసరి రేణుక శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల ఆర్థిక భద్రత మరియు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు మరియు వివిధ వృత్తులపై ఆధారపడిన అర్హులైన వారికి చేయూత పెన్షన్లు ఎంతో ఆసరాగా నిలుస్తాయని పేర్కొన్నారు.నూతనంగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రభుత్వం నిర్దేశించిన విధానాల ప్రకారం పెన్షన్ నగదు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నవీన్, ఉపసర్పంచ్ కల్యాణ్ ,పాలకవర్గం సభ్యులు,కాంగ్రెస్ పార్టీ



నాయకులు గుండగాని మిన్నయ్య, గుండగాని రమేష్, ఏరసాని లింగయ్య, దాసరి నరసయ్య, కన్నెబోయిన యాకయ్య, కొంతం శ్రీను, లింగంపల్లి లింగమ్మ, తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ కార్యకర్త రాములు మృతి బాధాకరం: డీసీసీ ఉపాధ్యక్షుడు ముక్కమల్ల వెంకటయ్య గౌడ్

దేవరకొండ, నవంబర్ 19, (ప్రజా జ్యోతి) :
నేరడుగొమ్ము మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త వరికుప్పల రాములు మృతి చెందడం తీవ్ర



దిగ్భ్రాంతికి గురిచేసిందని డీసీసీ ఉపాధ్యక్షుడు ముక్కమల్ల వెంకటయ్య గౌడ్ అన్నారు. రాములు మృతి విషయం తెలుసుకున్న ఆయన గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా రాములు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అందరితో సత్సంబంధాలు కలిగి ఉండేవారని గుర్తు చేశారు. ఆయన మృతి పార్టీకి, గ్రామానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల మండల ఫోరం అధ్యక్షుడు పులికంటి సుధాకర్, ఉపసర్పంచ్ ఎలిజర్ల శ్రీను, వరికుప్పల సైదయ్య, నాగటి హరీష్, సంఘం యాదయ్య, వరికుప్పల రాజు, ఇరుగదిండ్ల అంజి, గ్రామస్తులు తదితరులు పాల్గొని రాములుకు నివాళులర్పించారు.

శాలిగౌరారంలో ఉచిత బీపీ, షుగర్ పరీక్షల శిబిరం

శాలిగౌరారం / నల్లగొండ జిల్లా ప్రతినిధి, నవంబర్ 19(ప్రజా జ్యోతి):
ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఆఫ్ శాలిగౌరారం ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో ఉచిత బీపీ, షుగర్ పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఆర్ఎంపీ వైద్యులు డాక్టర్ దామెర్ల శీను, డాక్టర్ దునుక వెంకన్న ప్రజలకు



రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించారు. సుమారు 100 మంది గ్రామస్థులు ఈ శిబిరంలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ దెంకల సత్యనారాయణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మల ఆంజనేయులు, కోశాధికారి మురారి శెట్టి కరుణాకర్, వడ్లకొండ బిక్షం, గుండు పరమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్లబ్ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. శిబిరానికి సహకరించిన వైద్యులకు, క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని వెల్లడించారు.

కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా కిషన్ నాయక్

మృతుడి కుటుంబానికి రూ.35 వేల ఆర్థిక సాయం.. పిల్లల చదువులకు పూర్తి సహకారం అందిస్తామని భరోసా

దేవరకొండ, నవంబర్ 19,(ప్రజా జ్యోతి) :
దేవరకొండ మండలం కమలాపురం గ్రామానికి చెందిన పల్లపు సైదులు మృతి చెందడం బాధాకరమని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్



అన్నారు. సైదులు మృతి విషయం తెలుసుకున్న ఆయన గ్రామంలోని మృతుడి నివాసానికి వెళ్లి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా రూ.35,000 అందజేశారు. అంతేకాకుండా సైదులు పిల్లల చదువులకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని భరోసా కల్పించారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని కిషన్ నాయక్ తెలిపారు.

చిన్నారులకు ఆశీర్వాదం అందించిన మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్

దేవరకొండ, నవంబర్ 19, (ప్రజా జ్యోతి) :
నేరడుగొమ్ము మండలం కేతేపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు నగేష్–ప్ర మీల దంపతుల కుమార్తె వర్షిని, కుమారులు వర్షిత్, అభిరామ్‌ల నూతన పట్టు



వస్త్రాలంకరణ మహోత్సవ కార్యక్రమంలో దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులను ఆశీర్వదించి, వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తాటి చెట్టుపై నుంచి జారిపడి గీత కార్మికుడు మృతి

● ఇద్దరు పిల్లలకు తీరని విషాదం ● బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తుల విజ్ఞప్తి





ఇందల్వాయి,(ప్రజా జ్యోతి) నవంబర్ 19: ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. రోజువారీగా తాటి చెట్లు గీసుకుంటూ జీవనం సాగించే కిషోర్ గౌడ్ (52) గురువారం తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రతిరోజు మాదిరిగానే కల్లు గీయడానికి వెళ్లిన కిషోర్ గౌడ్ తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబానికి జీవనాధారంగా ఉన్న ఆయన మృతితో ఇద్దరు పిల్లలు దిక్కులేనివారయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మృతుడి కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, వీడీసీ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. సమాచారం అందుకున్న ఎస్సై సుమలత సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమలత తెలిపారు.

కళ్యాణాలక్ష్మి, షాది ముబారక్ చెక్కులు పంపిణీ



బాల్కొండ, (ప్రజా జ్యోతి) నవంబర్ 19 : బాల్కొండ మండల కేంద్రంలోని 16 మంది ఆడపడుచులకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం బాల్కొండ మండల కేంద్రానికి చెందిన 16 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి మరియు షాది ముబారక్ చెక్కులను సర్పంచి,కాంగ్రెస్ నాయకులు,అధికారుల చేతుల మీదుగా 16 కళ్యాణలక్ష్మి షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడపడుచుల కోసం కళ్యాణలక్ష్మి షాది ముబారక్ పథకాన్ని ప్రవేశ పెట్టారని ఒక్కొక్క లబ్ధిదారులకు రూ1,00116/ లక్ష ఒక వంద పదహారు రూపాయలు చొప్పున అందజేయడం జరిగిందని వారు తెలిపారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.పేద కుటుంబాల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక తోబుట్టువుగా ప్రతీ ఒక్క ఆడపడుచుకు లబ్ధి చేకూరుతుందని వారు తెలిపారు.లబ్ధిదారులు మంజూరు చేయించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచి గాండ్ల రాజేష్, ఉపసర్పంచి గాండ్ల రాజేందర్,రెవెన్యూ ఇన్స్పెక్టర్ గంగాధర్, పంచాయతీ కార్యదర్శి మోహన్, బాల్కొండ పట్టణ శాఖ కాంగ్రెస్ అధ్యక్షులు కుందారపు శ్రీనివాస్,జిల్లా కార్యదర్శిలు మహమ్మద్ యూనిస్,మండల కార్యదర్శిలు పుప్పాల విద్యాసాగర్, పుల్లాయి నవీన్ కుమార్, సయ్యద్ రియాజ్ అలీ, మండల ఉపాధ్యక్షుడు గడ్డం రవి,మండల కార్యదర్శి దోన్వాల్ సాయన్న,మాజీ సర్పంచి తౌట్ గంగాధర్,వార్డు సభ్యులు పిట్ల సాయి చరణ్ తేజ, ఫాజిల్,వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాజీ డైరెక్టర్ సయ్యద్ మాజారోద్దీన్, మైనార్టీ నాయకులు షేక్ జావీద్,షేరు, పిప్పేరా అశోక్,రెవెన్యూ,గ్రామ పంచాయతీ ఆఫీసర్ లు, రాజేష్ లక్ష్మీ నారాయణ, అధికారులు,కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో ప్రత్యేక సన్న బియ్యం విక్రయ కేంద్రం ప్రారంభం

● సామాన్యులకు అందుబాటు ధరల్లో నాణ్యమైన సన్న బియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



బాన్సువాడ, నవంబర్ 19 (ప్రజాజ్యోతి): సామాన్య ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యాన్ని తక్కువ ధరలకు అందించడంతో పాటు బహిరంగ మార్కెట్‌లో ధరల పెరుగుదలను నియంత్రించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆదేశాల మేరకు బాన్సువాడ పట్టణంలోని తిరుమల రైస్ షాప్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక సన్న బియ్యం విక్రయ కేంద్రాన్ని (స్పెషల్ రైస్ కౌంటర్) బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్-నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం తగ్గడం, వ్యవసాయ ఉత్పత్తులపై ప్రతికూల ప్రభావం పడటం వంటి పరిణామాలతో సన్న బియ్యం ధరలు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలను నియంత్రించడంతో పాటు సామాన్యులకు నాణ్యమైన బియ్యాన్ని సరసమైన ధరలకు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ధరలపై నిరంతర పర్యవేక్షణ చేపడుతూ ప్రత్యేక రైస్ కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ కేంద్రంలో బహిరంగ మార్కెట్ ధరల కంటే తక్కువ ధరకే నాణ్యమైన సన్న బియ్యం విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. రేషన్ (ఎఫ్ ఎస్ సి) కార్డుదారులతో పాటు రేషన్ కార్డులు లేని అల్పాదాయ వర్గాల ప్రజలు సైతం ఈ కేంద్రం ద్వారా బియ్యం కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించినట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ప్రత్యేక కౌంటర్‌లో బియ్యం ధరల వివరాలు:

బియ్యం రకం। కిలో ధర। 26 కిలోల బ్యాగ్ ధర
బీపీటీ కొత్త బియ్యం। రూ.53। రూ.1,378
బీపీటీ స్టీమ్ బియ్యం। రూ.64। రూ.1,664
ఆర్ఎన్ఆర్ కొత్త బియ్యం (తెలంగాణ సోనా)। రూ.64। రూ.1,664
హెచ్ఎంటీ స్టీమ్ బియ్యం। రూ.72। రూ.1,872
జై శ్రీరామ్ స్టీమ్ బియ్యం। రూ.78। రూ.2,028

ప్రభుత్వ ఆదేశాల మేరకు బాన్సువాడలో ప్రత్యేక రైస్ కౌంటర్ ఏర్పాటు చేసేందుకు సహకరించిన తిరుమల రైస్ షాప్ నిర్వాహకుడు వెంకన్నను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవో రవీందర్ రెడ్డి, తహసీల్దార్ రాజా నరేందర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, పలువురు అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ లక్ష్యాలను ప్రజలకు చేరువ చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ



ప్రజా జ్యోతి,లింగంపేట్ నంబర్ 19 లింగంపేట్ మండలంలోనీ కంచుమహాల్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. నూతనంగా నిర్మించనున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సర్పంచ్ బట్టు లావణ్య కాశీరాం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. పేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, ఉసర్పంచ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

వన్నెల్ (బి) గ్రామంలో
కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



బాల్కొండ, (ప్రజా జ్యోతి) నవంబర్ 19: బాల్కొండ మండలంలో కేంద్రంలోని వన్నెల్ (బి) గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ బక్కూరి వినోద, వార్డు సభ్యులు రాజుల రామనాథం కళ్యాణ లక్ష్మి చెక్కులను గ్రామపంచాయతీ సర్పంచ్ వార్డ్ సభ్యుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్ జిపిఓ సాగర్లు పాల్గొన్నారు.

సీఎం బహిరంగ సభకు భారీగా తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

● కల్హేర్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రత్యేక బస్సుల్లో సిద్దిపేటకు పయనం





కల్హేర్, నవంబర్ 19, ప్రజాజ్యోతి: సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేసేందుకు కల్హేర్ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. మండలంలోని కల్హేర్, మార్థి, బీబీపేట్, మసాన్‌పల్లి, కృష్ణాపూర్, మహాదేవ్‌పల్లి, ఫతేపూర్, మీర్ఖాన్‌పేట్, రాపర్తి తదితర గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సభకు బయలుదేరాయి. పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సుల్లో కార్యకర్తలు ఉత్సాహంగా ప్రయాణం సాగించారు. ముఖ్యమంత్రి సభకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలనే లక్ష్యంతో గ్రామస్థాయి నాయకులు, పార్టీ కార్యకర్తలు సమన్వయంతో ఏర్పాట్లు చేసుకున్నారు. పార్టీ జెండాలు, నినాదాలతో కాంగ్రెస్ శ్రేణుల తరలింపు ఉత్సాహభరితంగా కొనసాగింది. మండల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్. జి దేవదాస్.బి. సాయిలు .. సర్పంచ్ కోడి గంగారం ఉపసర్పంచ్ పి మహేష్ మహాదేవపల్లి పోచయ్య మండలంలోని వివిధ గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉక్కు మహిళ ఇందిరాగాంధీ...
దేశ చరిత్రలో చెరగని ముద్ర

● భారత తొలి మహిళా ప్రధానిగా చరిత్ర సృష్టించి దేశ సమగ్రత, అభివృద్ధి కోసం విశేష సేవలు అందించిన ఇందిరమ్మ



కల్హేర్ . 19.నవంబర్. ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం: భారతదేశ రాజకీయ చరిత్రలో తనదైన ముద్ర వేసిన గొప్ప నాయకురాలు, మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ. ధైర్యసాహసాలకు, దృఢమైన నిర్ణయాలకు మారుపేరుగా నిలిచిన ఆమెను ప్రపంచం 'ఉక్కు మహిళ'గా (ఐరన్ లేడీ) గుర్తించింది. దేశ తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, భారతదేశ అభివృద్ధి, ఆర్థిక ప్రగతి, రక్షణ రంగం, వ్యవసాయం, అంతర్జాతీయ సంబంధాల బలోపేతానికి విశేష కృషి చేశారు.

జననం.. కుటుంబ నేపథ్యం

శ్రీమతి ఇందిరాగాంధీ 1917 నవంబర్ 19న అలహాబాద్‌లో జన్మించారు. ఆమె తండ్రి భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, తల్లి కమలా నెహ్రూ. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబంలో జన్మించిన ఇందిరాగాంధీ చిన్ననాటి నుంచే జాతీయోద్యమ వాతావరణంలో పెరిగారు. దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటాలు, నాయకుల త్యాగాలు ఆమెపై ఎంతో ప్రభావం చూపాయి. చిన్నతనంలోనే దేశభక్తి, నాయకత్వ లక్షణాలను అలవర్చుకున్నారు.

ప్రధానిగా బాధ్యతలు.. దేశానికి చేసిన సేవలు

1966 జనవరి 24న భారత ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఇందిరాగాంధీ, 1977 వరకు తొలి విడతలో, 1980 నుంచి 1984 వరకు రెండో విడతలో ప్రధానిగా దేశానికి సేవలందించారు. ఆమె పాలనలో అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. హరిత విప్లవం: వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు, అధిక దిగుబడినిచ్చే విత్తనాల వినియోగం ద్వారా ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరగడానికి ప్రోత్సాహం అందించారు.బ్యాంకుల జాతీయీకరణ: 1969లో 14 ప్రధాన వాణిజ్య బ్యాంకులను జాతీయం చేసి సామాన్యులకు, రైతులకు, పేదలకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. 1971 యుద్ధ విజయం: పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో భారత సైన్యం విజయం సాధించడంతో బంగ్లాదేశ్ ఆవిర్భావానికి మార్గం సుగమమైంది. అంతరిక్ష, అణు రంగాలు: దేశ శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు. 1974లో భారత్ తొలి అణు పరీక్ష నిర్వహించడం దేశ చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచింది. పేదరిక నిర్మూలన: పేదరిక నిర్మూలన లక్ష్యంగా పలు సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 'గరీబీ హటావో' నినాదంతో ప్రజల్లోకి వెళ్లారు. దేశ రక్షణ: భారతదేశ సైనిక సామర్థ్యాన్ని, అంతర్జాతీయ స్థాయిలో దేశ గౌరవాన్ని పెంపొందించేందుకు కృషి చేశారు.

విమర్శలు.. చరిత్రలో వివాదాస్పద ఘట్టం

ఇందిరాగాంధీ పాలనలో ఎన్నో విజయాలు ఉన్నప్పటికీ, 1975లో దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించడం ఆమె రాజకీయ జీవితంలో తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ సమయంలో పౌర హక్కులపై ఆంక్షలు, పత్రికలపై సెన్సార్‌షిప్, ప్రతిపక్ష నాయకుల అరెస్టులు చోటుచేసుకున్నాయి. ఈ నిర్ణయం భారత ప్రజాస్వామ్య చరిత్రలో వివాదాస్పద అధ్యాయంగా మిగిలిపోయింది.

ముగింపు.. దేశ చరిత్రలో చిరస్మరణీయం

1984 అక్టోబర్ 31న ఇందిరాగాంధీ హత్యకు గురయ్యారు. ఆమె మరణం దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ధైర్యం, నాయకత్వ పటిమ, రాజకీయ దూరదృష్టితో భారతదేశ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆమె తీసుకున్న నిర్ణయాలు, సాధించిన విజయాలు, ఎదుర్కొన్న విమర్శలు నేటికీ దేశ రాజకీయ చరిత్రలో చర్చనీయాంశాలుగా ఉన్నాయి. నవంబర్ 19న ఆమె జయంతి సందర్భంగా దేశ ప్రజలు ఇందిరాగాంధీ సేవలను స్మరించుకుంటున్నారు. భారతదేశ తొలి మహిళా ప్రధానిగా ఆమె అందించిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి. రోటి కప్పుడా జౌర్ మఖాన్ నినాదంతో ముందు సాగిన భారతదేశ ముద్దుబిడ్డ దివంగత భారత మాజీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ.

ప్రతి నీటి బొట్టును కాపాడుకుందాం..
ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొందాం!

● నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించిన పుల్కల్ తహసీల్దార్ వంశీకృష్ణ





అందోల్, నవంబర్ 19 (ప్రజాజ్యోతి): వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవక నీటి ఎద్దడి ఏర్పడే పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటి పొదుపును బాధ్యతగా తీసుకోవాలని పుల్కల్ తహసీల్దార్ వంశీకృష్ణ పిలుపునిచ్చారు. నీటిని వృథా చేయకుండా ప్రతి నీటి బొట్టును సంరక్షించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గురువారం పుల్కల్ మండల కేంద్రంలో లిటిల్ స్టార్ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులతో కలిసి నీటి సంరక్షణపై భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'సేవ్ వాటర్' నినాదాలతో విద్యార్థులు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ చేపట్టి ప్రజలకు నీటి పొదుపు ఆవశ్యకతను వివరించారు. భవిష్యత్తులో నీటి కొరతను నివారించాలంటే ఇప్పటి నుంచే నీటి వృథాను అరికట్టి, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మి, పాఠశాల ప్రిన్సిపాల్ అశ్విని, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు, పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహదేవ్‌పల్లిలో భూభారతి భూ రీసర్వేపై గ్రామసభ

● భూ సమస్యల పరిష్కారానికి రీసర్వే మంచి అవకాశం ● సబ్ కలెక్టర్ ఉమా హారతి



కల్హేర్, నవంబర్ 19, ప్రజాజ్యోతి: కల్హేర్ మండలంలోని మహదేవ్‌పల్లి గ్రామంలో భూభారతి కార్యక్రమంలో భాగంగా భూ రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు తమ భూముల సరిహద్దులకు సంబంధించి ఉన్న సమస్యలను స్వయంగా ముందుకు వచ్చి అధికారుల దృష్టికి తీసుకురావాలని సబ్ కలెక్టర్ సూచించారు. భూ సరిహద్దు వివాదాలు, ఇతర భూ సమస్యలను పరస్పర సమన్వయంతో పరిష్కరించుకునేందుకు ఈ గ్రామసభ మంచి అవకాశమని తెలిపారు. రైతులు తమ సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని కోరారు. తహసీల్దార్ కె. శివ శ్రీనివాస్ మాట్లాడుతూ భూ రీసర్వే ద్వారా భూముల సరిహద్దు వివాదాలు, దారుల సమస్యలు, భూ రికార్డుల్లో ఉన్న తప్పులు తదితర సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారి వెంకటేశ్ రైతులకు భూ రీసర్వేపై అవగాహన కల్పించారు. భూముల సర్వే, హద్దుల నిర్ధారణ, భూ రికార్డుల్లో తప్పుల సవరణ తదితర అంశాలను వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ రీసర్వే ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. మహాదేవ్ పల్లి గ్రామ సర్పంచ్ లక్ష్మి పోచయ్య. వార్డు సభ్యులు పంచాయతీ సెక్రటరీ. ఈ గ్రామసభలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు వంద శాతం ఉండాలి

• మండల విద్యాధికారి బాల్ రాజు

కౌడిపల్లి నవంబర్ 19 ప్రజా జ్యోతి: కౌడిపల్లి మండలంలోని లింగంపల్లి, గ్రామపంచాయతీ పరిధిలోని తండా లో గల ప్రాథమిక పాఠశాలలను గురువారం రోజు మండల విద్యాధికారి బాల్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ అన్ని పాఠశాలలలో ఎఫ్ ఎల్ ఎన్ రికార్డ్స్ ను మెయింటైన్ చేయాలని, పిల్లల ఎఫ్ ఆర్ ఎస్ అటెండెన్స్ ను రోజు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. పిల్లలు ఎవ్వరు కూడా గైర్హాజరు కాకుండా వంద శాతం హాజరయ్యేటట్లు చూడాలని సూచించారు . ఈ



కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మల్లేశం, కల్పన, ప్రకాష్ లు ఉన్నారు.

మర్పడగలో అంతర్జాతీయ వైద్య బృందం పర్యటన

• బీపీ, షుగర్ రోగులకు అందుతున్న వైద్య సేవలపై సంతృప్తి

కొండపాక నవంబర్ 19 (ప్రజా జ్యోతి):-: కొండపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మర్పడగ గ్రామాన్ని గురువారం అంతర్జాతీయ అధికారుల బృందం సందర్శించింది. వియత్నాం, ఇండోనేషియా, బంగ్లాదేశ్, నేపాల్, మాల్దీవులకు చెందిన అధికారులు తెలంగాణ రాష్ట్రంలో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు, చికిత్సా విధానాలు, ఉచిత మందుల పంపిణీ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మర్పడగ గ్రామంలో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు అందుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రోగులకు ఉచితంగా అందిస్తున్న మందులు, వైద్య సదుపాయాలను చూసి అధికారుల బృందం అభినందనలు తెలిపింది. మర్పడగ గ్రామంలో ప్రస్తుతం 366 మంది బీపీ రోగులకు, 182 మంది షుగర్ వ్యాధిగ్రస్తులకు క్రమం



తప్పకుండా మందులు అందిస్తున్నట్లు వైద్య సిబ్బంది వివరించారు. గ్రామస్థాయిలోనే రోగులకు వైద్య సేవలు అందించడం అభినందనీయమని అంతర్జాతీయ బృందం పేర్కొంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాలరాజు, కొండపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్, జిల్లా ఎన్‌సీడీ కోఆర్డినేటర్ రాజేందర్, ఉపకేంద్ర ఆరోగ్య కార్యకర్తలు శోభ, స్వరూప, ఆశా కార్యకర్తలు స్వరూప, సుజాత, వసంత తదితరులు పాల్గొన్నారు.

ములుగు ఆరోగ్య కేంద్రానికి విదేశీ వైద్య బృందం

• బీపీ షుగర్ రోగులకు అందుతున్న వైద్య సేవల గూర్చి అడిగి తెలుసుకున్న వైద్యులు

ములుగు, నవంబర్19 (ప్రజాజ్యోతి) మండల కేంద్రమైన ములుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని విదేశీ వైద్య బృందం సభ్యులు గురువారం సందర్శించారు.ఈ సందర్భంగా భారత్ చెందిన డాక్టర్ ఆశిష్ సక్సేన,డాక్టర్ సంబిత్ జేనా,డాక్టర్ అమోర్ వాంకిడే,డాక్టర్ చక్యు జోషి,డాక్టర్ ఇమ్రాన్ సయ్యద్ తోపాటు మాల్దీవ్ కు చెందిన డాక్టర్ మూసా మాజిక్ ఇబ్రహీం,నేపాల్ కు చెందిన డాక్టర్ ఎమ్మెస్ రాజశ్రీ కక్షపతి,బంగ్లాదేశ్కు చెందిన డాక్టర్ స్పాయి చింగ్ మర్మ లు పాల్గొని హాస్పటల్లో బీపీ,షుగర్ వ్యాధుల తో పాటు రోగులకు ఆసుపత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవలు,ఆక్షైన్,ఆన్షైన్ గురించి గురించి అడిగి తెలుసుకున్నారు.ఆస్పత్రి వైద్యురాలు దీప్తి వైద్య బృందానికి ఆస్పత్రి లో చేస్తున్న పరీక్షల గురించి పూర్తి వివరాలను తెలుపుతూ ముఖ్యంగా



ఆసుపత్రికి ప్రతిరోజు వస్తున్న రోగులైన 30 సంవత్సరాల వయస్సు వారికి బిపి,షుగర్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఆసుపత్రి సిబ్బంది రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి శ్రద్ధగా విన్న వైద్య బృందం సంతృప్తి చెంది మీరు రోగులకు చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ములుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారులు సుజాత, కవిత, అంజలి, ఫార్మసిస్ట్ అధికారి మహేందర్, సూపర్వైజర్ శ్రీనివాస్, ఆరోగ్యశ్రీ సిబ్బంది పాల్గొన్నారు.



సిద్దిపేట్ సీఎం సభకు

బయలుదేరిన కాంగ్రెస్ శ్రేణులు



ములుగు, నవంబర్ 19 (ప్రజాజ్యోతి) సిద్దిపేటలో జరిగే సీఎం బహిరంగ సభకు ములుగు మండల పార్టీ అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్,జిల్లా కో ఆప్షన్ మాజీ సభ్యుడు సలీం,రంగ సత్యనారాయణ తో కలిసి మండల కేంద్రమైన ములుగు అంబేద్కర్ చౌరస్తా నుండి గురువారం కాంగ్రెస్ శ్రేణులు బయలుదేరగా మండలంలోని ఆయా గ్రామాల నుండి సర్పంచులు,మహిళలు,కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు.

సీఎం రేవంత్ రెడ్డి సభకు

భారీగా తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

తొగుట, నవంబర్ 19(ప్రజాజ్యోతి): సిద్దిపేటలో జరుగుతున్న సీఎం రేవంత్ రెడ్డి సభకు తొగుట మండలం లోని ఆయా గ్రామాల నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో మహిళలు, పార్టీ శ్రేణులు ఉత్సాహంగా సభకు సిద్దిపేట బహిరంగ సభకు బయలుదేరారు. కాంగ్రెస్ పార్టీ పట్ల తమకున్న అభిమానాన్ని, ప్రభుత్వానికి తమ మద్దతును చాటుతూ భారీ సంఖ్యలో సభకు వెళ్తున్నట్లు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజా



సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు మరింత ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. సభకు వెళ్లినవారిలో తుక్కాపూర్, లింగంపేట, గోవర్ధనగిరి తదితర గ్రామాల మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో దరఖాస్తులకు ఆహ్వానం

• కలెక్టర్ ప్రతిమ సింగ్

నవంబర్ 19 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి : గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మహమ్మదాబాద్, నర్సాపూర్ మండలం నందు కాంట్రాక్ట్ సి ఆర్ టి మరియు అకడమిక్ ఇన్స్ట్రక్టర్ ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకానికి దరఖాస్తులుఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మహమ్మదాబాద్, నర్సాపూర్ నందు 2026 2027 సంవత్సరానికి (01) కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ పోస్ట్లు (ఎస్ జి టి సోషియల్) కాంట్రాక్ట్ సర్వీస్ పద్ధతి ద్వారా డిఈడి. మరియు టి. ఈ. టి పేపర్ - 1 మరియు (01) అకడమిక్ ఇన్స్ట్రక్టర్ (ఎస్. ఎ. ఇంగ్లీష్) కోసం బి.ఈ డి మరియు పేపర్ ×× ఔట్ సోర్సింగ్



ప్రాతిపదికన పనిచేయడానికి ఆసక్తి మరియు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ధరఖాస్తుధారులు 18 నుండి 44 సం.ల మధ్య వయస్సు కలిగి పైన తెలిపిన సబ్జెక్ట్ లలో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ (సి ఆర్ టి) గా ఎంపికైనవారికి నెలకు రూ. 21,255 /- కాంట్రాక్ట్ సర్వీస్ ద్వారా మరియు అకడమిక్ ఇన్స్ట్రక్టర్ గా ఎంపికైనవారికి నెలకు రూ. 12,000 /- ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా జీతం చెల్లించనున్నట్లు తెలిపారు. వీరిని డెమో కండక్ట్ చేసి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుంది. కావున ఆసక్తి మరియు అర్హత కలిగిన అభ్యర్థులు తమ ధరఖాస్తును అవసరమైన అన్నీ పత్రాలతో జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయం, కలెక్టర్ కాంప్లెక్స్, రెండవ అంతస్తు రూమ్ నెంబర్ ఎస్ 17 మెదక్ నందు 25-11-2026 వ తేది సాయంత్రం 5 గంటల వరకు ధరఖాస్తు చేసుకోగలరని జిల్లా కలెక్టర్ తెలిపారు.

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కృషితోక్రీడాకారులకు శుభవార్త

• మెదక్ అభివృద్ధిలో మరో ముందడుగు వేసిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

• ఎంఎల్ఏ రోహిత్ చొరవతో మెదక్ పీఎన్ఆర్ ఇండోర్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్ సౌకర్యాల కోసం రూ.7.91 లక్షల నిధుల మంజూరు

నవంబర్ 19 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి : మెదక్ నియోజకవర్గంలో క్రీడారంగ అభివృద్ధికి మరో ముందడుగు పడింది.మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కృషి, చొరవతో మెదక్ పట్టణంలోని పీఎన్ఆర్ ఇండోర్ స్టేడియంలో 8 టేబుల్ టెన్నిస్ యూనిట్ల కొనుగోలు కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.7,91,000 (ఏడు లక్షల తొంభై ఒక వెయ్యి రూపాయలు) మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ యువజనాభ్యుదయ, పర్యాటక, సాంస్కృతిక (క్రీడల) శాఖ జీవో ఆర్టీ నంబర్ 345, తేదీ 19-11-2026 ద్వారా పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది.


యువత భవిష్యత్తుకు పెద్దపీట వేస్తున్న మైనంపల్లి రోహిత్

మెదక్ నియోజకవర్గంలోని యువతకు మెరుగైన క్రీడా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ చేస్తున్న కృషిలో భాగంగా ఈ నిధుల మంజూరును పేర్కొంటున్నారు.ఈ నిధులతో పీఎన్ఆర్ ఇండోర్ స్టేడియంలో 8 టేబుల్ టెన్నిస్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన పరికరాలను కొనుగోలు చేయనున్నారు.

దీంతో మెదక్ ప్రాంతంలోని యువ క్రీడాకారులకు మరింత మెరుగైన శిక్షణ అవకాశాలు లభించే అవకాశం ఉంది.

మెదక్ అభివృద్ధే లక్ష్యం -- యువత అభ్యున్నతే ధ్యేయంగా మైనంపల్లి రోహిత్

మెదక్ నియోజకవర్గ అభివృద్ధితో పాటు యువతకు క్రీడారంగంలో అవకాశాలు కల్పించేందుకు మైనంపల్లి



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

YAT&C (Sports) Department – Administrative sanction for an amount of Rs. 7,91,000/- (Rupees Seven Lakhs Ninety-One Thousand only) for procurement of 8 Table Tennis Units for PNR Indoor Stadium, Medak Town, Medak District – Sanction Accorded – Orders - Issued.

YOUTH ADVANCEMENT, TOURISM & CULTURE (SPORTS) DEPARTMENT

G.O.Rt.No.345 Dated:19.11.2026
Read:

From Vice Chairman & Managing Director, Sports Authority of Telangana, Hyderabad, Lrs.No.SATG/Stores/2223/2026, dt:18.08.2026 and dt:17.10.2026.

ORDER:

In the reference read above, the Vice Chairman & Managing Director, Sports Authority of Telangana, Hyderabad has requested the Government to accord administrative sanction for an amount of Rs. 7,91,000/- (Rupees Seven Lakhs Ninety-One Thousand only) towards procurement of 08 Table Tennis Units along with the required bats and balls, under the Head of Account 2204-00-104-25-04-310-312.

2. Government after careful examination of the request, hereby accord administrative sanction for an amount Rs. 7,91,000/- (Rupees Seven Lakhs Ninety-One Thousand Only) under the Head of Account 2204-00-104-25-04-310-312 to the Vice Chairman & Managing Director, Sports Authority of Telangana, Hyderabad for procurement of 8 Table Tennis Units for PNR Indoor Stadium, Medak Town, Medak District during the current Financial Year 2026-27.

3. The Vice Chairman & Managing Director, Sports Authority of Telangana, Hyderabad shall take further necessary action accordingly for procurement subject to compliance with other procedures and rules in vogue.

4. This order issues with the concurrence of the Finance (EBS.I) Department, vide their U.O.No.4342646/537/EBS.I/A2/2026, Dated:12.11.2026.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

A. VANI PRASAD
SPECIAL CHIEF SECRETARY TO GOVERNMENT

To
The Vice Chairman & Managing Director,
Sports Authority of Telangana, Hyderabad.

Copy to:
The P.S. to Hon'ble Minister for Sports & Youth Services.
The P.S. to Special Chief Secretary to Government,
YAT&C (Sports) Department.
The Finance (EBS.I) Department.
SF/SCs.

//FORWARDED BY :: ORDER//

SECTION OFFICER

రోహిత్ చూపుతున్న ప్రత్యేక శ్రద్ధను ఈ సందర్భంగా



ప్రస్తావిస్తున్నారు. క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువత తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకునేందుకు అవకాశం కలుగుతుంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా కొనుగోలు ప్రక్రియను చేపట్టాలని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థను ఆదేశించారు.

పేదల సంక్షేమమే ఇందిరా గాంధీ పాలనకు ప్రధాన లక్ష్యం

• ఇందిరమ్మ ఆశయాలు, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకొని ప్రజాసేవలో ముందుకు సాగాలి: మహదేవుని శ్రీనివాస్

కొమురవెల్లి, నవంబర్ 19 (ప్రజా జ్యోతి): -భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న, స్వర్గీయ శ్రీమతి ఇందిరా గాంధీ జయంతి వేడుకలను కొమురవెల్లి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహదేవుని శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా ఇందిరా గాంధీ దేశానికి విశిష్ట సేవలందించారని తెలిపారు. దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం ఆమె నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆమె తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. దేశం




పట్ల ఇందిరా గాంధీకి ఉన్న అంకితభావం, ధైర్యసాహసాలు, దృఢమైన నాయకత్వం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఆశయాలు, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాసేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి శ్రీనివాస్, చెరుకు రమణారెడ్డి, గొల్లపల్లి శ్రీనివాస్, కొయ్యడ శ్రీనివాస్, లింగంపల్లి కనకరాజు, మల్లం బాల్లయ్య, బొచ్చు ఎల్లయ్య, కుక్కల సత్తయ్య, గంగుల ఐలయ్య, చింతల పరశురాములు, బత్తిని నర్సింహులు గౌడ్, జనగాం శ్రీకాంత్, స్వాములపల్లి రమేష్, సార్ల లింగం, శెట్టిపల్లి విజేందర్, మాట్ల మురళీ, ఏర్పుల రాజు, యేనిశెట్టి కిరణ్, కానుగుల బాబు, గీస లింగం, మాచర్ల యాదగిరి, పబ్బోజు రాములు చారి, ముత్యం అంజయ్య, కొండ వెంకటేష్, పొతుగంటి యాదగిరి, మేడికుంట శ్రీనివాస్, దండ్యాల వెంకట నర్సింహారెడ్డి, పబ్బోజు శ్రీనివాస్, సిలివేరు మల్లేశం, చింతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

• లింగంపేట, తుక్కాపూర్, గోవర్ధనగిరి గ్రామాల్లో నూతన పెన్షన్ల పంపిణీ

తొగుట, నవంబర్ 19 (ప్రజాజ్యోతి): అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అని తొగుట మండలం లింగంపేట, తుక్కాపూర్ గ్రామ సర్పంచ్ లు గొడుగు జయమ్మ నర్సింలు, చిక్కుడు కళావతి స్వామి, గోవర్ధనగిరి ఉప సర్పంచ్ తోయేటి శ్రీనివాస్ లు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన నూతన పెన్షన్ల ను గురువారం లింగంపేట, తుక్కాపూర్, గోవర్ధనగిరి గ్రామాల్లో నూతనంగా పెన్షన్లకు ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి అభినందనీయమని, పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం, పెన్షన్ల ద్వారా నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తోందని తెలిపారు. దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి



శ్రీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవ తో పాటు సిద్దిపేట జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి సహకారం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు చేస్తున్న కృషికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు అందేలా ప్రభుత్వం మరింత చొరవ చూపాలని కోరారు. ఎలాంటి రాజకీయ వివక్ష లేకుండా నిజమైన అర్హులందరికీ సంక్షేమ పథకాలు అంధించడమే ప్రజాప్రభుత్వం లక్ష్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం, పెన్షన్ల ద్వారా నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తోందని తెలిపారు. తుక్కాపూర్ గ్రామానికి మంజూరైన ఐదు చేయూత పింఛన్ల ప్రొసీడింగ్స్‌ను అందజేసినట్లు గ్రామ సర్పంచ్ చిక్కుడు కళావతి స్వామి ముదిరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పాలకవర్గ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.





కంటైనర్ బోల్తా.. డ్రైవర్‌ను కాపాడిన బారు అరవింద్

గజ్వేల్, నవంబర్ 19 (ప్రజా జ్యోతి): గజ్వేల్ పట్టణంలోని ఇంద్ర పార్క్ చౌరస్తా వద్ద గురువారం తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో భారీ కంటైనర్ అదుపుతప్పి బోల్తాపడింది.గజ్వేల్ నుంచి తూప్రాన్ వైపు వెళ్తున్న కంటైనర్‌కు మార్గమధ్యలో ఆవు అడ్డురావడంతో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో కంటైనర్ చౌరస్తా వద్ద బోల్తాపడింది.ఈ ప్రమాద విషయం తెలుసుకున్న బీజేపీ గజ్వేల్ మండల ప్రధాన కార్యదర్శి బారు అరవింద్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదంలో కంటైనర్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను గమనించి, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వాహనం ముందు అద్దాన్ని పగులగొట్టి డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీసి ప్రాణాపాయం నుంచి కాపాడారు.అనంతరం అదే రోజు రాత్రి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ప్రమాదానికి సంబంధించి ఫిర్యాదు చేశారు. ప్రమాద సమయంలో తక్షణమే స్పందించి డ్రైవర్ ప్రాణాలను కాపాడిన బారు అరవింద్‌ను పలువురు అభినందించారు.

గొగ్య నాయక్ తాండలో 12 నూతన చేయూత పెన్షన్ల పంపిణీ

అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

సర్పంచ్ భాస్కర్ నాయక్

చౌడాపూర్ మండలం (ప్రజా జ్యోతి) నవంబర్ 19 :

వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల పరిధిలోని గొగ్య నాయక్ తాండ గ్రామపంచాయతీలో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నూతనంగా మంజూరైన 12 చేయూత పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.మంజూరైన పెన్షన్లలో మూడు దివ్యాంగుల పెన్షన్లు,మూడు ఒంటరి



మహిళల పెన్షన్లు,ఆరు వితంతు పెన్షన్లు ఉన్నాయి.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భాస్కర్ నాయక్ మాట్లాడుతూ,రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని అన్నారు.అర్హులైన పేదలకు పెన్షన్లు మంజూరు కావడం సంతోషకర మని పేర్కొన్నారు.పేద,బడుగు,బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని,గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.నూతనంగా పెన్షన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాస్కర్ నాయక్,పంచాయతీ కార్యదర్శి మహేష్ కుమార్,వార్డు సభ్యురాలు లక్ష్మీబాయి,గ్రామ పెద్దలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కుల్కచర్ల మండల కేంద్రంలో ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

కుల్కచర్ల మండల నవంబర్ 19 (ప్రజా జ్యోతి)

మండల కేంద్రంలో ఈరోజు మాజీ ప్రధానమంత్రి, భారతరత్న ఇందిరా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి కుల్కచర్ల కాంగ్రెస్ పార్టీ మండల



అధ్యక్షులు గోపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు నాయకులు ముందుగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ ఐక్యత సమగ్రత కోసం ఇందిరా గాంధీ చేసిన సేవలు చిరస్మ రణీయమని కొనియాడారు పేదల సంక్షేమం దేశ అభివృద్ధి కోసం ఆమె తీసుకున్న నిర్ణయాలు నేటికీ ఆదర్శప్రాయమని అన్నారు ఆమె ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅ తిథులుగా పీఏసీఎస్ చైర్మన్ భీమిరెడ్డి ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పాల్గొని పూలమాలతో నివాళులర్పించారు వీరితో పాటు వివిధ గ్రామాల గ్రామ నాయకులు మండల నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులు అర్పించారు.

రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్రాలు అందించాలి

గతంలో రైతు సంఘాలకు అప్పగిస్తే నిర్లక్ష్యం వెంటాడింది...!

ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న పలువురు రైతులు

పెద్దేముల్ తాండూర్ నవంబర్ 19 ప్రజాజ్యోతి:





ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వ్యవసాయ యంత్రాలను రాయితీపై అందించడంతో రైతులకు ఉ ప యో గ క ర ం గా ఉంటుందని పలు రైతులు ప్రభుత్వ అన్ని డిమాండ్ చేస్తున్నారు. (కస్టమర్ ఐరింగ్స్ సెంటర్) పేరుతో రైతు సంఘాలకు అప్పగిస్తే వ్యవసాయ యంత్రాలు పరమతలకు గురవడంతో మూలకు పడేయాల్సిన పరిస్థితి వచ్చిందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు వ్యక్తిగతంగా నేరుగా రాయితీ ద్వారా వ్యవసాయ యంత్రాలను అప్పగిస్తే వ్యవసాయ అవసరాలకు వినియోగించుకోవ డంతో పాటు అవసరమైన రైతులకు అద్దెకు కూడ ఇచ్చేందుకు వీలవుతుందని గుర్తు చేస్తున్నారు. నేరుగా రైతులకు రైతుపై వ్యవసాయ యంత్రాలను మంజూరు చేస్తే యంత్రాల మరమ్మత్తుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవడంతో దీర్ఘకాలం పాటు వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందని రైతులు కోరుతున్నారు. గతంలో పెద్దేముల్ మండలానికి చెందిన కొందరు రైతు సంఘాలకు మంజూరు చేసిన వ్యవసాయ యంత్రాలలో ట్రాక్టర్ తుప్పు పట్టిపోయి వ్యవసాయానికే పనికి రాకుండా పాడై పోయిందని పలువు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రైతులకు నేరుగా రాయితీపై వ్యవసాయ యంత్రాలను మంజూరు చేసేందుకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

చదువుకో తెలంగాణ..బాగా చదవండి..రూ.2 కోట్లకు పైగా నగదు బహుమతులు పొందండి

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీస్తున్న శ్రీరామ్ గ్రూప్..విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట

చౌడాపూర్ మండలల్ (ప్రజా జ్యోతి) నవంబర్ 19 :

వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్ర పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో శ్రీరామ్ గ్రూప్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద,మధ్య





తరగతి విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి,వారిని విద్యాపరంగా ఉన్నత శిఖరాలకు చేర్చాలనే గొప్ప సంకల్పంతో శ్రీరామ్ గ్రూప్ చేపట్టిన చదువుకో తెలంగాణ కార్యక్రమం విద్యారంగంలో స్ఫూర్తిదాయ కంగా నిలుస్తోంది.విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించి,పోటీతత్వాన్ని ప్రోత్సహిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించేలా చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

చదువులో ప్రతిభ చూపితే లక్షల్లో నగదు బహుమతులు తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు శ్రీరామ్ గ్రూప్ భారీ నగదు బహుమతులను ప్రకటించింది.

రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థికి రూ.5 లక్షలు,రెండో స్థానం సాధించిన విద్యార్థికి రూ.3 లక్షలు నగదు బహుమతి అందజేయనున్నారు.అలాగే జిల్లా స్థాయి టాపర్‌కు రూ.2 లక్షలు,నియోజకవర్గ స్థాయి టాపర్‌కు రూ.లక్ష,మండల స్థాయి టాపర్‌కు రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందించనున్నట్లు సంస్థ ప్రకటించింది.విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం.చెక్కుల పంపిణీ ఈ కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన గొట్టం పల్లవి,షేక్ ఫారిన్‌లకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున నగదు బహుమతులు అందజేశారు.చౌడా పూర్ మండల టాపర్‌గా నిలిచిన కొత్తపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి మహేశ్వరికి రూ.10 వేల నగదు బహుమతి చెక్కును మహేశ్వరి అందుబాటులో లేకపోవడంతో శ్రీరామ్ గ్రూప్ వారు వారి తండ్రి కుమ్మరి వెంకటయ్య కు చెక్కు అందజేసి శాలువాతో సన్మానించి అభినందించారు.అదేవి ధంగా కుల్కచర్ల మండల టాపర్‌గా నిలిచిన పదో తరగతి విద్యార్థిని ఫైన్ మీద తబుసుమ్‌కు కూడా రూ.10 వేల నగదు బహుమతి చెక్కును అందజేశారు.పరిగి శ్రీరామ్ గ్రూప్ డివిజనర్ మేనేజర్ ఎం. సురేష్,అసిస్టెంట్ డివిజన్ మేనేజర్ ఎం. సురేష్ మాట్లాడుతూ.ప్ర భుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉందని,సరైన ప్రోత్సాహం,మార్గదర్శకం అందిస్తే వారు రాష్ట్రస్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలోనూ రాణించగలరని అన్నారు.పదో తరగతి విద్యార్థులు ఈ విద్యా సంవత్సరాన్ని ఎంతో కీలకంగా భావించి క్రమశిక్షణతో,పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు.విద్యా ర్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించి,వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలనే గొప్ప సంకల్పంతోనే శ్రీరామ్ గ్రూప్ చదువుకో తెలంగాణ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నత మార్కులు సాధించి తమ తల్లిదండ్రు లకు,ఉపాధ్యాయులకు,గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించడం తమ సంస్థకు ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.విద్యార్థుల భవిష్యత్తుకు శ్రీరామ్ గ్రూప్ భరోసా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు శ్రీరామ్ గ్రూప్ ముందుకు రావడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.కేవలం మార్కుల కోసం కాకుండా జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలనే పట్టుదలను విద్యార్థుల్లో పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత.ప్ర తిభ ఉన్న విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం అందించడం ద్వారా వారి భవిష్యత్తు చదువులకు మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి సురేందర్,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటిరెడ్డి,వార్డు సభ్యులు కటికె యాదిలాల్,మాజీ ఉప సర్పంచ్ కుమ్మరి అనంతయ్య,జోగు కృష్ణయ్య,జంబుల రఘు,కర్నె విష్ణు,ఉపాధ్యాయ బృందం,గ్రామ పెద్దలు,విద్యార్థులు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

నవ కంటోన్మెంట్ నిర్మాణమే లక్ష్యం.. ప్రజలకు శాశ్వత మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

సంజీవయ్య నగర్‌లో ఎమ్మెల్యే శ్రీగణేష్ బస్తీ పర్యటన..

విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు

బోయిన్ పల్లి, నవంబర్ 19 (ప్రజా జ్యోతి):

సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నవ కంటోన్మెంట్‌గా తీర్చిది ద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని





కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. ప్రజలకు నాణ్యమైన, శాశ్వత మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.గురువారం కంటోన్మెంట్ పరిధిలోని 5వ వార్డు సంజీవయ్య నగర్ వీకర్ సెక్షన్‌లో ఎమ్మెల్యే శ్రీగణేష్ బస్తీ పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ వీధుల్లో పర్యటించి స్థానిక ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీలో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీ లించారు.స్థానికులు విద్యుత్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వెంటనే మారేడ్‌పల్లి విద్యుత్ శాఖ అధికారిని పిలిపించి సమస్యలను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.అనంతరం బస్తీ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించడంతో పాటు వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని వైద్య సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి బస్తీలో నాణ్యమైన సీసీ రోడ్లు, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ, సీవరేజ్ లైన్లు, వీధి దీపాలు వంటి శాశ్వత మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వాటర్, ఎలక్ట్రిసిటీ తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజల సమస్యల పరిష్కారా నికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ప్రజలు ప్రతిరోజూ తనను కలిసి సమస్యలు వివరిస్తున్నప్పటికీ, తానే స్వయంగా బస్తీలకు వెళ్లి ప్రజలను కలుసుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు, ప్రజల అవసరాలు తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి వార్డులో, ప్రతి బస్తీలో పర్యటించి సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని వివరించారు.తాత్కాలిక ఉపశమనం కల్పించడమే కాకుండా, భవిష్యత్తులోనూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన శాశ్వత మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీగణేష్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు ప్రెసిడెంట్ పెద్దల నరసింహ, కాంగ్రెస్ నాయకులు భాస్కర్ గౌడ్, నాగేందర్ యాదవ్, విక్కీ, సాయి, లక్ష్మణ్ యాదవ్, యాదగిరి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయానికి ప్రింటర్ బహూకరణ

సొంత వ్యయంతో అందజేసిన పడకల్ సర్పంచ్ డోకూరి సునీతా ప్రభాకర్ రెడ్డి

తలకొండపల్లి,నవంబర్ 19 (ప్రజాజ్యోతి):

తలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయానికి పడకల్ గ్రామ సర్పంచ్ డోకూరి సునీతా ప్రభాకర్ రెడ్డి తమ సొంత వ్యయంతో దాదాపు రూ. 25 వేలు విలువ చేసే ప్రింటర్‌ను గురువారం అందజేశారు.ఎంపీడీవో సీతారా మమ్మకు ప్రింటర్‌ను అందజేసి,కార్యాలయ అవసరాలకు ఉపయోగపడాలని కోరారు.ఈ సందర్భంగా ఎంపీడీవో సీతారామమ్మ మాట్లాడుతూ...మండల పరిషత్ కార్యాలయంలో రోజువారీ పనులు,దరఖాస్తులు,రికా ర్డుల నిర్వహణ,వివిధ పథకాలకు సంబంధించిన పత్రాల తయారీకి ప్రింటర్ అవసరం ఎంతగానో ఉండేదని,సర్పంచ్ ముందుకు వచ్చి సొంత ఖర్చుతో అందజేయడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు.ఈ ప్రింటర్ వల్ల కార్యాలయ పనులు వేగవంతం అవుతాయని,ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ఇలాంటి సేవా భావం ఇతర ప్రజాప్రతినిధులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందన్నారు.మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు,సిబ్బందికి ఇబ్బంది లేకుండా ఉండాలనే ఉద్దేశంతోనే తన సొంత వ్యయంతో ప్రింటర్ అందజేశానని,భవిష్యత్తులో కూడా మండల అభివృద్ధికి,ప్రజా సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానని సర్పంచ్ డోకూరి సునీతా ప్రభాకర్ రెడ్డి తెలిపారు.గ్రామ అభివృద్ధితో పాటు మండల స్థాయి కార్యాలయాలకు అవసరమైన సదుపాయాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్,పడకల్ వార్డు సభ్యులు జోగు విజయ్,బురిగల్ల రమేష్,ఎండి వాజీద్,నాయకులు జనిగే నరసింహ,చౌటి జగన్,రాములు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ చైర్మన్ జంపన ప్రతాప్

బోయినపల్లి, నవంబర్ 19 (ప్రజా జ్యోతి):

భారత తొలి మహిళా ప్రధానమంత్రి, ఉక్కు మహిళ ఇందిరాగాంధీ జయంతి వేడుకలను న్యూ బోయినపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకుల






ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పంప్‌హౌస్ ఆవరణలో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ.. పేదలకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఇందిరాగాంధీ బ్యాంకుల జాతీయకరణ చేపట్టారని గుర్తుచేశారు. పేదరిక నిర్మూలన కోసం 'గరీబీ హటావో' నినాదంతో అట్టడుగు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని కొనియాడారు. దేశ అభివృద్ధిలో ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీ యమని పేర్కొన్నారు.ఇందిరాగాంధీని స్ఫూర్తిగా తీసుకుని నేడు ఎంతోమంది మహిళలు రాజకీయాలు, విద్య, సామాజిక, ఆర్థిక తదితర రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. మహిళా సాధికారతకు ఆమె జీవితం ఒక గొప్ప ఆదర్శమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బల్వంత్ రెడ్డి, అరుణ్ యాదవ్, హరికృష్ణ, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు సాయిబాబా యాదవ్, వాసు గౌడ్, సత్యనారాయణ, సురేష్, యాదగిరి, చోటు, ముకేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బీరువాలు విరాళం

తలకొండపల్లి,నవంబర్ 19 (ప్రజాజ్యోతి)

రంగారెడ్డి జిల్లా తలకొండపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైన్స్ ల్యాబులకు అవసరమైన బీరువాలను దాతలు అందజేసి తమ ఔదార్యాన్ని



చాటుకున్నారు.గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మెదక్ పల్లి వాస్తవ్యులు కసిరెడ్డి విజేందర్ రెడ్డి,అదేవిధంగా ఆమనగల్ వాస్తవ్యులు కౌన్సిలర్ పాపిశెట్టి రాములు చెరొక బీరువాను కళాశాలకు అందజేశారు.కళాశాలలో సైన్స్ విద్యార్థుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుండ టంతో ల్యాబ్ పరికరాలను భద్రంగా ఉంచుకునేం దుకు బీరువాల అవసరం ఎంతగానో ఉందని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు తమ వంతు సహాయం చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు.విద్యార్థులు బాగా చదివి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దాతల సహాయంతో ల్యాబులలో పరికరాల నిర్వహణ మరింత సులభం అవుతుందని అన్నారు.ఇలాంటి సహాయం విద్యార్థుల చదువుకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుందని వారు పేర్కొన్నారు.అనంతరం దాతలిద్దరికీ కళాశాల తరపున ప్రిన్సిపాల్ మరియు స్టాఫ్ మరియు విద్యార్థులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజే శారు.కార్యక్రమంలో అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

ఓటర్ల జాబితా నుంచి తొలగించిన అర్హులైన వారి పేర్లను తిరిగి చేర్చాలి: రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

కరీంనగర్ బ్యూరో,నవంబర్ 19 (ప్రజాజ్యోతి): కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, ఎస్ఐఆర్ విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాస్తూ ఎన్నికల వ్యవస్థను బీజేపీకి అనుకూలంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని సీఈసీగా వ్యవహరించాల్సిన జ్ఞానేష్ కుమార్ బీజేపీ, ప్రధాని మోదీకి అనుకూలంగా పనిచేస్తున్నారని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా





(సర్) ప్రక్రియను నిలిపివేసి ఓటర్ల జాబితా నుంచి తొలగించిన అర్హులైన ఓటర్ల పేర్లను తక్షణమే తిరిగి చేర్చాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్‌లోని స్థానిక కృషి భవన్‌లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఏ. వినాయక్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి జోజిరెడ్డి మాట్లాడుతూ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీజేపీ వ్యతిరేక ఓట్లతో పాటు మైనార్టీలు, ఆదివాసీల ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగిస్తున్నారని ఆరోపించారు. ఈ ఉద్యమం కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించే స్థాయికి చేరుతుందని అన్నారు.సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాల్లో ప్రభుత్వాలే మారే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 13 కోట్లకు పైగా బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించారని ఆరోపించారు.సుదా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల కమిషన్‌ను ఉపయోగించుకుంటోందని ఆరోపించారు. జ్ఞానేష్ కుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాల్సి ఉండగా, వాటిని ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలను పట్టించుకోకుండా తన ఇష్టానుసారంగా ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రారంభించారని ఆరోపించారు. జేపీ చలపతిరావు మాట్లాడుతూ ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందన్నారు. ఎన్నికలే ప్రజాస్వామ్యానికి పునాదులని, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కోల్పోయేలా సీఈసీ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.టి. కొండల్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు.జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు దేవేందర్ మాట్లాడుతూ న్యాయవ్యవస్థ జోక్యం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి జాబితాలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా 15 కోట్ల ఓట్లు తొలగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజాస్వామ్యాన్ని, లౌకిక రాజ్యాంగాన్ని కాపాడేందుకు రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలు, మేధావులు, అభ్యుదయ, ప్రగతిశీల శక్తులు ఏకమై భవిష్యత్తులో నిర్వహించే నిరసన పోరాటాల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని వక్తలు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఏలేష్, జాషువా, రాములు, మేరీ తదితరులు పాల్గొన్నారు.

వాణీనికేతన్ హైస్కూల్ లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

ఇల్లంతకుంట నవంబర్ 19(ప్రజాజ్యోతి)రాజన్న సిరిసిల్ల జిల్లా

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని వాణీనికేతన్ హైస్కూల్ లో గురువారం రోజు బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి



విద్యా బోధన చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యాబోధనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట్ల శ్రీనివాస్ రెడ్డి బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తూముకుంట్ల శ్రీనిధి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజు, సంతోష్, రమేష్, రాజు, తిరుపతి, సుమంగళి, శోభ, మహాలక్ష్మి , లావణ్య, సునంద, మౌనిక, కళ్యాణి, షమీమా, స్వాతి, రేణుక, శాంత, పద్మ, రేణుక, సునీత, ఉషలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు

ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించిన విద్యార్థినులు

ముస్తాబాద్, నవంబర్ 19 (ప్రజా జ్యోతి):

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఉపాధ్యాయులుగా మారి తరగతి గదుల్లో తోటి విద్యార్థులకు



పాఠాలు బోధించారు. ఉపాధ్యాయుల బాధ్యతలను స్వయంగా నిర్వహిస్తూ బోధనలో తమ ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థినులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పడం పాఠశాలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేష్మ సుల్తానా, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి , రాజన్న, నాగేశ్వర్లు, శంకరయ్య, జ్యోతి రాణి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి జయంతి వేడుకలు

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి నవంబర్ 19(ప్రజాజ్యోతి)

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూర దేవరాజు ఆధ్వర్యంలో గురువారం మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ గారు గ్రంథాలయం చైర్మన్ నాగుల సత్యనారాయణ గారు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూర దేవరాజు మాట్లాడుతూ.. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి, పేద ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేశారని కొనియాడారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం ఆమె చేసిన సేవలు మరువలేనివని, పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప నాయకురాలు ఇందిరాగాంధీ అని పేర్కొన్నారు.ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' కరపత్రాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు.సిద్దిపేటలో నిర్వహిస్తున్న సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు.రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సత్తు శ్రీనివాసరెడ్డి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకునూరి గడ్డం నరసయ్య బాలరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి రాగుల జగన్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చఆడెపు చంద్రకళ కౌన్సిలర్లు కూరపాటి శ్రీశైలం బొద్దుల శ్రీనివాస్ లింగంపల్లి గంగరాజు వెంగళ లక్ష్మీ నరసయ్య పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గొప్ప దేవయ్య ప్రధాన కార్యదర్శి నీలి రవీందర్ మాజీ పట్టణ అధ్యక్షులు పత్తిపాక లక్ష్మీరాజు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్.కె రియాజు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు అధ్యక్షులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బొప్పాపూర్ పాఠశాలలో బాలల దినోత్సవం

ఎల్లారెడ్డిపేట నవంబర్ 19(ప్రజాజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల



బొప్పాపూర్ పీఎం శ్రీ పాఠశాల లో గురువారం రోజు బాలల దినోత్సవం జరిగింది పాఠశాలలో విద్యార్థులు విద్యార్థుల ఆసక్తికరంగా డీఈఓ ఎంఈఓ ప్రధానోపాధ్యాయులు పీఈటి పాత్రల ద్వారా పాఠశాలలో విద్యార్థులు విద్యార్థులు ఆకర్షణ ఇచ్చింది ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి ఉపాధ్యాయ ఉపాధ్యాయ బృందం నిర్వహించింది.

కోతుల దాడిలో రైతుకు గాయాలు

ఎల్లారెడ్డిపేట నవంబర్ 19 ప్రజా జ్యోతి: ఎల్లారెడ్డిపేట మండలం లోని రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన పాతూరి బాల్ రెడ్డి అనే రైతు ఇంటి ముందు నిలబడగా కోతి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. చికిత్స నిమిత్తం నిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో కోతుల బెదద తో ప్రజలు, విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారు



ప్రతి ఇంటికీ ఇందిరమ్మ బీమా భరోసా

శుక్రవారం నుంచి గ్రామ గ్రామాన ఇంటింటి సర్వే..
ఏ ఒక్క కుటుంబం మిస్ కాకూడదు..
కలెక్టర్ చిత్రా మిశ్రా అదేశం

కరీంనగర్ బ్యూరో, నవంబర్ 19 (ప్రజాజ్యోతి) పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో పథకం అమలుకు తీసుకోవాల్సిన చర్యలు, కుటుంబాల వివరాల సేకరణ, క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహణ, పర్యవేక్షణ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో వివరాల సేకరణ అత్యంత కీలకమని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబాన్ని సర్వే పరిధిలోకి తీసుకురావాలని, ఎవరి వివరాలు నమోదు కాకుండా మిగిలిపోకూడదని



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. పథకానికి అర్హులైన ప్రతి కుటుంబాన్ని గుర్తించి, పూర్తి స్థాయిలో వివరాలు సేకరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఈ మేరకు శుక్రవారం నుంచి జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సర్వేలో ఏ ఒక్క కుటుంబం కూడా మిగిలిపోకుండా ప్రతి ఇంటి వివరాలను పక్కాగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించిన నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.మండల స్థాయిలో ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు, ఎంపీవోలు గ్రామాల వారీగా సర్వే ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజూ సర్వే పురోగతిని సమీక్షిస్తూ, నిర్ణీత సమయంలోగా కుటుంబాల పూర్తి వివరాల సేకరణను పూర్తి చేయాలని సూచించారు. పథకం అమలులో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ, అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా భరోసా అందేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, డీఆర్వో స్వామి, పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మల్లన్నపేటలో నూతన ప్యాక్స్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

గొల్లపల్లి నవంబర్ 19 ప్రజాజ్యోతి: గొల్లపల్లి మండలంలోని మల్లన్నపేట గ్రామ రైతుల చిరకాల స్వప్నం సాకారం దిశగా మరో అడుగు పడింది గ్రామంలో



నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్ విండో) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో గ్రామంలో సంబరాలు అంబరాన్నంటాయి ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ ఏఎంసీ చైర్మన్ భీమా సంతోష్ ఆధ్వర్యంలో గ్రామంలో సంబరాలు నిర్వహించారు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వ్యవసాయ & సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా భీమా సంతోష్ మాట్లాడుతూ మల్లన్నపేట గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఏర్పాటు కావాలన్నది రైతుల కల అని పేర్కొన్నారు రైతుల చిరకాల ఆకాంక్షను గుర్తించి ప్యాక్స్ మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తుమ్మల నాగేశ్వరరావుకు గ్రామ రైతులు నాయకుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు నూతన సింగిల్ విండో ఏర్పాటుతో రైతులకు వ్యవసాయ సంబంధిత సేవలు మరింత చేరువ కానున్నాయని వివిధ అవసరాల కోసం మండల కేంద్రానికి వెళ్లే ఇబ్బందులు తగ్గి స్థానికంగానే సేవలు పొందే అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు రైతుల సంక్షేమం గ్రామీణ వ్యవసాయ అభివృద్ధికి ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు రైతుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మల్లన్నపేట వ్యవసాయ రంగానికి కొత్త ఊపునిస్తుందని భీమా సంతోష్ పేర్కొన్నారు అనంతరం సింగిల్ విండో మంజూరు కు కృషి చేసిన భీమా సంతోష్ కు ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉప సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు ముత్యాల స్వామి మాజీ ఉప సర్పంచ్ బేరా కిషోర్ కాంగ్రెస్ నాయకులు సిద్దెంకి రమేష్ కళ్లెం రాజన్న గొట్టిపలుకుల తిరుపతి బండారి గంగాధర్ గ్రామ రైతులు పాల్గొన్నారు

గడిబురుజులపై మాటల యుద్ధం..

బహిరంగ చర్చకు జువ్వాడి సవాల్!
గడిబురుజుల స్థలం, వీఎల్‌టీ వివాదంపై ఎమ్మెల్యేకు జువ్వాడి కృష్ణారావు సవాల్
అవినీతి ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటా జువ్వాడి

కోరుట్ల, నవంబర్ 19 ప్రజాజ్యోతి: కోరుట్ల పట్టణంలోని చారిత్రక గడిబురుజుల స్థలం, వీఎల్‌టీ ఖాళీ స్థలాల పన్ను వివాదంపై కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ బహిరంగ చర్చకు రావాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు సవాల్ విసిరారు. గడిబురుజుల స్థలాన్ని వివాదాస్పదం చేస్తూ, కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు.గురువారం కోరుట్ల పట్టణంలోని తన స్వగృహం జువ్వాడి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణారావు మాట్లాడుతూ.. పురాతనమైన గడిబురుజుల ప్రాంతాన్ని కాపాడుతామని ఎమ్మెల్యే బహిరంగ ప్రకటనలు చేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని విమర్శించారు. ఒకసారి 300 అడుగుల దూరంలో నిర్మాణాలు చేపట్టవచ్చని, మరోసారి 15 అడుగుల దూరంలో నిర్మాణాలు చేపట్టవచ్చని



చెబుతూ రోజుకో ప్రకటన చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంపై తాను మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

– కోరుట్లలో అభివృద్ధి ఎక్కడ?

కోరుట్ల నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు హయాంలో కానీ, ప్రస్తుత ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ హయాంలో కానీ చెప్పుకోదగిన అభివృద్ధి జరగలేదని జువ్వాడి కృష్ణారావు విమర్శించారు. ఎన్నికల సమయంలో కొండ్రికర్ల వంతెన నిర్మిస్తామని బాండ్ పేపర్‌పై రాసిచ్చి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే కొండ్రికర్ల వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, త్వరలోనే పనులు పూర్తవుతాయని వెల్లడించారు.

– అవినీతి ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా!

గడిబురుజుల స్థలం, వీఎల్‌టీ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీపై చేస్తున్న ఆరోపణలపై పట్టణంలో ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని జువ్వాడి కృష్ణారావు ప్రకటించారు. చర్చకు సంబంధించిన తేదీ, సమయం, వేదికను ఎమ్మెల్యే సంజయ్‌నే నిర్ణయించాలని కోరారు. పట్టణ ప్రజలు, అధికారులు అందరి సమక్షంలో చర్చ జరగాలని అన్నారు.తమపై వచ్చిన అవినీతి ఆరోపణల్లో ఏ ఒక్కటైనా నిరూపిస్తే తాము శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఇతరులపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేయవద్దని హితవు పలికారు.

– వీఎల్‌టీ వివాదంపై బహిరంగ చర్చకు రావాలి

వీఎల్‌టీ విషయంలో కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేయడం మానుకొని, ప్రజల సమక్షంలో వాస్తవాలను వెల్లడించేందుకు ఎమ్మెల్యే సంజయ్ బహిరంగ చర్చకు రావాలని జువ్వాడి కృష్ణారావు డిమాండ్ చేశారు. గడిబురుజుల స్థలం విషయంలో ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, పుప్పాల ప్రభాకర్, సత్యనారాయణ, పెరుమాళ్ల సత్యనారాయణ, సంఘ లింగం నజీర్, చిట్యాల లక్ష్మీనారాయణ, ఆర్. భూమయ్య, రిజ్వాన్, రియాజ్, ఎతిరాజ్యం నరసయ్య, మరిపెద్ది జనార్ధన్, నయీమ్, తోట గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో కోరుట్ల విద్యార్థినికి రజత పతకం

అయేషా మరియం ప్రతిభపై హర్షం వ్యక్తం చేసిన కోరుట్ల పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ గుజ్జెటి వెంకటేష్

కోరుట్ల, నవంబర్ 19 ప్రజాజ్యోతి: జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బృందావన్



గార్డెన్‌లో ఈ నెల 14,15 తేదీల్లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో కోరుట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థిని అయేషా మరియం అద్భుత ప్రతిభ కనబరిచి రజత పతకం సాధించింది. అండర్-14 బాలికల విభాగంలో 26 కేజీల లోపు బరువు కేటగిరీలో పోటీపడిన అయేషా మరియం ఫైనల్ వరకు చేరుకుని తన ప్రతిభతో సిల్వర్ మెడల్ కైవసం చేసుకుంది. రాష్ట్రస్థాయిలో పతకం సాధించి కోరుట్ల పట్టణానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– విద్యార్థుల ప్రతిభ పాఠశాలకు గర్వకారణం గుజ్జెటి వెంకటేష్:

ఈ సందర్భంగా కోరుట్ల పబ్లిక్ స్కూల్



కరస్పాండెంట్ గుజ్జెటి వెంకటేష్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీల్లో రజత పతకం సాధించడం ఎంతో గర్వకారణమని అన్నారు. చదువుతో పాటు క్రీడలు, ఇతర రంగాల్లోనూ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించడం తమ లక్ష్యమని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందని పేర్కొన్నారు.పతకం సాధించిన అయేషా మరియంను, ఆమె తండ్రి అతీక్‌ను పాఠశాల ప్రిన్సిపాల్, తైక్వాండో కోచ్ నవనంది రమేష్, ఉపాధ్యాయ బృందం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.



ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో

మైనారిటీ గురుకుల విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లి నవంబర్19(ప్రజా జ్యోతి) మధిరలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో బుధవారం సత్తుపల్లి మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనపరిచి, ద్వితీయ స్థానం గెలుపొందారని మైనారిటీ ప్రిన్సిపల్ శేషగిరి రావు తెలిపినారు.ఈ పోటీల్లో విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించి,పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రెండో స్థానంలో నిలిచిన క్రీడాకారులను, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ డి. మహర్షి ని పాఠశాల ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించి, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ముందు ముందు కూడా ఇదే



విధంగా మైనారిటీ పాఠశాలకు మంచి గుర్తింపు తేవాలని, విద్యార్థులకు అండగా అన్ని విధాల సపోర్టుగా ఉంటానని, ప్రతిభ కనబరిచే విధంగా మహర్షి విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొని విజేతలకు శు భాకాంక్షలు తెలిపారు.

బాలల హక్కులపై

అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

◆ ఐసిడిఎస్ సూపర్వైజర్ సంధ్యారాణి

చింతకాని నవంబర్19(ప్రజా జ్యోతి) బాలల హక్కులపై సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించి హక్కులకు భంగం కలగకుండా అప్రమత్తం చేయాలని సూపర్వైజర్ సంధ్యారాణి అన్నారు. చింతకాని మండల పరిధిలోని ప్రొద్దుటూరు గ్రామపంచాయతీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణములలో అంగన్వాడీ కేంద్రాల పరిధిలో అంగన్వాడీ టీచర్లు నిర్మల జ్యోతి, ఉమామహేశ్వరి ,సులోచన ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల హక్కుల వారోత్సవాలలో సంధ్యారాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ద్వారా సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికతో ముందుకు వెళ్ళవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ,పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు.





యుక్త వయసు బాలికలు తీసుకునే ఆహారం గురించి వివరించారు. బాల కార్మికులను, బాల్యవివాహాలు జరుగుతున్నట్టు గుర్తించిన వెంటనే హెల్ప్ లైన్ 1098కి ఫోన్ చేసి సహాయం పొందాలని సూచించారు. ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్, వాట్సాప్ తదితర మాధ్యమాలలో అపరిచిత వ్యక్తుల నుంచి అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. సెల్ఫోన్లో వలన కలుగుతున్న పలు అనర్థాలను తెలియజేశారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని తెలియని లింకులను ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు చెప్పవద్దని విజ్ఞతతో వ్యవహరించాలని అన్నారు . ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం రజియా బేగం, ఉప సర్పంచ్ చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి

◆ ఆమె సేవలను కొనియాడిన జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి నాగరాజు

నేలకొండపల్లి, నవంబర్ 19 ప్రజా జ్యోతి: భారత మాజీ ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ జయంతిని జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి నాగరాజు మాట్లాడుతూ, ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పేదల సంక్షేమం, దేశ సమగ్రత, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదన్నారు. బ్యాంకుల జాతీయకరణ, గరీబీ హఠావో నినాదంతో పేద ప్రజలకు అండగా నిలిచారని, బంగ్లాదేశ్ విముక్తి, దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేయడంలో ఆమె చూపిన ధైర్యసాహసాలు దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినవని పేర్కొన్నారు. మహిళా



సాధికారతకు, రైతులు, కార్మికులు, యువత అభ్యున్నతికి ఆమె తీసుకున్న నిర్ణయాలు నేటికీ ఆదర్శప్రాయమని తెలిపారు. ఇందిరా గాంధీ ఆశయాలను, ఆదర్శాలను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆలయ దొంగల ముఠా అరెస్ట్!

◆ ఓం శక్తి, సాయిబాబా ఆలయాల్లో చోరీ కేసును ఛేదించిన పోలీసులు


◆ ముగ్గురు నిందితుల అరెస్ట్.. రూ.7.54 లక్షల సొత్తు స్వాధీనం

◆ నిందితులపై ఇప్పటికే 33 చోరీ కేసులు!

అశ్వాపురం, నవంబర్ 19:ప్రజాజ్యోతి అశ్వాపురం మండలంలోని ఓం శక్తి, సాయిబాబా ఆలయాల్లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.7.54 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

తాళాలు పగలగొట్టి ఆభరణాల చోరీ

ఈ నెల 12, 13 తేదీల మధ్య అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయాల తాళాలు పగలగొట్టి 105 గ్రాముల బంగారు ఆభరణాలు, 7 కిలోల 900 గ్రాముల వెండి వస్తువులను అపహరించారు. ఆలయ సూపర్‌వైజర్ ఫిర్యాదుతో



పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వాహనాల తనిఖీల్లో పట్టుబడిన నిందితులు

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాలతో డీఎస్పీ అరుణ్ కుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు రంగంలోకి



దిగాయి. గురువారం గొల్లగూడెం శివారులోని సీతారామ కెనాల్ బ్రిడ్జి వద్ద తనిఖీల సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా ఆలయ చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు.

ముగ్గురిపై 33 చోరీ కేసులు

అరెస్టయిన వారు షేక్ జానీ అలియాస్ జానీ షరీఫ్, సప్కా కాంతారావు, ఊర లింగయ్యగా పోలీసులు గుర్తించారు. వీరిలో జానీపై 11, కాంతారావుపై 14, లింగయ్యపై 8 చోరీ కేసులు ఉన్నట్లు వెల్లడైంది. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ అరుణ్ కుమార్ తెలిపారు.

పోలీసు బృందానికి అభినందనలు

కేసును త్వరితగతిన ఛేదించి చోరీ సొత్తును రికవరీ చేసిన అశ్వాపురం పోలీస్ సిబ్బంది, సీసీఎస్ బృందాన్ని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఖమ్మం వైద్య కళాశాలలో

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలపై వస్తున్న వదంతులు నమ్మవద్దు

◆ ప్రిన్సిపాల్ తాటి శంకర్

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి కళాశాలలో వివిధ అవుట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీ కోసం ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ కు సంబంధించి బయట, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న తప్పుడు ప్రచారాలు, నిరాధారమైన వార్తలు పూర్తిగా అవాస్తవమని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ తాటి శంకర్ గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ పోస్టులు డబ్బులకు అమ్ముడు పోతున్నాయంటూ జరుగుతున్న అసత్య ప్రచారంలో ఎలాంటి నిజం లేదని ప్రిన్సిపాల్ తీవ్రంగా ఖండించారు.నోటిఫికేషన్ ద్వారా అందిన దరఖాస్తులు ప్రస్తుతం ఇంకా పరిశీలన దశలోనే ఉన్నాయని,ఇప్పటివరకు ఎవరికీ ఉద్యోగాలు కేటాయించలేదని తెలిపారు.దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తిగా ముగిసిన తర్వాత, ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేవలం మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా మాత్రమే అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు.నియామక ప్రక్రియకు సంబంధించిన ప్రతి సమాచారాన్ని ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్, ఎంపికైన వారి జాబితా మొదలైనవి ఎప్పటికప్పుడు కళాశాల అధికారిక వెబ్‌సైట్ **(gmckhammam.org)**, ఖమ్మం జిల్లా అధికారిక వెబ్‌సైట్ **(khammam.telangana.gov.in)** లలో అప్‌డేట్ చేయడం జరుగుతుందని ప్రిన్సిపాల్ అన్నారు.మేము ఉద్యోగాలు ఇప్పిస్తాము అంటూ ఎవరైనా మధ్యవర్తులు లేదా వ్యక్తులు మాయమాటలు చెప్పి డబ్బులు డిమాండ్ చేస్తే అభ్యర్థులు ఎవరూ నమ్మవద్దని,ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇచ్చి మోసపోవద్దని హెచ్చరించారు. అభ్యర్థులు ఎవరైనా వ్యక్తిగతంగా ఇతరులకు డబ్బులు ఇచ్చి నష్టపోతే, అందుకు ప్రభుత్వ వైద్య కళాశాల, ఖమ్మం యాజమాన్యానికి ఎటువంటి సంబంధం ఉండదని తేల్చి చెప్పారు.నిరుద్యోగ అభ్యర్థులు ఎవరూ ఆందోళన చెందవద్దని, పైన పేర్కొన్న అధికారిక వెబ్‌సైట్ల ద్వారా వచ్చే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

◆ ఎయిడ్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ కే శ్రీనివాస్ ◆ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలల హక్కుల వారోత్సవాలు

బోనకల్, నవంబర్ 19 (ప్రజా జ్యోతి): బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు కళాశాల ప్రిన్సిపాల్ లగంనేని నళిని శ్రీ అధ్యక్షతన గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎయిడ్ సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాలల హక్కులను సద్వినియోగం చేసుకోవాలని బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. కళాశాల స్థాయి నుంచి ఉన్నత లక్ష్యం ఏర్పాటు చేసుకొని క్రమశిక్షణతో పట్టుదలగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణ పట్టుదలతో చదివి కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ ,బాలల మానవ అక్రమ రవాణా, లైంగిక దాడులు తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. భావోద్వేగాన్ని



అదుపులో ఉంచుకొని తల్లిదండ్రులు గురువులు చూపిన బాటలో నడవాలని హితవు పలికారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ నషా ముక్తి భారత్ నిర్మించాలని అన్నారు. బాలల సమస్యల పరిష్కారానికి చైల్డ్ హెల్ప్ లైన్ 108 కు లేదా పోలీస్ డయల్ 100 కు ఫోన్ చేసి తెలపాలన్నారు. కెరీర్ గైడెన్స్ మనోవికాసం ఆత్మస్థైర్యంగా సమస్యలు ఎదుర్కోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాల బాలికలు బాల్యవివాహాలకు మరియు మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.



ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంతోటి తిరుపతిరావు, అధ్యాపకులు జోనతాన్ బాబు, రాజేంద్ర కుమార్, లక్ష్మీకాంతం, పద్మావతి, రామకృష్ణ, రమేష్, రాజేంద్ర, ప్రియ కుమార్ రెడ్డి, మురళీకృష్ణ, యశోద, శాంతిప్రియ , లైబ్రరీ యన్ ఎ.మోహన్, యు డి సి మదర్ సాహెబ్, జశ్వంత్, బుజ్జమ్మ, అరుణ, టీమ్ నెంబర్ రాందాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు, నవంబర్ 19, ప్రజాజ్యోతి...గిన్నెల షాపుల గోల్ మాల్ పై ప్రజాజ్యోతి కథనం ఇంకా మరువక ముందే.. మరో సంచలన విషయం బయటకు వచ్చింది. మణుగూరులో గిన్నెల వ్యాపారం చేస్తున్న ఓ వ్యాపారి.. ఇప్పుడు





ఒక పక్క గిన్నెల దందా...

మరో పక్క సింగరేణి సర్వేలో 50 ఫేక్ పేర్లు...!

◆ అమాయకుల పేర్లతో కోట్లు కొల్లగొట్టేందుకు గిన్నెల వ్యాపారి స్కెచ్..?

◆ ఓసీ విస్తరణ సర్వేలో అక్రమంగా నమోదైన 50 పేర్లు.. ఎవరివి..?

◆ ఆ వ్యాపారికి ఏ అధికారితో సంబంధం..? ఏ మధ్యవర్తులతో బేరం ఏంటి..?

◆ పేర్లు నమోదు కావడం వెనుక పెద్ద కుట్ర..?

◆ వెంటనే సర్వే లిస్ట్ బహిర్గతం చేయాలి.. సీబీఐ విచారణ జరిపించాలని నిర్వాసితుల డిమాండ్.

సింగరేణి ఓసీ విస్తరణ సర్వేలో కూడా చేతులు పెట్టాడని ఫ్లాష్ న్యూస్ బయటకు వచ్చింది. సింగరేణి ఓసీ విస్తరణ సర్వేలో దాదాపు 50 మంది పేర్లు అక్రమంగా నమోదు చేయించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ పేర్లు ఎవరివి..? వాళ్ళు నిజంగా నిర్వాసితులేనా..? లేక కాగితాల మీద మాత్రమే సృష్టించిన పేర్లా..? అన్న అనుమానం ఇప్పుడు మణుగూరులో పెద్ద చర్చకు దారి తీసింది.

అమాయకులను అడ్డం పెట్టుకుని..!

అమాయకులను అడ్డం పెట్టుకుని ఓ గిన్నెల వ్యాపారి ఈ అక్రమానికి పాల్పడ్డారని తెలుస్తోంది. పేదవాళ్ళకు ఏదో ఆశ చూపి.. వారి పేర్లు, ఆధార్ లు, పత్రాలు తీసుకుని.. సర్వేలో నమోదు చేయించారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అసలు వాళ్ళకు ఈ సర్వే పల్ల వచ్చే నష్టం, లాభం ఏంటో కూడా తెలియదని కూడా వినపడుతోంది. ఒకవేళ ఈ 50 పేర్లు నిజమైతే.. భవిష్యత్తులో వారి పేరుతో కోట్ల రూపాయల పరిహారం, ఉద్యోగాలు, ఇళ్ల స్థలాలు కొల్లగొట్టేందుకు పథకం వేసినట్టేనని అనుమానం వ్యక్తం అవుతోంది. గిన్నెల వ్యాపారంలో పేదల జేబులు కొట్టినట్టే.. ఇక్కడ కూడా అమాయకుల పేరుతో కోట్లు కొట్టేయాలన్నదే ఈ స్కెచ్ అని స్పష్టంగా తెలుస్తోంది.

అసలు లింక్ ఏంటి..?

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది..

మణుగూరులో గిన్నెల దందాతో మొదలైన గోల్ మాల్.. ఇప్పుడు సింగరేణి ఓసీ విస్తరణ వరకు పాకింది. పేదల జేబులు కొట్టిన చేతులే.. ఇప్పుడు సర్వే లిస్ట్ లో పేర్లు నమోదు చేయించే స్థాయికి ఎదిగాయా..? అమాయకులను అడ్డం పెట్టుకుని.. అధికారులను, మధ్యవర్తులను మేనేజ్ చేసి.. దాదాపు 50 ఫేక్ పేర్లు సర్వేలోకి ఎలా వచ్చాయి..? కోట్ల పరిహారం కోసం వేసిన ఈ స్కెచ్ వెనుక ఎవరున్నారు..? అసలైన నిర్వాసితులు నిలదీస్తున్న ప్రశ్నలకు సమాధానం ఏది..? "ప్రజాజ్యోతిలో ఇన్వెస్టిగేషన్ కథనం"..

ఒక సాధారణ గిన్నెల కొట్టు వ్యాపారికి.. సింగరేణి సర్వే అధికారులతో ఏం సంబంధం..? ఆయన పెట్టిన పేర్లు దాదాపు 50 మంది పేర్లు ఎలా నమోదు అయ్యాయి..? ఇటు సింగరేణి అధికారులతో, అటు రెవిన్యూ అధికారులతో సంబంధం లేనిదే..? మధ్యవర్తులతో బేరం లేనిదే.. ఇన్ని పేర్లు నమోదు కావు కదా అని అసలైన నిర్వాసితులు నిలదీస్తున్నారు. సర్వే చేసే అధికారులకు, మధ్యవర్తులకు, ఈ వ్యాపారికి మధ్య ఏం ఒప్పందం జరిగింది..? ఎంత మొత్తం చేతులు మారింది..? అన్నది చర్చనీయంశంగా మారింది. ఈ వ్యవహారంపై సింగరేణి, రెవిన్యూ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు. గిన్నెల దందాపై తనిఖీలు చేయాలని అడిగినప్పుడే అధికారులు పట్టించుకోలేదు.. ఇప్పుడు సింగరేణి సర్వేలో కూడా ఇదే నిర్లక్ష్యం కొనసాగితే.. అసలైన నిర్వాసితులకు తీరని అన్యాయం జరుగుతుందని పలువురు హెచ్చరిస్తున్నారు.

ట్యాంక్ నిర్మాణంపై కోట్ల ప్రజా ధనం మట్టిపాలు..!

◆ నాసిరకం ట్యాంక్ పై కలెక్టర్ చర్యలేవి..?

◆ వంగితే వంగనీ.. అప్పుడు చూద్దాంలే అనే ధోరణిలో పబ్లిక్ హెల్త్ అధికారులు..!

◆ ట్యాంక్ పైప్ లైన్ కోసం గుంటలు తవ్వారు.. కానీ అక్కడక్కడా పైపులే వేయలేదు..!

◆ కాంట్రాక్టర్ ను బ్లాక్ లిస్ట్ లో పెట్టాలి.. అధికారులపై వేటు వేయాలని స్థానికుల డిమాండ్..!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు, నవంబర్ 19, ప్రజాజ్యోతి.. మణుగూరు భగత్ సింగ్ నగర్ లో 2 కోట్ల 28 లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మిస్తున్న అమృత్ నీటి ట్యాంక్ పనులు పూర్తి కాకముందే ఒక పక్కకు వంగిపోయి అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అక్కడి స్థానికులు చూస్తూనే.. "ఇది నాసిరకం నిర్మాణం" అని ఆరోపిస్తున్నారు. ట్యాంక్ కూలి ఇళ్లపై పడితే మా ప్రాణాలకు ఎవరు బాధ్యులని పబ్లిక్ హెల్త్ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ట్యాంక్ నిర్మాణంలోనే కాదు.. దానికి సంబంధించిన పైప్ లైన్ పనుల్లోనూ అదే నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని చెబుతున్నారు. పైప్ లైన్ కోసం అక్కడక్కడా గుంటలు తీశారే తప్ప.. పైప్ సరిగా వేయలేదని విమర్శలు చేస్తున్నారు. రోడ్లు తవ్వి వదిలేయడంతో ప్రజలు రోజూ నరకం చూస్తున్నారని ఆవేదనగా వాపోతున్నారు. ట్యాంక్ నాసిరకం నిర్మాణంపై పత్రికలో ఎన్నిసార్లు కథనాలు వచ్చినా, స్థానికులు





ఎన్నిసార్లు చెప్పినా.. పబ్లిక్ హెల్త్ అధికారులు ఒక్కసారి కూడా అటువైపు వచ్చి తనిఖీ చేసిన పాపాన పోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పత్రిక వివరణలో మాత్రం "మేం వచ్చి పర్యవేక్షిస్తున్నాం" అని చెప్పడం పచ్చి అబద్ధమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణం పట్టించుకోకపోవడం వెనుక లక్షల కమిషన్లు..?

నిజంగా తనిఖీ చేస్తే.. తనిఖీ రిజిస్టర్, ఫోటోలు, నివేదికలు చూపించగలరా అని స్థానికులు నిలదీస్తున్నారు. ఇప్పటివరకు ఏ ఒక్క అధికారి కూడా ప్రజల ముందుకు వచ్చి సమాధానం చెప్పిన పాపాన పోలేదంటున్నారు. నాసిరకం పనులు కళ్లకు కనిపిస్తున్నా.. అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనుక కమిషన్ల వ్యవహారం ఉందని స్థానికుల్లో చర్చ జరుగుతోంది. కాంట్రాక్టర్ కు, పబ్లిక్ హెల్త్ అధికారుల మధ్య లక్షల రూపాయల కమిషన్ల కుమ్మక్కు ఉందని పలు విమర్శలు వినిపిస్తున్నాయి. అందుకే నాసిరకం సామాగ్రి వాడుతున్నా.. అధికారులు చూసీ చూడనట్టు ఉంటున్నారని స్థానికులు అంటున్నారు. పబ్లిక్ సొమ్ము ఇలా బజారుపాలు కాకూడదని.. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ రంగంలోకి దిగాలని మున్సిపాలిటీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే దానికి పబ్లిక్ హెల్త్ అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.



పద్మశాలి చేనేత కార్మికుల పెన్షన్‌లో అన్యాయం

నిబంధనలు సడలించి చేనేత కార్మికులకు న్యాయం చేయాలి

పద్మశాలి సంఘం మీడియా ఇన్‌చార్జి, సీనియర్ జర్నలిస్ట్ చింతకింది కృష్ణమూర్తి

జనగామ, నవంబర్ 19(ప్రజాజ్యోతి):

పద్మశాలి చేనేత కార్మికులకు పెన్షన్ విషయంలో ప్రభుత్వ తీరుతో తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా ఇన్‌చార్జి సీనియర్ జర్నలిస్ట్ చింతకింది కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత వృత్తినే నమ్ముకొని జీవితాంతం మగ్గంపై శ్రమిస్తున్న కార్మికులకు వయస్సుతో సంబంధం లేకుండా వారి వృత్తి సేవలను గుర్తించి తగిన పెన్షన్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.మగ్గం మీద నిరంతరం శ్రమిస్తూ అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న చేనేత కార్మికులకు పెన్షన్ అందించే విషయంలో ప్రస్తుత నిబంధనలను సడలించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చేయూత పెన్షన్లలో భాగంగా 50 సంవత్సరాలు దాటిన చేనేత కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వయోపరిమితిని 50 సంవత్సరాలకు తగ్గించి, అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి చేయూత పెన్షన్ అందించాలని కోరారు.చేనేత కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తే సహించేది లేదని, పెన్షన్ విషయంలో న్యాయం జరిగే వరకు పద్మశాలి సంఘం కార్మికుల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించి, అర్హులైన ప్రతి కార్మికుడికి పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కార్మికుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.



పెట్టుబడుల్లో 'ఇండియా ఫస్ట్'

వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెంచాలి
పారిశ్రామిక రంగానికి ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ, నవంబర్ 19(ప్రజాజ్యోతి): భారత్‌ను స్వయం సమృద్ధి దేశంగా తీర్చిదిద్దడంలో పరిశ్రమల పాత్ర ఎంతో కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. రాబోయే 20 ఏళ్లలో ప్రతి దీర్ఘకాలిక పెట్టుబడి నిర్ణయంలోనూ 'ఇండియా ఫస్ట్' అనేదే ప్రాతిపదికగా ఉండాలని పారిశ్రామిక రంగానికి సూచించారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో పెట్టుబడులు గణనీయంగా పెంచాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధికి ఇంకా ఎలాంటి సంస్కరణలు అవసరమో ఎలాంటి సంకోచం లేకుండా తనకు నేరుగా తెలియజేయాలని పరిశ్రమల ప్రతినిధులను కోరారు. దిల్లీలో జరిగిన ఫిక్కీ వార్షిక సర్వసభ్య సమావేశం, వార్షిక సదస్సులో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. భారత్ 2047 లక్ష్యంగా దేశ ఆర్థికాభివృద్ధి, పరిశ్రమల వృద్ధి, అంతర్జాతీయ పోటీలో భారత స్థానం వంటి అంశాలపై మాట్లాడారు. పరిశ్రమలు, రైతులు, చిన్న వ్యాపారులు, సంపద సృష్టికర్తలు, పన్నులు చెల్లించే వారిని గౌరవించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. దేశీ వస్తువుల వినియోగం, స్వయం సమృద్ధి గురించి మహాత్మాగాంధీ 1930లో ఇచ్చిన సందేశాన్ని మోదీ ఈ సందర్భంగా గుర్తుచేశారు. దాదాపు వందేళ్లు గడిచినా దేశం ఇంకా అదే సందేశాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. పారిశ్రామిక రంగం స్వదేశీ ఉత్పత్తులకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వందేళ్ల క్రితమే గాంధీజీ స్వదేశీ, స్వయం సమృద్ధి గురించి చెప్పారని, ఇప్పటికీ తాను అదే విషయాన్ని చెప్పాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. పరిశ్రమలు ఈ దిశగా మరింత వేగంగా అడుగులు వేయాలని కోరారు. దేశీయంగా తయారయ్యే వస్తువుల నాణ్యతను పెంచి, అంతర్జాతీయ మార్కెట్లలో పోటీ పడే స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. గత ప్రభుత్వాల సమయంలో పరిశ్రమలకు ఎదురైన అనుభవాలు చేదుగా ఉండేవని మోదీ వ్యాఖ్యానించారు. ఆ ప్రభావం ఇప్పటికీ పరిశ్రమలకు,



ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య సంబంధాలపై కనిపిస్తోందని అన్నారు. అయితే ఇది పాత ప్రభుత్వం కాదని, పరిశ్రమలను మిత్రులుగా భావించే ప్రభుత్వమని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి అవసరమైన మార్పులు, సంస్కరణలపై పరిశ్రమల ప్రతినిధులు బహిరంగంగా తమ అభిప్రాయాలు చెప్పాలని కోరారు. ఎలాంటి భయం, సంకోచం లేకుండా తనకు నేరుగా లేఖలు రాయాలని సూచించారు. పరిశ్రమల సూచనలను ప్రభుత్వం స్వీకరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెంచాల్సిన అవసరం ఉందని ప్రధాని స్పష్టం చేశారు. విదేశీ మార్కెట్లలో ఏయే భారతీయ ఉత్పత్తులకు డిమాండ్ ఉందో గుర్తించి, అందుకు అనుగుణంగా ఉత్పత్తులు తయారు చేయాలని పరిశ్రమలకు సూచించారు. ఆయా దేశాల అవసరాలకు అనుగుణంగా రైతుల నుంచి పంటలను సేకరించే పటిష్ఠమైన వ్యవస్థలను ఏర్పాటు చేయాలని అన్నారు. దీనివల్ల రైతులకు మేలు జరగడంతోపాటు భారతీయ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లో గుర్తింపు లభిస్తుందని వివరించారు. మరోవైపు, ఔషధ తయారీ రంగంలోనూ భారత్ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ప్రపంచానికి మందులు అందించే దేశంగా భారత్‌కు గుర్తింపు ఉన్నప్పటికీ, ఔషధాల తయారీలో ఉపయోగించే కీలక ముడి పదార్థాలు, యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియెంట్స్ (ఏపీఐ), బల్క్ డ్రగ్స్, ఇతర ఔషధ మధ్యవర్తి పదార్థాలను భారీగా దిగుమతి చేసుకుంటున్నామని గుర్తుచేశారు. వీటిలో ఏయే పదార్థాలను దేశీయంగా తయారు చేయవచ్చో పరిశ్రమలు గుర్తించాలని అన్నారు. కొత్త సాంకేతికత, భారీ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుపై పెట్టుబడులు పెట్టాలని సూచించారు. దిగుమతులపై ఆధారపడటం తగ్గితే ఔషధ రంగంలో భారత్ మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. పన్నుల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను మోదీ ప్రస్తావించారు. 2014లో 30 శాతంగా ఉన్న ప్రాథమిక కార్పొరేట్ పన్ను రేటును 22 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. వ్యక్తిగత ఆదాయపు పన్ను విధానంలోనూ మార్పులు తీసుకొచ్చామని, కొత్త పన్ను విధానంలో ఏడాదికి రూ.12 లక్షల వరకు ఆదాయంపై పన్ను భారం లేకుండా చేశామని పేర్కొన్నారు. పన్ను రిటర్నుల దాఖలు, వాపసు ప్రక్రియలను కూడా సులభతరం చేశామని చెప్పారు. గతంలో పన్ను వాపసు రావడానికి నెలల సమయం పట్టేదని, ఇప్పుడు చాలా సందర్భాల్లో వారంలోపే వస్తోందని వివరించారు. అయితే ప్రభుత్వం కార్పొరేట్ పన్నులను తగ్గించినప్పుడు పరిశ్రమలు కూడా తమ ఉద్యోగుల సంఖ్యను పెంచాయా, వారి వేతనాలను పెంచాయా అని ప్రశ్నించారు. పన్ను రాయితీల ప్రయోజనాలు ఉద్యోగులకు, దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా అందాలని సూచించారు. గత వందేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ అనేక మార్పులను చూసిందని మోదీ అన్నారు. లైసెన్స్ కోటా రాజ్, జాతీయీకరణ విధానాల నుంచి మొదలుకొని ఒక దశలో ప్రపంచంలోని బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ గుర్తింపు పొందిన పరిస్థితులను ప్రస్తావించారు. అయితే గత 12-13 ఏళ్లలో ప్రజలు, రైతులు, యువత, కార్మికులు, పారిశ్రామిక రంగం చేసిన కృషితో పరిస్థితులు మారాయని చెప్పారు. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతోందని, దాదాపు 7 శాతం వృద్ధిని నమోదు చేయవచ్చని అంతర్జాతీయ సంస్థలు అంచనా వేస్తున్నాయని తెలిపారు.

ఫిబ్రవరి 24 నుంచి ఇంటర్ పరీక్షలు

మొదటిపేజీ తరువాయి..

మధ్యాహ్నం 12 గంటల వరకు థియరీ పరీక్షలు నిర్వహించనున్నారు. తెలంగాణ ఇంటర్ ఫస్టియర్ పరీక్షల షెడ్యూల్ 2027 ఫిబ్రవరి 24 - సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1 ఫిబ్రవరి 26 - ఇంగ్లీష్ పేపర్-1 మార్చి 2 - మ్యాథమెటిక్స్-ఐఐ, బోటనీ-1, పొలిటికల్ సైన్స్-1, అకౌంటెన్సీ-1 మార్చి 5 - మ్యాథమెటిక్స్-ఏ, జువాలజీ-1, హిస్టరీ-1, కామర్స్-1 మార్చి 9 - ఫిజిక్స్-1, ఎకనామిక్స్-1 మార్చి 12 - కెమిస్ట్రీ-1, కామర్స్ అండ్ అకౌంటెన్సీ-1 మార్చి 17 - పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-1, ఎంఈసీ విద్యార్థులకు మ్యాథమెటిక్స్-1 మార్చి 19 - మోడ్రన్ లాంగ్వేజ్-1, జాగ్రఫీ-1, బైపీసీ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు మ్యాథమెటిక్స్-1 తెలంగాణ ఇంటర్ సెకండియర్ పరీక్షల షెడ్యూల్ 2027 ఫిబ్రవరి 25 - సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2 ఫిబ్రవరి 27 - ఇంగ్లీష్ పేపర్-2 మార్చి 3 - మ్యాథమెటిక్స్-ఐఐఐ, బోటనీ-2, పొలిటికల్ సైన్స్-2 మార్చి 8 - మ్యాథమెటిక్స్-ఏఏబీ, జువాలజీ-2, హిస్టరీ-2 మార్చి 12 - ఫిజిక్స్-2, ఎకనామిక్స్-2 మార్చి 16 - కెమిస్ట్రీ-2, కామర్స్ అండ్ అకౌంటెన్సీ-2 మార్చి 18 - పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-2 మార్చి 20 - మోడ్రన్ లాంగ్వేజ్-2, జాగ్రఫీ-2, బైపీసీ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు మ్యాథమెటిక్స్-2 .

సైన్స్ గ్రూపుల విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షల తేదీలను కూడా ఇంటర్ బోర్డు ప్రకటించింది. సెకండియర్ విద్యార్థులకు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు ఉంటాయి. ఆదివారాలు కూడా పరీక్షలు నిర్వహించనున్నారు.ఫస్టియర్ సైన్స్ ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 11వ తేదీ నుంచి 18వ తేదీ వరకు 3 సెషన్లలో నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు విడుదల చేసిన ప్రెస్ నోట్‌లో పేర్కొంది. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు మొదటి సెషన్.. మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు రెండో సెషన్.. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మూడో సెషన్ ఉంటుంది. ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్‌తో పాటు ఇతర పరీక్షల తేదీలను కూడా బోర్డు ప్రకటించింది. జనవరి 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఫస్టియర్ ఇంటర్నల్ అసెస్‌మెంట్.. జనవరి 27వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష.. జనవరి 29వ తేదీన ఉదయం 10



నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష.. జనవరి 29వ తేదీన ఫస్టియర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష.. జనవరి 30వ తేదీన సెకండియర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించనున్నారు. జనరల్ కోర్సులతో పాటు ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు కూడా థియరీ పరీక్షల తేదీలు వర్తిస్తాయని ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది. అయితే ఒకేషనల్ సబ్జెక్టులకు సంబంధించిన ప్రత్యేక టైమ్‌టేబుల్‌ను తర్వాత విడుదల చేయనుంది. ప్రస్తుతం ప్రకటించిన షెడ్యూల్ తాత్కాలికమైనదని.. పరీక్షల తేదీలు లేదా ఇతర వివరాల్లో మార్పులు ఉంటే బోర్డు అధికారిక ప్రకటనల ద్వారా తెలియజేస్తుందని పేర్కొంది. విద్యార్థులు ఇప్పటి నుంచే పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని, తాజా సమాచారం కోసం ఇంటర్ బోర్డు అధికారిక ప్రకటనలను గమనించాలని సూచించింది.

ప్రపంచ శాంతికి కలిసి నడుద్దాం



మొదటిపేజీ తరువాయి..

చైనాకు రష్యా, అమెరికా అధ్యక్షులు కృతజ్ఞతలు తెలిపారు. భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశాలుగా ఉన్న రష్యా, చైనా, అమెరికాలు ప్రపంచ సవాళ్లకు మరింత సమర్థవంతంగా స్పందించేలా, అంతర్జాతీయ శాంతి భద్రతలను కాపాడే తన ప్రాథమిక లక్ష్యాన్ని నెరవేర్చేలా ఐరాసను సంస్కరించడానికి కట్టుబడి ఉన్నాయని ఈ ప్రకటన పేర్కొంది. అన్ని దేశాల ప్రయోజనార్థం శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల ఉత్పత్తిని, సరఫరాను పెంచడానికి కూడా మూడు దేశాలు అంగీకరించాయి. స్థిరమైన ఇంధన సరఫరా ప్రాముఖ్యతను ఇవి పునరుద్ఘాటించాయి. చట్టపరమైన అంశాల విషయానికొస్తే, దేశాల సమ్మతి (ప్రిన్సిపుల్ ఆఫ్ స్టేట్ కన్సెంట్), దేశాధినేతలు, అధికారుల రక్షణ హక్కులను (ఇమ్యూనిటీస్) గౌరవించడం వంటి ప్రాముఖ్యతను నేతలు గుర్తించారు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ), ఇతర సారూప్య సంస్థలు తమ అధికార పరిధిని దుర్వినియోగం చేయకూడదని అంగీకరించారు. అణు యుద్ధంలో ఎవరూ గెలవలేరని, అది ఎన్నటికీ జరగకూడదని ఈ ప్రకటన పునరుద్ఘాటించింది. అణు ముప్పులను తగ్గించడం, ఆయుధ వ్యాప్తిని నిరోధించడంపై మూడు దేశాలు చర్చలు జరుపుతాయని తెలిపింది. త్రైపాక్షిక సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ.. అణ్వాయుధాల సంఖ్యను తగ్గించడం, వాటి వినియోగ ముప్పును తగ్గించడంపై చర్చించడానికి తమ మూడు దేశాలు ఒక ప్రత్యేక స్థానంలో ఉన్నాయని అభివర్ణించారు."మేము నిజంగా చరిత్ర సృష్టిస్తున్నాం. భూమిపై అణ్వాయుధాల సంఖ్యను ఎలా తగ్గించాలి, ఆ ఆయుధాలను ఉపయోగించే ప్రమాదాన్ని ఎలా తగ్గించాలి అనే దానిపై చర్చించడానికి అమెరికా, రష్యా, చైనాలు ఒక ప్రత్యేక స్థానంలో ఉన్నాయి" అని ట్రంప్ అన్నారు. ప్రపంచ శాంతి, స్థిరత్వాలను పరిరక్షించడంలో ప్రధాన శక్తుల మధ్య సహకారం ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ, ఈ శిఖరాగ్ర సమావేశం 'అత్యంత చారిత్రాత్మక ప్రాముఖ్యత' కలిగినదని జిన్‌పింగ్ పేర్కొన్నారు. ఎపెక్ సదస్సు కోసం చైనాలో పర్యటిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్, ఇరాన్‌లకు సంబంధించిన ప్రస్తుత వివాదాలపై అమెరికాకు ఉన్న ఆందోళనలనే చైనా కూడా వ్యక్తం చేస్తోందని పేర్కొన్నారు. వాషింగ్టన్, బీజింగ్‌ల మధ్య ఉన్న ఉమ్మడి ఆసక్తి గల అంశాలను ప్రస్తావించారు. ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉండకూడదని అమెరికా, చైనాలు చాలా బలంగా విశ్వసిస్తున్నాయని అన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు కృషి చేస్తున్నాయని తెలిపారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా కాసేపట్లో తమతో కలిసి త్రైపాక్షిక సమావేశంలో పాల్గొంటారని అమెరికా అధ్యక్షుడు తెలిపారు. ఈ చర్చలకు సిద్ధమయ్యే క్రమంలో ఇప్పటికే పుతిన్‌తో తాను క్లుప్తంగా మాట్లాడానని చెప్పారు. "రష్యా అధినేత పుతిన్ కొద్దిసేపట్లో ఇక్కడికి రానున్నారు. అప్పుడు మేము ముగ్గురం (జిన్‌పింగ్, ట్రంప్, పుతిన్) కలిసి ఒక త్రైపాక్షిక సమావేశాన్ని నిర్వహిస్తాం. ఈ భేటీ కోసం నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. చర్చలకు వేదిక సిద్ధం చేసేందుకు ఇప్పటికే పుతిన్‌తో చిన్నపాటి సమావేశం నిర్వహించాను" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.ఈ ప్రతిపాదిత త్రైపాక్షిక సమావేశంలో ఇరాన్ వివాదం, అణు నిరాయుధీకరణ, ప్రపంచ వాణిజ్యం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వంటి కీలక అంతర్జాతీయ అంశాలపై ముగ్గురు దేశాధినేతలు చర్చించే అవకాశం ఉంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ఎపెక్ శిఖరాగ్ర సమావేశంలో మూడు ప్రధాన శక్తుల నేతలు భేటీ అవుతున్నారు. ఈ మీటింగ్‌లో నాయకులు పరస్పర సహకార రంగాలను అన్వేషించనున్నారు. కాగా, తన చైనా పర్యటనలో భాగంగా ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తోనూ సమావేశం కావాలని ట్రంప్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. శాంతియుత అణుశక్తి, డిజిటల్ పరిష్కారాలు, ఏఐ రంగాల్లో మాస్కో ముందంజలో ఉందని అన్నారు. అదే సమయంలో ప్రాంతీయ వాణిజ్యం, దేశీయ ఆర్థిక వృద్ధి గురించి ప్రస్తావించారు. ఎపెక్ సభ్య దేశాలు జాతీయ స్వాతంత్ర్యం, భద్రతకు భరోసా కల్పించే విధంగా ఉంటే ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో అత్యున్నత సాంకేతిక, శాస్త్ర ఆధారిత రంగాలలో సహకరించడానికి రష్యా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రపంచ అభివృద్ధికి ఆసియా- పసిఫిక్ ప్రాంతాన్ని ఒక ప్రధాన చోదక శక్తిగా అభివర్ణించారు. మేము అగ్రస్థానంలో ఉన్న శాంతియుత అణుశక్తి వంటి శాస్త్ర ఆధారిత రంగాలలో ఎపెక్ సభ్య దేశాలతో సన్నిహిత సహకారంపై రష్యా ఆసక్తిగా ఉంది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అనేక మంది భాగస్వాములతో రష్యా చురుగ్గా పనిచేస్తోంది. డిజిటల్ పరిష్కారాలు, కృత్రిమ మేధస్సుకు సంబంధించిన మా సామర్థ్యాలను సభ్య దేశాలతో పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రపంచ అభివృద్ధికి ఆసియా-పసిఫిక్ ప్రాంతం ఒక ప్రధాన చోదక శక్తి. 2026 నాటికి ఎపెక్ ఆర్థిక వ్యవస్థలు ప్రపంచ సగటును మించి 4.7 శాతం వృద్ధిని సాధిస్తాయని అంచనా వేస్తున్నాం. అంతేకాకుండా ఈ ఏడాది మొదటి ఎనిమిది నెలల్లో ఎపెక్ కూటమితో రష్యా వాణిజ్య పరిమాణం గణనీయంగా పెరిగింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతం తన ఆర్థిక, లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని స్థిరమైన వేగంతో బలోపేతం చేసుకుంటోంది. ఎపెక్ ఆర్థిక వ్యవస్థలతో భాగస్వామ్యం రష్యా వ్యూహాత్మక మార్గం. మేము ఈ ప్రాంతంలో విదేశీయరాని భాగం. దాని శ్రేయస్సుకు గణనీయమైన తోడ్పాటును అందిస్తున్నామని తెలిపారు. ఆసియా- పసిఫిక్ ప్రాంతంలో ఎటువంటి ఇబ్బందుల్లేని ఆర్థిక వాతావరణాన్ని నిర్ధరించే లక్ష్యంతో రష్యా తన ప్రధాన కార్యక్రమమైన 'బిగ్ యురేషియన్ పార్టనర్‌షిప్'ను చురుగ్గా ముందుకు తీసుకువెళ్తోందని పుతిన్ స్పష్టం చేశారు. యురేషియన్ ఎకనామిక్ యూనియన్, షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) యంత్రాంగాలను ఏకం చేసే ఒక సమైక్య కేంద్రంగా తాము ఈ భాగస్వామ్యాన్ని చూస్తున్నామని పేర్కొన్నారు. గత మూడేళ్లలో రష్యా వాస్తవ జీడీపీ 10 శాతానికి పైగా వృద్ధి చెందిందని వెల్లడించారు. పారిశ్రామిక సామర్థ్యం, సాంకేతికత, అణుశక్తిపై కేంద్రీకరించిన నిర్మాణాత్మక సంస్కరణల వల్ల ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. అదే సమయంలో ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసే ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. రష్యా దేశీయ ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్ని సమూలంగా మార్చామని చెప్పారు. డిజిటల్ టెక్నాలజీలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అణుశక్తికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కొనుగోలు శక్తి సమానత్వం (పీపీపీ) పరంగా రష్యా ప్రపంచ అగ్రగామి దేశాలలో ఒకటిగా నిలిచిందని వెల్లడించారు.

దూసుకొస్తున్న అక్వాన్ తుఫాన్..

ఉత్తరాంధ్ర-ఒడిశా మధ్య తీరందాటే ఛాన్స్- తెలంగాణకు 2 రోజులు భారీ వర్ష సూచన

హైదరాబాద్, నవంబర్ 19(ప్రజాజ్యోతి):

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుఫాను అక్వాన్ కదలికల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. తొలుత అంచనా వేసిన ప్రాంతానికి కాకుండా దిశ మార్చుకుని ఉత్తరాంధ్ర-ఒడిశా మధ్య తీరం దాటే అవకాశాలున్నాయని తాజా వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి. తుఫాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ



తెలిపింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అక్వాన్ తుఫాను ఉత్తర దిశగా కదులుతోంది. నవంబర్ 19వ తేదీన ఉదయం 8.30 గంటల నాటికి 14.9 డిగ్రీల ఉత్తర అక్షాంశం, 85.3 డిగ్రీల తూర్పు రేఖాంశం వద్ద కేంద్రీకృతమై ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. నర్సాపూర్‌కు తూర్పు-ఆగ్నేయంగా 420 కిలోమీటర్లు, కళింగపట్నానికి దక్షిణ-ఆగ్నేయంగా 400 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు తెలిపింది. తొలుత తుని-నెల్లూరు మధ్య అక్వాన్ తుఫాను తీరం దాటవచ్చని అంచనా వేయగా.. ఆ తర్వాత కాకినాడ-కోనసీమ ప్రాంతం వైపు దిశ మారవచ్చని భావించారు. తాజా అంచనాల ప్రకారం ఉత్తరాంధ్ర-ఒడిశా మధ్య, శ్రీకాకుళం పరిసర ప్రాంతాల్లో తీరం దాటే అవకాశం ఉందని సమాచారం. తుఫాను సముద్రంలోనే క్రమంగా బలహీనపడే సూచనలు ఉన్నాయని.. దీంతో గాలుల వేగం, వర్షాల తీవ్రత తగ్గే అవకాశముందని తాజా అంచనాలు పేర్కొంటున్నాయి. అక్వాన్ తుఫాను ప్రభావంతో తెలంగాణలోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయని పేర్కొంది. శుక్రవారం తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. వర్షాలతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఉరుములు, మెరుపులు కూడా సంభవించవచ్చని హెచ్చరించారు. ముఖ్యంగా ఉత్తర, తూర్పు జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హైదరాబాద్‌లో గురువారం పాక్షికంగా ఎండతో కూడిన వాతావరణం ఉండే అవకాశం ఉందని అంచనా వేసింది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలోనే నమోదయ్యే సూచనలు ఉన్నాయని.. నగరంలో చలి తీవ్రత కూడా ఎక్కువగా ఉండవచ్చని వాతావరణ సమాచారం పేర్కొంటోంది. ఆదిలాబాద్, నిర్మల్ వంటి ఏజెన్సీ ప్రాంతాల్లోనూ చలి ప్రభావం కనిపించే అవకాశం ఉంది. అక్వాన్ తుఫాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాబోయే మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరికలు జారీ చేసింది. తీర ప్రాంతాల్లో గాలుల తీవ్రత, సముద్ర పరిస్థితులపై అధికారులు నిఘా ఉంచారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. తీర ప్రాంత ప్రజలు వాతావరణ శాఖ తాజా హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు చెట్ల కింద నిలబడవద్దని పేర్కొన్నారు. హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాలు, శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలకు దూరంగా ఉండాలని.. బలమైన గాలులు వీచే సమయంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్తపడాలని తెలిపారు. తీర ప్రాంతాల మత్స్యకారులు అధికారుల సూచనలు పాటించాలని.. రైతులు పంటలు, కోసిన ధాన్యం విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వెల్లడించారు.

క్రమశిక్షణ విషయంలో పార్టీలో అందరూ సమానమే

మొదటిపేజీ తరువాయి..

సొంత పార్టీ తీరుపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన ఈరోజు మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. సదరు ఎమ్మెల్యేల ప్రకటనలను పార్టీ అధిష్ఠానం నిశితంగా గమనిస్తోందని మహేశ్ గౌడ్ తెలిపారు. తెలంగాణకు త్వరలో రానున్న కొత్త పార్టీ ఇన్‌ఛార్జ్ ఈ పరిణామాలను సమగ్రంగా పరిశీలిస్తారని చెప్పారు. కాంగ్రెస్ ఒక ప్రజాస్వామిక పార్టీ అని, దేనికైనా సరైన సమయం ఉంటుందని పేర్కొన్నారు. గతంలో కొండా సురేఖ వ్యవహారంలోనూ చర్యలకు ముందు పలు అవకాశాలు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇదే సమయంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌పై మహేశ్ గౌడ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి విషయంలో జరిగిన తప్పిదాలను



కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొత్త డ్రామాలకు తెరలేపారని ఆయన ఆరోపించారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే అంగీకరించిందని, ఇప్పుడు కేంద్ర బలగాలు డ్యామ్‌ల వద